గురువారం
26-6-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 275
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

రక్షణ వ్యయం పెంపునకు 'నాటో' అంగీకారం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒత్తిడి తర్వాత రక్షణ వ్యయంలో భారీ పెంపునకు నాటో సభ్యులు అంగీకరించారు. దాడి జరిగితే ఒకరికొకరు సహాయం చేసుకోవడానికి తమ నిబద్ధతను వ్యక్తం చేశారు. బుధవారం జరిగిన నాటో శిఖరాగ్ర సమావేశంలో 32 మంది సభ్యులు తుది ప్రకటనను ఆమోదించారు. "మా వ్యక్తిగత, సమష్టి బాధ్యతలను నిర్ధరించడానికి 2035 నాటికి ప్రధాన రక్షణ అవసరాలతో పాటు రక్షణ, భద్రతా సంబంధిత ఖర్చులపై ఏటా జీడీపీలో 5 శాతం పెట్టుబడి పెట్టడానికి మిత్రదేశాలు కట్టుబడి ఉన్నాయి" అని నాటో సభ్యులు తెలిపారు.

సీబీఎస్ఈ 10 పరీక్షలు ఏడాదికి రెండుసార్లు

న్యూఢిల్లీ: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) కీలక నిర్ణయం తీసుకుంది. 2026 నుంచి సీబీఎస్ఈ 10వ తరగతి పరీక్షలు ఏడాదిలో రెండుసార్లు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. మొదటి విడత పరీక్షలు ఫిబ్రవరిలో ఉంటాయి. ఈ పరీక్షలకు విద్యార్థులంతా తప్పనిసరిగా హాజకావాల్సి ఉంటుంది. ఇక రెండో విడత పరీక్షలు మేలో ఉంటాయి. ఇది ఐచ్ఛికం. తమ సామర్థ్యం పెంచుకోవాలని ఆశించే విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. ఇంటర్నల్ అసెస్‌మెంట్ మాత్రం అకడమిక్

- మిగతా 2 లో

యురేనియం శుద్ధి చేస్తే ఇరాన్‌పై దాడి

వాషింగ్టన్: ఇరాన్ యురేనియం శుద్ధి చేయరాదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించారు. టెహ్రాన్ మరోసారి అణ్వాయుధ కార్యక్రమం జోలికి వెళితే మళ్లీ దాడులు చేస్తామని హెచ్చరించారు. ఇరాన్ మద్దతున్న సాయుధ ముఠాల ఆర్థిక మూలాలపై ఇజ్రాయిల్ దాడుల తీవ్రత పెంచిన క్రమంలో అమెరికా అధ్యక్షుడి నుంచి ఈ హెచ్చరికలు వచ్చాయి. ఇక ఇజ్రాయిల్ వైమానిక దళం దక్షిణ లెబనాన్‌లోని అల్ సాదిక్ కరెన్సీ

- మిగతా 2 లో

భారత్‌తో చర్చలకు సిద్ధం

ఇస్లామాబాద్: భారత్‌తో అర్థవంతమైన చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తాజాగా మరోసారి ప్రకటించారు. సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ (ఎంబీఎస్)తో ఇటీవల జరిపిన టెలిఫోన్ సంభాషణలో షరీఫ్ ఈ అంశాన్ని ప్రస్తావించినట్లు రేడియో పాకిస్థాన్ తెలిపింది. జమ్మూకశ్మీర్ సమస్య, ఉగ్రవాదం, వాణిజ్య సంబంధాలు, జలాల పంపిణీ వంటి కీలక అంశాలపై చర్చించడానికి పాకిస్థాన్ సుముఖంగా ఉందని

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఏవండోయ్..మీరు ఊరు వెళ్లాల్సింది వచ్చే నెల కదా?

విద్యా వ్యవస్థ
మరింత పటిష్టం

- వారంలో రెండు పాఠశాలలు సందర్శించాలి
- విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు గదులు
- సోలార్ కిచెన్ల ఏర్పాటుపై దృష్టి
- సమీక్షలో అధికారులకు రేవంత్ ఆదేశం

విశాలాంధ్ర - హైదరాబాద్: తెలంగాణలో విద్యా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు వారంలో రెండు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించాలని సూచించారు. విద్యాశాఖపై ఐసీసీసీలో బుధవారం ముఖ్యమంత్రి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో 48 వేల మంది ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు చేరారని సీఎంకు అధికారులు వివరించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నూతన తరగతి గదులు నిర్మించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు అవసరమైన వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్యాస్, కట్టెల పొయ్యిల బాధల నుంచి మధ్యాహ్న భోజన మహిళలకు విముక్తి కల్పించాలని... సోలార్ కిచెన్ల ఏర్పాటుపై తక్షణమే దృష్టి సారించాలని అధికారులకు తెలియజేశారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులంతా కచ్చితంగా ఇంటర్మీడియట్‌లో చేరేలా చూడాలని సీఎం సూచించారు. అనంతరం జీవనోపాధికి అవసరమైన నైపుణ్య కోర్సుల్లో శిక్షణ పొందవచ్చని... తద్వారా వారి జీవితానికి ఢోకా ఉండదని సీఎం అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ ఎ. శ్రీదేవసేన, విద్యా శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం.హరిత పాల్గొన్నారు.

'తెలంగాణ రైజింగ్'పై టోనీ బ్లెయిర్ ప్రశంసలు

తెలంగాణ రైజింగ్-2047పై ఇంగ్లాండ్ మాజీ ప్రధానమంత్రి టోనీ బ్లెయిర్ ప్రశంసలు గుప్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ ద్వారా అభినందనలు తెలిపారు. ఇటీవల దిల్లీలో టోనీబ్లెయిర్‌తో ముఖ్యమంత్రి సమావేశమై 'తెలంగాణ రైజింగ్ విజన్-2047 ' గురించి బ్లెయిర్‌కు వివరించారు. నిర్దేశించుకున్న మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ, పెట్టుబడుల సాధన, రైతులు, మహిళా, యువ సాధికారిత, మౌలిక వసతుల కల్పన, ఐటీ, ఇతర రంగాల అభివృద్ధి లక్ష్యాలను, చేరుకునే మార్గాలను వివరించారు. తెలంగాణ రైజింగ్ విజన్ రూపకల్పన... అమలుకు సంబంధించి లెటర్ ఆఫ్ ఇంటెంట్ టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ ఛేంజ్, తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధులు మార్చుకున్నారు. తెలంగాణ రైజింగ్ విజన్ స్పష్టత... నిర్దేశించుకున్న లక్ష్యాలు ఎంతో ఆకట్టుకున్నాయంటూ రేవంత్ రెడ్డికి ... బ్లెయిర్ అభినందనలు తెలియజేశారు. లక్ష్యాల సాధనకు ఇండియా ప్రతినిధి సహకరిస్తారని చెప్పారు. సీఎంవోకు ఏవైనా సందేహాలు ఉంటే తమ భారత ప్రతినిధిని సంప్రదించాలని సూచించారు. తెలంగాణ రైజింగ్ విజన్-2047 డాక్యుమెంట్ ఆవిష్కరణకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు సీఎంకు బ్లెయిర్ తెలియజేశారు.

'ఇండియా'తోనే
మోదీకి చెక్

- ట్రంప్ వైఖరిపై స్పందించలేని మోదీ
- దేశంలో ఎమర్జెన్సీ తరహా పాలన
- పథకాలతో అధికారం రాదు
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ
- సూపర్ 6 హామీలు, ప్రజా సమస్యలపై ఉద్యమాలకు సిద్ధం: రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : దేశంలో ఎన్డీఏ కూటమికి ఇండియా ఐక్య సంఘటనే ప్రత్యామ్నాయమని... ఇండియా ఐక్య సంఘటన పటిష్టతతోనే మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించడం సాధ్యమవుతుందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ పునరుద్ఘాటించారు. ఆ దిశగా అన్ని రాష్ట్రాల 'ఇండియా' పార్టీలు ఐక్యతతో ముందుకు నడవాలని కోరారు. ఏపీలోనూ ఇండియా ఐక్య సంఘటనను బలోపేతం చేయవలసిన అవసరం ఉందని... అందుకోసం ప్రజా సమస్యలపై సమష్టిగా పోరాడాలన్నారు. సీపీఐ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సమితి సమావేశం విజయవాడ దాసరి భవన్‌లో బుధవారం కె.శివారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఇటీవల అమరులైన వారికి రెండు నిమిషాల పాటు మౌనం పాటించి సమావేశం సంతాపం ప్రకటించింది. ఆగస్టు 23 నుంచి 25 వరకు ఒంగోలులో జరగనున్న సీపీఐ రాష్ట్ర 28వ మహాసభల ఆహ్వాన సంఘ కరపత్రాన్ని నారాయణ విడుదల చేశారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ ప్రస్తుతం దేశంలోని మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తోందన్నారు. ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య నెలకొన్న యుద్ధంలో అమెరికా ఆధిపత్యం కొనసాగిస్తోందని, దీనిపై ఇంతవరకు కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయలేదని అన్నారు. ఈ యుద్ధం వెనుక కీలకంగా ఉన్న అమెరికాతో ఎందుకు చర్చలు జరపలేకపోయారని నిలదీశారు. ఇరాన్ నుంచి మన దేశానికి చమురు నిక్షేపాలు వస్తున్న తరుణంలోను కేంద్ర ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకోలేకపోయిందని మండిపడ్డారు. పైపెచ్చు ఇంతటి సంక్లిష్ట పరిస్థితుల్లో మోదీ... ఆంధ్ర ప్రదేశ్‌కు విచ్చేసి యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారని ఎద్దేవా చేశారు. రాబోయే రోజుల్లో కమ్యూనిస్టు ఉద్యమ పంథాను మార్చాల్సిన అవసరముందన్నారు. శ్రీలంక, బంగ్లాదేశ్‌లో జరిగిన పరిణామాల గురించి ఆయన వివరించారు. 2026 నాటికల్లా మావోయిస్టులను అంతం చేస్తామంటూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించడాన్ని తప్పుపట్టారు. మావోయిస్టుల సాకుతో అమాయక గిరిజనులను బలి తీసుకుంటున్నారని, అటవీ సంపద, మైనింగ్‌ను బడా కార్పొరేట్‌లకు అప్పజెప్పడమే దీని వెనుకున్న అసలు రహస్యమని అన్నారు. దేశంలో సంపద పెరుగుతుందంటూ ప్రభుత్వం లెక్కలు చెబుతోందని, వాస్తవంగా 1 శాతం ధనికుల చేతుల్లోనే 45 శాతం సంపద ఉంటోందని, అధిక శాతం ఉన్న

- మిగతా 2 లో

కుటీర పరిశ్రమలకు ప్రోత్సాహం
చేతివృత్తి కళాకారుల స్టాల్స్ ప్రారంభోత్సవంలో భట్టి

2లో

రోదసిలోకి శుభాంశు శుక్లా
నింగిలోకి దూసుకెళ్లిన ఫాల్కన్ 9 రాకెట్

ఫ్లోరిడా (అమెరికా): భారత వ్యోమగామి శుభాంశు శుక్లా రోదసియాత్రకు బయల్దేరారు. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా మొత్తం నలుగురు వ్యోమగాములు కలిసి అంతరిక్ష యాత్రను చేపట్టారు. భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం బుధవారం 12:01గంటలకు ఫ్లోరిడాలోని నాసా కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి ఫాల్కన్-9 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. 41 ఏళ్ల తర్వాత రాకేశ్ శర్మ తర్వాత అంతరిక్షంలో అడుగుపెట్టనున్న రెండో భారతీయుడిగా, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరనున్న తొలి భారతీయుడిగా శుభాంశు శుక్లా రికార్డుల కెక్కనున్నారు. భూమి నుంచి బయల్దేరిన ఫాల్కన్-9 రాకెట్ 28గంటల తర్వాత గురువారం సాయంత్రం నాలుగున్నర గంటలకు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం-ఐఎస్ఎస్‌తో అనుసంధానం కానుంది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో), అమెరికా అంతరిక్ష

- మిగతా 2 లో

పత్రికా రంగానికి
ప్రభుత్వ అండ

- పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి కృషి
- మంత్రులు నిమ్మల, డోలా, గొట్టిపాటి, ఎంపీ మాగుంట హామీ
- ఇళ్ల స్థలాల మంజూరుపై సీఎం సానుకూలంగా ఉన్నారని వెల్లడి
- ఘనంగా ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర మహాసభ
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

విశాలాంధ్ర-ఒంగోలు: పత్రికారంగానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూల ధృక్పథంతో ఉన్నారని పలువురు రాష్ట్ర మంత్రులు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(ఏపీయుడబ్ల్యుజే) 36వ రాష్ట్ర మహాసభ బుధవారం ఒంగోలు దక్షిణ బైపాస్ లోని విష్ణుప్రియ కన్వెన్షన్‌లో ఘనంగా జరిగింది. ఏపీయుడబ్ల్యుజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టి పాటి రవికుమార్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ముందుగా వారు యూనియన్ నాయకులు, శాసనసభ్యులతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామి మాట్లాడుతూ సమాజంలో పాత్రికేయుల పాత్ర ఎంతో ముఖ్యమైందని...వారి సం క్షేమం కోసం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని

- మిగతా 2 లో

రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స

- ప్రజలకు అవగాహన కల్పించడం అధికారుల సామాజిక బాధ్యత
- సమాచారమిస్తే పోలీస్ భయం... అపోహ మాత్రమే
- సమాచార ప్రసారశాఖ ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు
- సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర - హైదరాబాద్: రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత పథకం ద్వారా చికిత్స అందించడం అధికారులు తమ సామాజిక బాధ్యతగా గుర్తించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మోటారు వాహనాల చట్టం (1988) సెక్షన్ 162 ప్రకారం "రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స పథకం-2025"ను తెలంగాణలో అమలుపై రవాణా, పోలీస్, హెల్త్ ఇన్సూరెన్స్, ఎన్ఐసీ విభాగాల అధికారులతో సచివాలయంలోని తన ఛాంబర్‌లో బుధవారం మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం... రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స పథకం తీసుకొచ్చిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ధన్యవాదాలు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరిగి ఎవరూ చనిపోకుండా ఉండడానికి ఈ పథకం ఎంతగానో దోహద పడుతుందన్నారు. బీమాతో సంబంధం లేకుండా, ప్రమాదం జరిగిన మొదటి ఏడు రోజుల్లోపు ఒక్కో బాధితుడికి రూ.1.5 లక్షలతో తక్షణ నగదు రహిత వైద్య చికిత్స అందించడం ఈ పథకం లక్ష్యమన్నారు. ఆయుష్మాన్ భారత్ పీఎంజేఏవై కింద గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో ఈ పథకం వర్తిస్తుందన్నారు. బాధితుడు 24 గంటల్లోపు ఆసుపత్రిలో చేరాల్సి ఉంటుందన్నారు. దీనిపై కింద స్థాయి పోలీస్ అధికారులకు,

- మిగతా 2 లో

3 నెలల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించండి
ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

విశాలాంధ్ర - హైదరాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. పంచాయతీ ఎన్నికలు మూడు నెలల్లో నిర్వహించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీ. మాధవీ దేవి తీర్పునిచ్చారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. స్థానిక సంస్థల పాలక వర్గాల గడువు ముగిసి ఏడాదిన్నర అయినా ఎన్నికల నిర్వహణలో జాప్యం ఎందుకని హైకోర్టు ప్రశ్నించింది. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించక పోవడాన్ని సవాలు చేస్తూ పలువురు మాజీ సర్పంచులు దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం మాధవి దేవి విచారణ చేపట్టారు. తొలుత పిటిషనర్ల తరఫున న్యాయవాదులు వాదనలు వినిపించారు. "గతేడాది జనవరి 31తో సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసినా ఇప్పటికీ ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోంది. పంచాయతీల బాధ్యతలను ప్రత్యేక అధికారులకు అప్పగించింది. ఇది రాజ్యాంగ, తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టాలకు విరుద్ధం. ప్రత్యేక అధికారులు ఇతర విధుల్లో ఉండటంతో ప్రజల సమస్యలను పట్టించు కోవడం లేదు. రాష్ట్ర ఆర్థిక సంఘం ద్వారా నిధులు సమకూరుస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీతో పలువురు సర్పంచ్‌లు సొంత నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేశారు. ప్రస్తుతం ఆ నిధులు అందక ఇబ్బందులు పడుతున్నారు. వివిధ పథకాల కింద కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రావడం లేదు. వెంటనే ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలి. లేకుంటే పాత సర్పంచ్‌కే బాధ్యతలు

- మిగతా 2 లో

హైకోర్టును ఆశ్రయించిన జగన్
క్వాష్ పిటిషన్‌పై నేడు విచారణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సింగయ్య మృతి కేసులో వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసుతో తమకు సంబంధం లేదంటూ తనపై నమోదైన కేసును కొట్టేయాలని కోరుతూ హైకోర్టులో బుధవారం క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై గురువారం విచారిస్తామని న్యాయస్థానం తెలిపింది. పల్నాడు జిల్లా రెంటపాళ్ల పర్యటన సందర్భంగా గుంటూరులో ర్యాలీ నిర్వహించగా ఏటుకూరు బైపాస్ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద జగన్ ప్రయాణిస్తున్న వాహనం కింద నలిగి సింగయ్య మృతి

- మిగతా 2 లో

ఇరాన్ అణు స్థావరాలు ధ్వంసం కాలేదు

అమెరికా ఇంటెలిజెన్స్ నివేదిక లీక్... నిజం కాదన్న ట్రంప్

వాషింగ్టన్: ఇరాన్ అణుస్థావరాల ధ్వంసమే లక్ష్యంగా అమెరికా భీకరదాడులు జరిపిన సంగతి విదితమే. అణు కేంద్రాలు పూర్తిగా నాశనమయ్యాయని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు కూడా. అయితే ఈ దాడుల్లో ఇరాన్‌కు పరిమితంగానే నష్టం వాటిల్లిందని పెంటగాన్‌కు చెందిన డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ విడుదల చేసిన నివేదిక తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇరాన్‌లోని ఫర్డో, నతాంజ్, ఇస్ఫహాన్ అణుకేంద్రాలపై బీ-2 స్పిరిట్ బాంబర్లతో అమెరికా భారీ దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో ఆయా అణుకేంద్రాలు నాశనం అయ్యాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్, రక్షణ శాఖ మంత్రి పీట్ హెగ్సెత్ ప్రకటించారు. అయితే, ఇంటెలిజెన్స్ నివేదికలు అందుకు వ్యతిరేకంగా ఉన్నాయి. మూడు అణుకేంద్రాలు లక్ష్యంగా దాడులు చేయగా... అందులో కీలకమైన ఫర్డో, నతాంజ్‌లు పూర్తిగా నాశనం కాలేదన్న వార్తలొచ్చాయి. యురేనియం శుద్ధి చేసేందుకు ఉపయోగించే సెంట్రిఫ్యూజ్‌లు వంటి కీలక పరికరాలను ఇరాన్ కొన్ని నెలల్లోనే తిరిగి పునఃప్రారంభించుకోవచ్చని తెలిపింది. ఈ నివేదికలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. అవి నకిలీ వార్తలని పేర్కొన్న ఆయన చరిత్రలో అత్యంత విజయవంతమైన సైనిక దాడుల తీవ్రతను తగ్గించే ప్రయత్నమన్నారు. కొన్ని వార్తా సంస్థలు చేస్తున్న ప్రయత్నమని మండిపడ్డారు. ఆయా వార్తా సంస్థలను ప్రజలు నమ్మడం లేదని ఇరాన్‌లోని అణుకేంద్రాలు పూర్తిగా నాశనమయ్యాయని సామాజిక మాధ్యమం ట్రూత్‌లో ఈ మేరకు పోస్టు పెట్టారు. మరోవైపు ఇంటెలిజెన్స్ నివేదికలను వైట్‌హౌస్ ధ్రువీకరించినప్పటికీ అందులోని అంశాలను కొట్టిపారేసింది. ఇలాంటి ఆరోపణలతో కూడిన నివేదికలను లీక్ చేయడం అధ్యక్షుడు ట్రంప్‌ను కించపరచడమే అని పేర్కొంది. ఇరాన్ అణుకార్యక్రమాన్ని నిర్మూలించిన యుద్ధ పైలట్ల ధైర్యసాహసాలను అప్రతిష్టపాలు చేసే ప్రయత్నంగా తెలిపింది. 30వేల పౌండ్లు కలిగిన 14 బాంబులను కచ్చితమైన లక్ష్యాలపై వేస్తే ఎంత నష్టం జరుగుతుందో అందరికీ తెలుసని శ్వేతసౌధం పేర్కొంది. ఇరాన్ అణు కేంద్రాలన్నీ మొత్తం ధ్వంసం అయ్యాయని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలినా లీవిట్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

పాకిస్థాన్ బాలిస్టిక్ క్షిపణుల తయారీ?

వాషింగ్టన్: పాకిస్థాన్ అత్యంత రహస్యంగా ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను అభివృద్ధి చేస్తున్నట్లు అమెరికా నిఘా సంస్థలు సంచలన విషయాలు వెల్లడించాయి. ఈ క్షిపణులు 5,500 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్న లక్ష్యాలను కూడా ఛేదించగలవని సమాచారం. భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' అనంతరం పాకిస్థాన్ చైనా సహాయంతో తమ ఆయుధ సంపత్తిని గణనీయంగా పెంచుకోవాలని నిర్ణయించుకున్నట్లు వాషింగ్టన్‌లోని నిఘా వర్గాలు రూపొందించిన ఒక నివేదిక పేర్కొంది. ఇందులో భాగంగా అమెరికాలోని అనేక కీలక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకోగల సామర్థ్యం ఉన్న ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను పాక్ రహస్యంగా తయారు చేస్తోందని అమెరికా నిఘా సంస్థలు నమ్ముతున్నాయి. ఈ తరహా ఖండాంతర క్షిపణులను అభివృద్ధి చేయడం లేదా సమకూర్చుకోవాలని పాకిస్థాన్ ప్రయత్నిస్తే... ఆ దేశాన్ని అణ్వాయుధ ప్రత్యర్థిగా గుర్తిస్తామని అమెరికా అధికారులు స్పష్టం చేశారని కూడా సదరు నివేదిక వెల్లడించింది. తమ దేశానికి ముప్పు కలిగించే అవకాశం ఉన్న లేదా అణ్వాయుధాలు కలిగిన ఏ దేశాన్నైనా అమెరికా తన ప్రత్యర్థిగా ప్రకటిస్తుందని నివేదికలో తెలిపారు. ప్రస్తుతం రష్యా, చైనా, ఉత్తర కొరియాలను అమెరికా తమ శత్రు దేశాలుగా పరిగణిస్తోంది. కొంతకాలంగా పాకిస్థాన్ స్వల్ప, మధ్యశ్రేణి క్షిపణుల అభివృద్ధి పైనే ప్రధానంగా దృష్టి సారించింది. ప్రస్తుతానికి ఆ దేశం వద్ద ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు (ఐసీబీఎం) అందుబాటులో లేవు. 2022లో పాకిస్థాన్ భూమి నుంచి భూమిపైకి ప్రయోగించే మధ్యశ్రేణి బాలిస్టిక్ క్షిపణి షాహీన్-3 ని, అలాగే 2023లో మధ్యంతరశ్రేణి బాలిస్టిక్ క్షిపణి 'ఘోరీ'ని విజయవంతంగా పరీక్షించింది. ఇదిలా ఉండగా, 'ఆపరేషన్ సిందూర్' కొనసాగుతున్న సమయంలోనే తాము 450 కిలోమీటర్ల పరిధి కలిగిన అబ్దాలి వెపన్ సిస్టమ్ క్షిపణిని (భూమి నుంచి భూమిపైకి ప్రయోగించే క్షిపణి) పరీక్షించినట్లు పాక్ ప్రకటించింది. గత ఏడాది పాకిస్థాన్ చేపట్టిన సుదూర లక్ష్యాలను ఛేదించే బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమంపై అమెరికా అనేక ఆంక్షలు విధించింది. ఈ క్షిపణి కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థ నేషనల్ డెవలప్‌మెంట్ కాంప్లెక్స్‌తో పాటు మరో మూడు సంస్థలతో అమెరికన్ కంపెనీలు ఎలాంటి వ్యాపార కార్యకలాపాలు నిర్వహించకుండా నిషేధం విధించింది. పాకిస్థాన్ ఇటువంటి క్షిపణులను తయారు చేయడం తమ దేశ భద్రతకు కూడా ముప్పేనని అమెరికా ఆందోళన వ్యక్తం చేసింది.

ముగ్గురు ఇజ్రాయిల్ గూఢచారులకు ఉరి

700 మంది అరెస్ట్

టెహ్రాన్: ఇజ్రాయిల్ గూఢచార సంస్థ మొసాద్‌కు సహకరించారన్న ఆరోపణలపై దోషులుగా తేలిన ముగ్గురు వ్యక్తులకు ఇరాన్ బుధవారం మరణశిక్ష అమలు చేసింది. ఆ దేశంతో సంబంధాలున్నాయనే ఆరోపణలపై సుమారు 700 మందిని అరెస్టు చేసినట్లు ప్రభుత్వ అనుబంధ నూర్ న్యూస్ వెల్లడించింది. ఇరాన్ న్యాయవ్యవస్థకు చెందిన మిజాన్ న్యూస్ ఏజెన్సీ ముగ్గురి ఉరిశిక్ష విషయాన్ని ధ్రువీకరించింది. అమెరికా మధ్యవర్తిత్వంతో ఇజ్రాయిల్, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన మరుసటి రోజే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనించాల్సిన అంశం. 12 రోజుల పాటు ఇరు దేశాల మధ్య తీవ్ర స్థాయిలో ఘర్షణలు చెలరేగిన అనంతరం, అమెరికా జోక్యంతో ఇరు పక్షాలు శాంతి ఒప్పందానికి అంగీకరించాయి. అయితే, ఈ ఒప్పందం జరిగి 24 గంటలు కూడా గడవకముందే మొసాద్ కోసం గూఢచర్యం చేశారన్న అభియోగాలపై ముగ్గురికి మరణశిక్ష విధించడం, యూదు దేశంతో సంబంధాలున్నాయనే నెపంతో వందల సంఖ్యలో ప్రజలను అరెస్టు చేయడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చినప్పటికీ, ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు ఇంకా చల్లారలేదనడానికి ఈ ఘటనలు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

అణుశక్తి సంస్థకు సహకరించం

ఇరాన్ పార్లమెంట్ కీలక నిర్ణయం

టెహ్రాన్: ఇజ్రాయిల్‌తో కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన 24 గంటల్లోనే ఇరాన్ కీలక నిర్ణయం తీసుకొంది. ఇక మీదట అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ)కు ఏమాత్రం సహకరించరాదని నిర్ణయించింది. ఇరాన్ పార్లమెంట్ ఈ నిర్ణయానికి అనుకూలంగా ఓటు వేసింది. దీనికి ఆ దేశ సుప్రీం నేషనల్ కౌన్సిల్ ఆమోదం తెలపాల్సి ఉంది. తమ అణు కేంద్రాలపై జరిగిన దాడులను ఖండించడానికి నిరాకరించడం ద్వారా ఐఏఈఏ విశ్వసనీయత కోల్పోయిందని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బఘేర్ ఘలిబాఫ్ వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో తమ అణు కేంద్రాల భద్రతకు హామీ ఇచ్చే దాకా ఐఏఈఏకు సహకారాన్ని నిలిపివేయాలని పార్లమెంట్ తీర్మానించింది. తాజాగా ఇరాన్-ఇజ్రాయిల్ మధ్య కాల్పుల విరమణ జరగడాన్ని ఐఏఈఏ స్వాగతించింది. ఈ యుద్ధం జరిగినన్ని రోజులు ఐఏఈఏ ఇన్‌స్పెక్టర్లు ఇరాన్‌లోనే ఉన్నారు.

హైకోర్టును ఆశ్రయించిన జగన్

(మొదటిపేజీ తరువాయి)

చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. సింగయ్య మృతి కేసులో జగన్‌ను ఏ-2గా చేర్చారు. జగన్‌తో పాటు మాజీ మంత్రులు, వైసీపీ నేతలు నేతలు పేర్ని నాని (ఏ5), విడదల రజిని (ఏ6)లను నిందితులుగా పోలీసులు పేర్కొన్నారు. ఇప్పటికే పేర్ని నాని, విడదల రజనిలు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలన్నీ కలిపి హైకోర్టు గురువారం విచారణ జరపనుంది.

సీబీఎస్ఈ 10 పరీక్షలు ఏడాదికి రెండుసార్లు

(మొదటిపేజీ తరువాయి)

సెషన్‌లో ఒకేసారి ఉంటుంది. సీబీఎస్ఈ ఎగ్జామినేషన్ కంట్రోల్ సంయమ్ భరద్వాజ్ మాట్లాడుతూ.. పరీక్షల మొదటి విడత ఫిబ్రవరిలోనూ, రెండో విడత మేలోను ఉంటాయన్నారు. ఏప్రిల్, జూన్‌లో ఫలితాలు వెలువడతాయని తెలిపారు. మొదటి విడతకు విద్యార్థులు తప్పనిసరిగా హాజరుకావాలని, రెండో విడత వారివారి ఇష్టమని చెప్పుకొచ్చారు. విద్యార్థులు సైన్స్, మేథమెటిక్స్, సోషల్ సైన్స్, లాంగ్వేజ్‌లలో మూడు సబ్జెక్టులను ఎంచుకుని బెటర్‌మెంట్ కోసం రాసుకోవచ్చని వెల్లడించారు. చలి ఎక్కువగా ఉండే (వింటర్ బౌండ్) స్కూళ్లలోని పదో తరగతి విద్యార్థులకు ఏదో ఒక విడతలో పరీక్షలు రాసే అవకాశం కల్పిస్తున్నారు.

నగదు రహిత చికిత్స

(మొదటిపేజీ తరువాయి)

ఇతర విభాగాల అధికారులకు, సామాన్య ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ పథకం విజయవంతం కావడానికి రవాణా, పోలీస్, హెల్త్, ఇన్సూరెన్స్, ఎన్ఐసీ విభాగాలు సంయుక్తంగా రాష్ట్ర స్థాయిలో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. గతంలో రోడ్డు ప్రమాదాలు జరిగితే పోలీసులకు సమాచారం ఇస్తే తమపై కేసులు నమోదు అవుతాయనే భయం ప్రజల్లో ఉండేదని, అది అపోహ మాత్రమే అని తెలిపారు. ప్రమాదాలు జరగగానే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. రోడ్డు ప్రమాద బాధితులకు వెంటనే చికిత్స అందించేలా అన్ని సౌకర్యాలతో మరిన్ని ట్రామా సెంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్ లలో ఈ పథకం పై అవగాహన కల్పించాలని డీజీపీ జితేందర్ ను ఆదేశించారు. మన జీవితంలో రోడ్డు ప్రమాదాల నుంచి ఒక ప్రాణం రక్షిస్తే గొప్ప సంతృప్తి ఇస్తుందని... ఇది ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. ఈ పథకం పై సమాచార ప్రసార శాఖ ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించాలన్నారు. అన్ని విభాగాల అధికారులు సక్రమంగా విధులు నిర్వహించి ఈ పథకాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. డీజీపీ జితేందర్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ అహ్మద్ నదీమ్ , హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు , షాట్ చైర్మన్ శివసేన రెడ్డి, రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్, జేటీసీలు, యూనిసెఫ్, ఎన్ఐసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

భారత్‌తో చర్చలకు సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

ఆయన పేర్కొన్నట్లు తెలిపింది.

పశ్చిమాసియాలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులపై సౌదీ యువరాజు ఎంబీఎస్, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఫోన్‌లో చర్చించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా భారత్, పాకిస్థాన్ మధ్య ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను షరీఫ్ ప్రస్తావించారని, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని చెప్పినట్లు సమాచారం. ఇటీవల పహల్గాం ప్రాంతంలో ఉగ్రదాడి జరిగిన అనంతరం, భారత సైన్యం పాకిస్థాన్‌పై సైనిక చర్య చేపట్టింది. ఈ పరిణామాల నేపథ్యంలో అంతర్జాతీయ సమాజం నుంచి మద్దతు కూడగట్టేందుకు పాకిస్థాన్ ప్రయత్నించింది. ఇందులో భాగంగా సౌదీ అరేబియా, ఇరాన్, అజర్‌బైజాన్ వంటి దేశాలను సంప్రదించింది. పాకిస్థాన్‌తో చర్చల అంశంపై స్పందించిన భారత్... సరిహద్దు ఆవలి నుంచి ఉగ్రవాద కార్యకలాపాలు పూర్తిగా ఆగిపోయే వరకు ఎలాంటి చర్చలు ఉండవని తేల్చి చెప్పింది. ఉగ్రవాదం, చర్చలు ఏకకాలంలో కొనసాగడం అసాధ్యమని పేర్కొంది.

రోదసిలోకి శుభాంశు శుక్లా

(మొదటిపేజీ తరువాయి)

సంస్థ (నాసా), ఐరోపా అంతరిక్ష సంస్థలు భాగస్వామ్యం వహిస్తున్నాయి. ఇక శుభాంశు మిషన్ పైలట్‌గా బాధ్యతలు నిర్వహిస్తారు. ఈ మిషన్‌కు నాసా మాజీ వ్యోమగామి పెగ్గీ విట్సన్ కమాండర్‌గా వ్యవహరిస్తున్నారు. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన పోలాండ్, హంగేరీకి చెందిన వ్యోమగాములు స్లావోజ్, టిబోర్ కాపు మిషన్ స్పెషలిస్టుగా వ్యవహరిస్తారు. యాక్సియం-4 మిషన్ ప్రయోగం మే 29న జరగాల్సి ఉన్నప్పటికీ వేర్వేరు కారణాల వల్ల అనేకసార్లు వాయిదా పడిన సంగతి విదితమే.

భారతీయులంతా ఈ ప్రయాణంలో భాగమే...

వ్యోమనౌకలోకి వెళ్లడానికి ముందు శుభాంశు తనకు ఎంతో ఇష్టమైన 'ఫైటర్' సినిమాలోని 'వందేమాతరం' అనే పాటను విన్నారు. ప్రయోగం అనంతరం ఫాల్కన్ 9 రాకెట్‌లోని వ్యోమనౌక నుంచి మాట్లాడారు. "నా ప్రియమైన దేశ ప్రజలకు నమస్కారం. 41 సంవత్సరాల తర్వాత మనం తిరిగి అంతరిక్షంలోకి వచ్చాం. ఇది అద్భుతమైన ప్రయాణం. సెకనుకు 7.5 కిలోమీటర్ల వేగంతో భూమి చుట్టూ తిరుగుతున్నాం. నా ప్రయాణం ఐఎస్ఎస్‌కి వెళ్లడానికి కాదు, భారత్ చేపడుతున్న మానవ అంతరిక్ష కార్యక్రమానికి పునాది. మీరందరూ ఈ ప్రయాణంలో భాగం కావాలని నేను కోరుకుంటున్నాను. నాతో పాటు మీరు కూడా గర్వంతో ఉప్పొంగాలి. భారతదేశ మానవ అంతరిక్ష కార్యక్రమాన్ని ప్రారంభిద్దాం. జై హింద్! జై భారత్!" అని పేర్కొన్నారు.

రాష్ట్రపతి, ప్రధాని శుభాకాంక్షలు

శుభాంశు శుక్లా రోదసి యాత్ర విజయవంతమవడంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుభాంశు శుక్లాకు శుభాకాంక్షలు తెలిపారు. శుభాంశు బృందం సరికొత్త చరిత్రను సృష్టించిందని, భారత అంతరిక్ష చరిత్రలో ఇదో కొత్త మైలురాయి అని రాష్ట్రపతి అన్నారు. ఈ యాత్రపై దేశం మొత్తం గర్వపడుతోందని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఐఎస్ఎస్‌కు వెళ్లే తొలి భారతీయుడు శుభాంశు కానున్నారని ప్రధాని మోదీ అన్నారు. 1.4 బిలియన్ ప్రజల ఆశలు, ఆకాంక్షలను తనతో తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. శుభాంశు బృందం విజయం సాధించాలని కోరుకుంటున్నట్లు ఎక్స్‌లో పేర్కొన్నారు.

తల్లిదండ్రుల ఆనందం...

ఫాల్కన్-9 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లగానే భారత వ్యోమగామి శుభాంశు శుక్లా తల్లిదండ్రులు భావోద్వేగానికి గురయ్యారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని లక్నోలో యాక్సియం-4 మిషన్ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించిన శుభాంశు శుక్లా కుటుంబ సభ్యులు ఫాల్కన్-9 రాకెట్ అంతరిక్ష కేంద్రానికి విజయవంతంగా పయనమవ్వటంతో ఆనందంతో గంతులు వేశారు. తమ కుమారుడు అంతరిక్ష కేంద్రంలోకి వెళ్తుతుండటం ఆనందంగా ఉందని శుభాంశు శుక్లా తండ్రి శంభు దయాల్ శుక్లా తెలిపారు. దేవుడి ఆశీర్వాదం వల్లే ఇది సాధ్యమైందని అన్నారు. ఈ సందర్భంగా శుభాంశు శుక్లాకు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ అభినందనలు తెలిపారు. ఇది దేశానికి గర్వకారణమైన క్షణమని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

'ఇండియా'తోనే మోదీకి చెక్

(మొదటిపేజీ తరువాయి)

పేదలకు సంపద దూరమవుతున్నదని విమర్శించారు. ఒకే భాష, ఒకే ఎన్నిక పేరుతో దేశంలో విచ్ఛిన్న రాజకీయాలకు పాల్పడుతున్నారని, ప్రజాస్వామ్య వ్యవస్థకే తీవ్ర ప్రమాదం తెచ్చేలా మోదీ విధానాలున్నాయని ధ్వజమెత్తారు. నాటి ఇందిరాగాంధీ హయాంలో విధించిన ఎమర్జెన్సీ తరహాగా దేశంలో పాలన కొనసాగుతోందన్నారు. జనగణనను 2029 నాటికల్లా పూర్తి చేయాల్సిందేనని... దాంతో పాటు బీసీల కులగణనపై ఒక స్పష్టత తీసుకొచ్చి, వారికి జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో సీట్లు కేటాయించేలా చట్టం తీసుకురావాలని నారాయణ డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనాలోచిత విధానాలపై జరిగే పోరాటాల్లో విద్యార్థి, యువజన, మహిళా సంఘాలను భాగస్వాములను చేయాలన్నారు. కేవలం సంక్షేమ పథకాలతోనే ప్రభుత్వాలు అధికారంలోకి రావని, అందుకు నిదర్శనంగా 2019లో చంద్రబాబు ప్రవేశపెట్టిన పసుపు-కుంకుమ పథకంతో అధికారంలోకి రాలేకపోయారని గుర్తుచేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రతి నెలా బటన్ నొక్కుతూ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టినా అధికారానికి దూరమవ్వక తప్పలేదన్నారు. దీనినిబట్టి సంక్షేమం ఒక్కటే కాదనీ, రాజకీయంగా సక్రమమైన పరిపాలన చేయగలిగితేనే ప్రభుత్వాలు నిలవగలుగుతాయని సూచించారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో పాలనాపరమైన తప్పుల నుంచి ప్రస్తుత ఎన్డీఏ కూటమికి నేతృత్వం వహిస్తున్న చంద్రబాబు ఏడాది పాలన వరకు జరిగిన పరిణామాలను వివరించారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వానికి అధికార, ప్రతిపక్షాలు మద్దతివ్వడం సిగ్గుచేటన్నారు. నాడు జగన్ అధికారంలోకి వచ్చాక కనీసం ప్రతిపక్షాలు వినతులు ఇచ్చేందుకు కూడా అవకాశం ఇవ్వకపోడం, 3 రాజధానుల ప్రకటన, ప్రజా ఉద్యమాల అణచివేత వంటి నిర్ణయాలతోనే గద్దె దిగారన్నారు. ప్రధానంగా జగన్ అనుకూలం, వ్యతిరేకం అనే దిశగా 2024 ఎన్నికలు కొనసాగాయని విశ్లేషించారు. ఆయా అంశాలపై సీపీఐ ఎనలేని పోరాటాలు చేసిందని గుర్తుచేశారు. ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వ ఏడాది పాలనలోను ప్రజలకిచ్చిన వాగ్దానాల అమలుపై స్పందన కొరవడిందన్నారు. సూపర్ 6 తో పాటు మిగిలిన హామీలపై కదలికలేదని, వాటిపై ప్రజలను, పార్టీ శ్రేణులను చైతన్యవంతులను చేయాలని సూచించారు. సీపీఐ అధ్వర్యంలో పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల ఇళ్ల స్థలాల అంశాలపై పెద్ద ఎత్తున వినతుల స్వీకరణ, ఉద్యమాలు చేపట్టిందని, దీనిపై చంద్రబాబు మంత్రి మండలి సమావేశాల్లోనూ చర్చకు వచ్చిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా ప్రైవేటీకరణపై దృష్టి పెట్టిందని ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చాక ఏపీ అంటే అమరావతి, పోలవరం అని చంద్రబాబు చెప్పి... ఇప్పుడు గోదావరి-బనకచర్ల అందుకున్నారని మండిపడ్డారు. రాయలసీమతో పాటు ఉత్తరాంధ్రలో అనేక జల ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పూర్తి చేయకుండా, ఏకంగా రూ.82 వేల కోట్లతో బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణానికి సన్నద్ధమవ్వడం తగదని, భవిష్యత్‌లో ఈ ప్రాజెక్టు అంచనాలు రూ.2 లక్షల కోట్లకు చేరే ప్రమాదం ఉందని వివరించారు. అమరావతి రాజధానికి ఉన్న భూములు చాలక మరో 44 వేల ఎకరాలు తీసుకోవడం తగదన్నారు. ఇప్పటికే రూ.32 వేల కోట్లు రాజధాని పేరిట అప్పులు తెచ్చారని, మరో రూ.32 వేల కోట్లకు సిద్ధమయ్యారని, ఆ దిశగా చూస్తే మొత్తంగా ఒక్క అమరావతికే లక్ష కోట్ల రూపాయల అప్పులు తెచ్చే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నాడు జగన్ 10 లక్షల కోట్ల అప్పులు తెచ్చి... రాష్ట్రాన్ని శ్రీలంకగా మార్చారంటూ విస్తృతంగా ప్రచారం చేసిన చంద్రబాబు ఇప్పుడు అదే విధంగా అప్పులు చేయడాన్ని తప్పుపట్టారు. చంద్రబాబు విజన్ 2047, పీ4 విధానాలతో ప్రయోజనం ఏమీలేదని తేల్చి చెప్పారు. పార్టీ శ్రేణులంతా సూపర్ 6 పథకాల అమలుతో పాటు పెంచిన విద్యుత్ చార్జీలు, ప్రజా సమస్యలపై ఉద్యమాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జేవీ సత్యనారాయణమూర్తి, రాష్ట్ర కార్యదర్శి వర్గ, కార్యవర్గ, సమితి సభ్యులు పాల్గొన్నారు.

కుటీర పరిశ్రమలకు ప్రోత్సాహం

చేతివృత్తి కళాకారుల స్టాల్స్ ప్రారంభోత్సవంలో భట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్ : పెద్ద ఎత్తున ఉపాధి కల్పిస్తూ ఆదాయాన్ని సమకూర్చే కుటీర పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ట్యాంక్ బండ్‌పై బీసీ సంక్షేమశాఖ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేతి వృత్తి కళాకారుల ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం స్టాల్స్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మీడియాతో భట్టి మాట్లాడుతూ... చేతి వృత్తి కళాకారుల ఉత్పత్తులను ప్రోత్సహించి ఆరోగ్య తెలంగాణ నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. ఈనెల 29 వరకు ఎగ్జిబిషన్ కొనసాగుతుందని, హైదరాబాద్ నగరానికి చెందిన వారే కాకుండా ఇతర జిల్లాల కుటీర పరిశ్రమలకు సంబంధించిన ఉత్పత్తుల ప్రదర్శన జరుగుతుందని వివరించారు. ప్రదర్శనను తిలకించి నచ్చిన వస్తువులు, పర్యావరణహితమైన ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఉత్పత్తులు కొనుగోలు చేసి చేతి వృత్తుల వారికి చేయూతనివ్వాలని కోరారు. బీసీ కార్పొరేషన్ల పై ప్రత్యేక దృష్టి సారించి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని తెలిపారు. కుమ్మరులు తయారు చేసిన మట్టి పాత్రలు , మేదరి పనివార్లు తయారు చేసిన వెదురు వస్తువులు, పూసల వారి సామగ్రి... పోచంపల్లి, గద్వాల, నారాయణపేట మొదలైన చేనేత ఉత్పత్తులు, గౌడ అన్నల నీరా ఉత్పత్తులులను డిప్యూటీ సీఎం ఆసాంతం పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బెస్తవార్ల చేపల వంటకాలను మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరిలతో కలిసి ఆరగించారు.

3 నెలల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించండి

(మొదటిపేజీ తరువాయి)

అప్పగించాలి" అని కోరారు. ప్రభుత్వం తరపున అదనపు అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్ వాదనలు వినిపిస్తూ... సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల ప్రక్రియ చేపట్టాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి మరో నెల రోజుల గడువు అవసరమని కోరారు. ఈ దశలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ... ఎన్నికల నిర్వహణపై గతంలో ఒకసారి హామీ ఇచ్చి ఎందుకు అమలు చేయ లేదని ప్రశ్నించారు. ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది జి. విద్యా సాగర్ వాదనలు వినిపిస్తూ రిజర్వేషన్లను ఖరారు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. ఇది పూర్తి కాగానే ఎన్నికల ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు ఆమోదం తెలిపాక... ప్రక్రియ పూర్తి చేయడానికి రెండు నెలల సమయం పడుతుందన్నారు. దీనిపై న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ సకాలంలో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఎన్నికల సంఘం చొరవ తీసుకోవాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసినందున... ఆ దిశగా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. న్యాయవాది సమాధానమిస్తూ... రిజర్వేషన్ల ఖరారుతో పాటు ఎన్నికలకు ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి మూడు నెలల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని తుది తీర్పు ఇచ్చారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : రెండు రోజులుగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. బుధవారం తెల్లవారుజాము నుంచి రోజంతా కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. విశాఖ నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని విశాఖ తుఫాను హెచ్చరికల కేంద్రం అధికారులు తెలిపారు. దీని కారణంగా ఉత్తర కోస్తాకు భారీ వర్షాలతో పాటు దక్షిణ కోస్తాలో అనేక చోట్ల వర్షాలు... తీరం వెంబడి బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వివరించారు. అల్లూరి జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు అనేక ప్రాంతాల్లో రహదారులు జల దిగ్బంధనం అయ్యాయి. అనేక చోట్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

యురేనియం శుద్ధి చేస్తే ఇరాన్‌పై దాడి

(మొదటిపేజీ తరువాయి)

ఎక్స్ఛేంజి అధిపతి అబ్దుల్లా బక్రిని హతమార్చింది. ఇరాన్ ఖుడ్స్ ఫోర్స్ నుంచి వచ్చే డబ్బును ఈ సంస్థ హెజ్బొల్లాకు మళ్లిస్తుంది. ఇదిలా ఉండగా... మరోవైపు "యుద్ధం ఆగాలని ఇజ్రాయిల్ , ఇరాన్ సమానంగా కోరుకున్నాయి. ఇరాన్ అణ్వాయుధ కేంద్రాలు, అణు సామర్థ్యాలను ధ్వంసం చేయడం నాకు దక్కిన గొప్ప గౌరవం. ఆ తర్వాతే యుద్ధాన్ని ఆపా" అని ట్రంప్ సోషల్ మీడియాలో పేర్కొన్నారు.

పుతిన్ ఆఫర్‌ను తిరస్కరించా...

ఇరాన్-ఇజ్రాయిల్ యుద్ధంలో కాల్పుల విరమణకు సాయం చేస్తానని రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆఫర్ చేసినట్లు అమెరికా అధినేత ట్రంప్ వెల్లడించారు. అయితే.. తాను ఆ ఆఫర్‌ను తిరస్కరించినట్లు చెప్పారు. ఆయన నెదర్లాండ్‌లో ప్రారంభం కానున్న నాటో సదస్సుకు వెళుతున్న సందర్భంగా 'ఎయిర్‌ఫోర్స్ వన్'లో జర్నలిస్టులకు ఈ విషయాన్ని వివరించారు. "రష్యాతో ఓ ఒప్పందం కుదుర్చుకోవాలనుకొంటున్నాను. ఇటీవల పుతిన్ నాకు ఫోన్ చేసి 'ఇరాన్ యుద్ధంలో సాయం చేయమంటారా..?' అని అడిగారు. ఇరాన్ విషయంలో నాకు సహాయం అవసరం లేదని చెప్పాను. మీ విషయంలోనే నాకు సాయం కావాలి" అని అన్నట్లు ట్రంప్ తెలిపారు. నాటో సదస్సులో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని కలిసే అవకాశాలున్నట్లు ట్రంప్ చెప్పారు. ప్రస్తుతం అతడు ఎన్నడూ లేనంత ఇబ్బందికర పరిస్థితిలో ఉన్నట్లు పేర్కొన్నారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య సంధి కుదిర్చి మూడేళ్లుగా జరుగుతున్న యుద్ధానికి ముగింపు పలకనున్నట్లు వెల్లడించారు. గత వారం ఆ యుద్ధంలో ఆరు వేల మంది సైనికులు చనిపోయినట్లు ట్రంప్ పేర్కొన్నారు.

పత్రికా రంగానికి ప్రభుత్వ అండ

(మొదటిపేజీ తరువాయి)

కూటమి ప్రభుత్వం అన్ని విధాల కృషిచేస్తుందని చెప్పారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కొండపి నియోజకవర్గ కేంద్రంలో పాత్రికేయులకు ఇళ్ల స్థలాల మంజూరుకు కృషిచేస్తానని పేర్కొన్నారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సామాజిక మాధ్యమాలు కూడా ఎన్నో వచ్చాయని... దీనివల్ల ఏ వార్త అయినా వెంటనే ప్రజల వద్దకు చేరుతుందన్నారు. వార్తల విషయంలో పాత్రికేయులు, అదేవిధంగా సామాజిక మాధ్యమాల వారు నిజాయితీగా ఉండాలని, నకిలీ వార్తల్ని వ్యాపింపజేస్తే...అది సమాజానికి మంచిది కాదన్నారు. మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి పాత్రికేయులు పట్టుకొమ్మల్లాంటి వారని అందుకే పత్రికారంగాన్ని ఫోర్త్ ఎస్టేట్‌గా పిలుస్తారన్నారు. అటువంటి పత్రికారంగం మనుగడ సాగించటానికి తమ ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలందిస్తుందన్నారు. గత ప్రభుత్వం పాత్రికేయుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని ఆయన పేర్కొన్నారు. పాత్రికేయులకు అక్రిడిటేషన్‌ల మంజూరు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రుల కమిటీని నియమించారని త్వరలో రాష్ట్రంలో అర్హులైన పాత్రికేయులందరికీ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేస్తామని తెలిపారు. అదేవిధంగా పాత్రికేయులకు బీమా, హెల్త్ కార్డుల జారీ, ఇళ్ల స్థలాల మంజూరు విషయంలోను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూలంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ తమ కుటుంబానికి పత్రికారంగంతో ఎంతో అనుబంధం ఉందని పాత్రికేయులకు ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అందజేయటానికి తాను సిద్ధంగా ఉంటానని అన్నారు.

ఒంగోలులో జర్నలిస్ట్ కాలనీ, ప్రెస్ క్లబ్ నిర్మాణం

ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన రావు మాట్లాడుతూ ఒంగోలులో జర్నలిస్ట్ కాలనీ నిర్మాణానికి తనవంతు సహకారం అందజేస్తానన్నారు. అదేవిధంగా తమ తాతగారైన దామచర్ల ఆంజనేయులు పేరిట తన స్వంత నిధులతో ప్రెస్ క్లబ్ నిర్మాణం చేస్తామని, అందులో ఇతర ప్రాంతాల జర్నలిస్టులు వచ్చినప్పుడు బసచేసేందుకు విశ్రాంతి గదులను సైతం నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

వేతన సవరణచట్టంపై ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టాలి: శ్రీనివాస్‌రెడ్డి

ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) ప్రెసిడెంట్ కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పాత్రికేయుల వేతన సవరణ చట్టం కార్యరూపం దాల్చలేదని, వేతన సవరణ జరిగి సుమారు 15 సంవత్సరాలు అవుతుందని దీనిపై ప్రజాప్రతినిధులు దృష్టిపెట్టాలని కోరారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం అయిందని.. రాబోయే సంవత్సర కాలంలోనైనా పాత్రికేయుల సమస్యల పరిష్కారం కోసం కృషిచేయాలని కోరారు. మంత్రుల కమిటీ సిఫారసుల మేరకు పాత్రికేయుల అక్రిడిటేషన్ కార్డుల జారీ కోసం జీవో రూపొందినప్పటికీ అది ఇంతవరకు కేబినెట్ ఆమోదానికి నోచుకోలేదని వచ్చే కేబినెట్ సమావేశంలో ఆ జీవోను ఆమోదించేవిధంగా కృషిచేయాలని సభాధ్యక్షులు, ఏపీయుడబ్ల్యుజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు కోరారు. కార్యక్రమంలో శాసనసభ్యులు బీఎన్ విజయ్‌కుమార్, డాక్టర్ ఉగ్ర నరసింహా రెడ్డి, ఏలూరి సాంబశివ రావు, ముత్తుముల అశోక్ రెడ్డి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, దర్శి టీడీపీ ఇంఛార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఐజేయు జనరల్ సెక్రటరీ బల్విందర్ సింగ్ జమ్ము, స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎస్.ఎన్.సిన్హా, జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్, ఏపీయుడబ్ల్యుజే ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.సురేష్, యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్వీ రమణ, దాసరి కనకయ్య, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు వెంకట్రావు, సరస్వతీ విద్యాసంస్థల అధినేత ఏవీ రమణా రెడ్డి, పలువురు యూనియన్ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన యూనియన్ కార్యవర్గ ప్రతినిధులు, పెద్దసంఖ్యలో పాత్రికేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు, పాత్రికేయులు ఆలపించిన సినీగీతాలు, పద్యాలు విశేషంగా అలరించాయి. మహాసభ ప్రారంభానికి ముందు స్థానిక ప్రకాశం భవన్ దగ్గర నుంచి విష్ణుప్రియ కన్వెన్షన్ వరకు నిర్వహించిన బైక్ ర్యాలీలో పెద్దసంఖ్యలో పాత్రికేయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను సకాలంలో పూర్తి చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర - మహబూబాబాద్ : జిల్లాలో నిర్మాణం చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్లను సకాలంలోని పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. బుధవారం బయ్యారం మండలంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మిక తనిఖీలు చేశారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక అయిన నామలపాడు పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఇండ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. విడతల్లో 5 లక్షల రూపాయలను ప్రభుత్వం సహాయం అందుతుందని అన్నారు. త్వరితగతిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని, ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యచరణ ప్రకారం నిర్మాణాలు చేపట్టాలని ప్రభుత్వం సూచించిన విధంగా జిల్లాలో ప్రత్యేక నోడల్ అధికారులను నియమించి, ఇందిరమ్మ కమిటీల ద్వారా ప్రభుత్వ సూచనల ప్రకారం వచ్చిన ఐటిడిఏ, పట్టణ గ్రామలాల దరఖాస్తుల లబ్ధిదారులకు 85 శాతం గ్రౌండ్‌లో పూర్తి చేసి నిర్మాణాలను వేగవంతం చేయడం జరిగిందని తెలిపారు. మహిళ సంఘాలలో సభ్యులుగా ఉన్న వారికి నిర్మాణం నిమిత్తం బ్యాంకు రుణాలను మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. అనంతరం బయ్యారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో సీజనల్ వ్యాధులకు సంబంధించిన అన్ని మందులు సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో విజయలక్ష్మి, డాక్టర్ విజయ్, హౌసింగ్ ఏఈ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి దాతల చేయూత

విశాలాంధ్ర - తొర్రూరు: తొర్రూర్ మండలంలోని అమ్మాపురం గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన మాచర్ల కిరణ్ కుమార్ గౌడ్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఉన్నట్టుండి ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడి ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నాడు. అతనికి భార్య, ముగ్గురు చిన్న పిల్లలు ఉన్నారు. వారి కుటుంబ దినస్థితిని చూసి చలించిన దాతలు ముందు కొచ్చారు. దాతలు అందించిన రూ. 45,000 సహాయాన్ని బుధవారం దాతల సమక్షంలో బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ ఆటో నడుపుతూ వచ్చే సంపాదనతో కుటుంబాన్ని పోషిస్తున్న తరుణంలో మాయదారి బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కుటుంబం దయనీయ స్థితిలో ఉందన్నారు. మీ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఇంకా ఎవరైనా దాతలు ఉంటే ముందుకొచ్చి ఆ నిరుపేద కుటుంబానికి చేయూతనివ్వాలని కోరారు.

టిఆర్ఎస్ హయాంలో పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్: బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాడు ఆర్టీసీ కార్మికులు, వామపక్ష పార్టీలు చేసిన ఉద్యమంలో భాగంగా పెట్టిన అక్రమ కేసులను సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎత్తివేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారధి, సిపిఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్ సారధిరెడ్డిలు అన్నారు. బుధవారం జగ్గన్న, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, సమ్మెట రాజమౌళి, నాగయ్య, శ్రీలత, రమాదేవితో కలిసి వారు కోర్టు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా బి. విజయసారధి, సాదుల శ్రీనివాస్‌లు మాట్లాడుతూ నాడు ఉద్యమకారులపై అక్రమంగా కెసిఆర్ పెట్టిన అక్రమ కేసులను కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ చూపి అక్రమ కేసులు ఎత్తి వేయాలని అన్నారు. నాడు కెసిఆర్ నియంత్రత్వ పాలన వలన ఆర్‌టిసి కార్మికులు చనిపోయారన్నారు. వందలాది మంది వామపక్ష పార్టీ నేతలపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తి వేయాలన్నారు.

దొంగిలించబడిన ఫోన్లు బాధితులకు అందజేత

విశాలాంధ్ర ప్రతినిధి - పెద్దపల్లి, సింగరేణి : వ్యక్తులు పోగొట్టుకున్న, లేదా దొంగిలించబడిన 18 లక్షల విలువగల 120 సెల్ ఫోన్లను రామగుండం కమీషనరేట్ సీసీఎస్, ఐటీ సెల్ బృందాలు స్వాధీనం చేసుకొని బాధితులకు బుధవారం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్ దొంగ తనాల నుండి విముక్తి కల్పించడానికై డిపార్ట్మెంట్ ఆఫ్ టెలీ కమ్యూనికేషన్ సి.ఇ.ఐ.ఆర్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, www.ceir.gov.in CEIR నమోదు చేసిన తర్వాత వాటి ఆచూకి కనుగొని స్వాధీనం చేసుకొని బాధితులకు అందజేయడం జరుగుతుందని అన్నారు. ప్రజలు దీనిని ఉపయోగించుకోవాలని అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇప్పటి వరకు 6683 సి.ఇ.ఐ.ఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయగా ఇందులో ఇప్పటి వరకు 2020 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని సెల్‌ఫోన్ యజమానులకు అందజేయడం జరిగిందని తెలిపారు. ఇందుకు సమర్థవంతంగా పనిచేస్తున్న సిసిఎస్ ఇన్స్పెక్టర్ బాబురావు నేతృత్వంలో రామగుండం కమీషనరేట్ సీసీఎస్, ఐటీ సెల్ బృందాలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి మల్లారెడ్డి, ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాస్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ బాబురావు, సిసిఎస్ పెద్దపల్లి, మంచిర్యాల జోన్ ఎస్ఐ పాల్గొన్నారు.

బాలికల సంక్షేమ వసతి గృహం కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : వసతిగృహాలలో ఉంటూ విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల చదువుతోపాటు, వారి భద్రతను చూడాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం ఆమె నల్గొండ జిల్లా, త్రిపురారం లోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతిగృహం అంతా కలియతిరిగిన తర్వాత వసతి గృహంలోని కొన్ని గదులు పెచ్చులూడి పోయి పడి పోయేందుకు సిద్ధంగా ఉండడం గమనించిన జిల్లా కలెక్టర్ తక్షణమే ఆ భవనాన్ని ఖాళీ చేసి సురక్షిత భవనంలోకి మారాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో సౌకర్యాలను, విద్యార్థుల భోజనం, తదితర వివరాలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, గృహ నిర్మాణ శాఖ పీడి రాజ్ కుమార్ జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలి

విశాలాంధ్ర - ఖమ్మం : కార్పొరేషన్ పరిధిలో దీర్ఘకాలికంగా ఉన్న నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహమ్మద్ సలాం డిమాండ్ చేశారు. ఈరోజు టూటౌన్ ఏరియా ముఖ్యుల సమావేశం గాదె లక్ష్మీనారాయణ అధ్యక్షతన గురుప్రసాద్ భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో సలాం మాట్లాడుతూ అధ్వానంగా ఉన్న డ్రైనేజ్ వ్యవస్థను, రోడ్లను వెంటనే మరమ్మతులు చేయాలని చుక్క నీళ్ళ పడితే రోడ్లు అన్ని చెరువులుగా మారుతున్నాయి అని ప్రధాన కూడలిలో వాహనాలు నిలిచిపోయాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు అని కార్పొరేషన్ ప్రజలకు స్వచమైన మంచినీటిని ప్రతీరోజు అందించాలని సలాం అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన 6 గ్యారంటీలు తక్షణమే అమలు చేయాలి అని పేద ప్రజలకు ఇండ్లను, ఇండ్ల స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. టూ టౌన్ ఏరియా సిపిఐ మహాసభ జూలై 1న జయప్రదం చేయాలని సీపీఐ టూ టౌన్ ఏరియా కార్యదర్శి యానాలి సాంబశివారెడ్డి అన్నారు. ఈ మహాసభ స్థానిక బైపాస్ రోడ్‌లో గురుప్రసాద్ భవన్‌లో జరుగుతుందని వీరిలో నిర్మాణపరమైన చర్చలు జరుగుతాయని సాంబశివ రెడీ అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు, నాయకులు బోడ వీరన్న, సైదా, జాల నరసింహారావు, చానా, సతీష్ రెడ్డి, భద్రం, మజీద్, పోటు పూర్ణయ్య, మోహనరావు, బోడ. రమేష్, దుర్గానాథ్ తదితరులు పాల్గొనారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రైవేట్‌కు ధీటుగా నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సోన్ కస్తూర్బా గాంధీ బాలికల వసతి పాఠశాల (కేజీబీవీ)ను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల రిజిస్టర్లు, హాజరు, తరగతి గదులు, వసతి గృహం, మరుగుదొడ్లు, భోజనశాల, స్టోర్‌రూమ్‌లను కలెక్టర్ పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేసారు. జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేయాలని సూచించారు. విద్యార్థుల హాజరు వంద శాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని, పాఠశాల పరిసరాలను ప్రతిరోజు శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ప్రతి పూట మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అంతకుముందు పదవ తరగతి విద్యార్థులకు గణితం, ఇతర సబ్జెక్టులపై కలెక్టర్ భోధన చేశారు. బోర్డుపై లెక్కలు చేయించి, ప్రశ్నలు అడిగి విద్యార్థుల సమాధానాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు కొత్త పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్, యూనిఫాంలు అందాయా? అన్న విషయాలు స్వయంగా అడిగి తెలుసుకున్నారు. బోర్డు పరీక్షలకు ఇప్పటి నుంచే ప్రణాళికతో సిద్ధం కావాలన్నారు. విద్యార్థులంతా ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ పి.రామారావు, తహసిల్దార్ మల్లేష్, ఎంపీడీవో సురేష్, విద్యాశాఖ అధికారులు పరమేశ్వర్, సలోమి, లింబాద్రి, ప్రవీణ్, ప్రధానోపాధ్యాయులు లతాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో తండ్రీ, కొడుకులు మృతి

తల్లి పరిస్థితి విషమం...

విశాలాంధ్ర - ఇల్లందు : విద్యుత్ షాక్ కు గురై తండ్రి, తనయుడు మృతి చెందగా మహిళ గాయల పాలై చావు బ్రతుకుల మధ్య చికిత్స పొందుతున్న విషాదాంతం మండలంలోని ఎల్లపురం గ్రామంలో చోటు చేసుకుంది. మర్రిగూడెం గ్రామపంచాయతీలోని ఎల్లాపురం గ్రామానికి చెందిన ఏనుగు నర్సయ్య (55) బుధవారం తెల్లవారుజాము న మూత్ర విసర్జనకు లేచాడు. బాత్రూం కు అనుకోని వున్న విద్యుత్ తీగకు తగిలాడు. దింతో విద్యుత్ షాక్ కు గురయ్యాడు. కేకలు వినిపించి ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న తన తండ్రిని కాపాడేందుకు కొడుకు ప్రవీణ్ (30) వెళ్లి ప్రయత్నించాడు. దురదృష్టవశాత్తు ప్రవీణ్ కూడా షాక్ కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. దీన్ని గమనించిన నరసయ్య భార్య ఎర్రమ్మ వారిద్దరిని కాపాడేందుకు ప్రయత్నించి తాను కూడా విద్యుత్ షాక్ కు గురై స్పృహ కోల్పోయింది. ఈమె కేకలతో హుటాహుటిన వచ్చిన పక్కింటి వారు ఎర్రమ్మ ను కాపాడి ఇల్లందు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కొరకు తీవ్ర గాయాలతో కొన ఊపిరితో ఉన్న ఎర్రమ్మను ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా ఒకే కుటుంబంలో ఇద్దరు మృతి చెందడం మరొకరు చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుండటంతో బంధువర్గంతో పాటు గ్రామస్తులు శోకంలో మునిగిపోయారు. దీంతో ఎల్లాపురం గ్రామంలో సర్వత్రా విషాద ఛాయలు నెలకొన్నాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్ వాడకాన్ని యువత వ్యతిరేకించాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - పెద్దపల్లి : డ్రగ్స్ మత్తు పదార్థాల వాడకాన్ని యువత తీవ్రస్థాయిలో వ్యతిరేకించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఏర్పాటు క్యాంపెయిన్‌లో చేసిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఐ యామ్ ఆంటి డ్రగ్ సోల్జియర్ (ఫోటో పాయింట్ వద్ద కలెక్టర్ ఫోటో తీసుకున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ యువత చెడు అలవాట్లు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు. సరదా కోసం ప్రారంభమయ్యే డ్రగ్స్ లాంటి అలవాట్లు మన జీవితాలను నాశనం చేస్తాయని అన్నారు. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ కోసం ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని అన్నారు. డ్రగ్స్‌కు బానిసైన వారి కోసం పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసిందని అన్నారు. డ్రగ్స్‌కు సంబంధించి ఎటువంటి సమాచారం తెలిసినా ప్రభుత్వ టోల్ ఫ్రీ నెంబర్ 14446 కు వెంటనే అందించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులు సరైన మార్గంలో నడిచేలో తల్లిదండ్రులు ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. పిల్లలు చెడు అలవాట్లు చేసుకోకుండా చూడాలని, ఎప్పుడైనా విచిత్రంగా ప్రవర్తిస్తే వెంటనే దానికి గల కారణాలు తెలుసుకోవాలని, ఏదైనా అలవాట్లు ఉంటే మాన్పించేందుకు ప్రభుత్వ యంత్రాంగం, వైద్యశాఖలో ఉన్న నిపుణుల సహకారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి పి. వేణు గోపాలరావు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

డీలర్స్ సేవలు అభినందనీయం

విశాలాంధ్ర - గూడూరు : ప్రజలకు కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం తినడానికి సన్న బియ్యం అందిస్తుండడంతో ఆరోగ్యపరంగా ఉన్న వారు రేషన్‌షాప్‌కు వచ్చి రేషన్ తీసుకున్న వారిని చూసాం. వినియోదారులు రేషన్‌షాప్‌కు రాకపోతే మాకెందుకులే అని సరిపెట్టుకునే డీలర్లను ఈ రోజుల్లో చూసాం. కానీ ఇక్కడ ఆరోగ్యం సరిగా లేక రేషన్ షాప్ దగ్గరికి వెళ్లలేక దయనీయ స్థితిలో వినియోగదారులు ఉన్నప్పుడు ఆ డీలర్ సమాచారం అందుకొని వారి ఇంటి వద్దకే వెళ్లి రేషన్ కార్డ్ ఆధారంగా బియ్యాన్ని అందజేశారు. వివరాల్లోకి వెళితే గూడూరు మండల కేంద్రంలో ఉన్న షాప్ నెంబర్ (35) పొన్నం వెంకన్న డీలర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆ రేషన్‌షాప్‌లో ఉన్న వినియోగదారులు గత కొన్ని రోజుల నుండి కొంతమంది వినియోగదారులకు తమ తమ ఆరోగ్యాలు సరిగా లేకపోవడంతో రేషన్ షాప్ దగ్గరికి వెళ్లి బియ్యం సరుకులు తీసుకోలేని పరిస్థితి నెలకొన్నది. ఎవరినైనా సాయం అడిగినా వేలిముద్ర పెడితేనే సన్న బియ్యం వస్తాయి కాబట్టి వారికి నేనున్నానంటూ ముందుకు వచ్చి డీలర్ వెంకన్న, కుంచపు ఐలయ్య ఆరోగ్యం బాగా లేకపోవడం, రిటైర్ అంగన్వాడి టీచర్ ఉదయగిరి. సరస్వతి కాలు విరిగిపోవడం, అలకుంట్ల చిలుకమ్మా నడవలేని స్థితీలో ఉండడం వల్ల వారి ఇంటికి వెళ్లి వేలిముద్రలు తీసుకొని కొలిసి సన్న బియ్యాన్ని వెంకన్న అందించారు. వెంకన్న మాట్లాడుతూ రేషన్‌షాప్ దగ్గరికి ఇంకా ఎవరైనా రాలేనీ పక్షాన సమాచారం అందిస్తే వారి ఇంటి దగ్గరికి వెళ్లి రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం అందిస్తామని తెలిపారు. డీలర్ వెంకన్న అందిస్తున్న సేవలను గ్రామస్తులు అభినందిస్తున్నారు.

దేశాన్ని సంక్షోభంలోకి నెడుతున్న మోడీ

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్ : మూడవసారి అధికారంలోకి వచ్చిన బిజెపి దేశాన్ని తీవ్రంగా సంక్షోభంలోకి నెట్టేసిందని సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి అన్నారు. బుధవారం సిపిఐ పార్టీ 26 వార్డులో పరిధిలోని రావి నారాయణరెడ్డి సిగ్నల్ కాలని, కాకతీయ కాలనీ, భగత్‌సింగ్ నగర్, సిపిఐ ఆఫీస్ ఏరియా శాఖల మహాసభ సిపిఐ కన్వీనర్ ఎండి ఫాతిమా అధ్యక్షత జరిగిన మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఈ సంవత్సర కాలంలో వికసిద్భారత్ అంటూ ప్రచారం చేసుకుంటున్న బిజెపి దేశాన్ని పూర్తిగా సంక్షోభంలోకి నెట్టింది అన్నారు. ఆపరేషన్ సింధూరం పేరుతో అమెరికా దేశానికి దాసోహం అన్న మోడీ ఆపరేషన్ కగారు పేరుతో చతిస్గఢ్‌లో అడవి సంపదను దోచుకోవడానికి అడవి బిడ్డలను అన్యాయంగా కాల్చుతున్నారన్నారు. సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధిరెడ్డి, ఎండి ఫాతిమా, పెరుగు కుమార్, దేశ పల్లి నవీన్, మామిండ్ల సాంబలక్ష్మి, నర్రా శ్రావణ్, వెలుగు శ్రావణ్, ఆబోతు అశోక్, అలివేణు, నాంచారి దాసు, దిద్ది నరసయ్య, ఎండి షంషీర్, ఉప్పలయ్య, వెంకన్న, బొమ్మన లాలు, కొమరయ్య, పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కావద్దు : సీఐ

విశాలాంధ్ర-కారేపల్లి : విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా చదువుపైనే దృష్టి సారిస్తే సమాజంలో గుర్తింపు లభించి జీవితంలో స్థిర పడవచ్చు అని కారేపల్లి సిఐ బి తిరుపతిరెడ్డి, ఎంఈఓ జయరాజు, ఎస్ఐ గోపి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన కారేపల్లిలోని మోడల్ పాఠశాలలో డ్రగ్స్ నిర్మూలనపై డ్రాయింగ్ కాంపిటేషన్ వ్యాసరచన పోటీలను సీఐ తిరుపతి రెడ్డి ఎస్ఐ గోపి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వ్యాసరచన పోటీలో సింగరేణి మండలంలో గల ఉన్నత పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో డ్రాయింగ్ కాంపిటీషన్లో మొదటి బహుమతి బి పుష్పాంజలి కేజీబీవీ సింగరేణి, ద్వితీయ బహుమతి పి సంతోష్ తెలంగాణ మోడల్ స్కూల్, తృతీయ బహుమతి నిర్మల హైస్కూల్ విద్యార్థి అందుకోగా, వ్యాసరచన పోటీలో మొదటి బహుమతి వర్షిని తెలంగాణ మోడల్ స్కూల్, ద్వితీయ బహుమతి యోగేశ్వరి, తృతీయ బహుమతి దీప్తి జెడిపిఎ మాదారం విద్యార్థులు నిలిచారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రేమ్ కుమార్, భాస్కరరావు ఎంఐ ఎస్ కోఆర్డినేటర్ మోతిలాల్, కంప్యూటర్ ఆపరేటర్ విజయ్,మోడల్ స్కూల్ పాఠశాల సిబ్బంది ఆయా పాఠశాల నుంచి వచ్చినటువంటి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్పత్తులు మహిళా మార్ట్‌లోనే అమ్మకాలు చేయాలి

విశాలాంధ్ర - కారేపల్లి : డ్వాక్రా సంఘాలలో ఉన్న గ్రూపు సభ్యులు తయారు చేసిన మహిళ ఉత్పత్తులు, ప్రాసెస్ చేసిన వస్తువులను నేరుగా ఖమ్మంలో ఏర్పాటు చేసిన మహిళ మార్ట్‌లో అమ్మకానికి పెట్టి విక్రయాలు జరుపుకోవచ్చని కారేపల్లి ఐకేపీ ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లు తెలిపారు. ఐకేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులు పండిరచిన పంటలు, జొన్నలు, సజ్జలు, ఉలువలు, కందులు, పెసలు, బొబ్బర్లు వంటి చిరుధాన్యాలు, వాటి పిండి, స్వీట్లు, పాల ఉత్పత్తులు, వివిధ రకాల పచ్చళ్లు వంటివి ఖమ్మం మహిళా మార్ట్‌లో అమ్మకానికి పెట్టకవచ్చుకోవచ్చని సూచించారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులన్నీ మహిళా మార్ట్‌కు పంపిస్తే మార్ట్‌లో అమ్మకానికి పెడతారని ఆ ఉత్పత్తుల పైకాన్ని మహిళలకు మహిళా సమాఖ్య ద్వారా చెల్లిస్తారని తెలిపారు. అటవీ యేతర ఉత్పత్తులైనటువంటి తేనే, కుంకుడు కాయలు, చింత పండు, వేప నూనె, నేలవేము, శతావరి బంక, కొండ చీపుర్లు, ఇస్తారాకులు వంటివి సేకరించి ఖమ్మం మహిళా మార్ట్ ద్వారా అమ్మకాలకు పెట్టవచ్చన్నారు. కారేపల్లి మండలంలోని స్వయం సహాయక సంఘం సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం సూచించారు. సీసీలు చైతన్య, పగడాల పుష్ప, షేక్ గౌసియా, తుమ్మలపల్లి అనిల్, షేక్ సోందు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనతోనే జిల్లాలో ప్రగతి సాధ్యం : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : ఏ ప్రాంతమైన పరిశ్రమల స్థాపన తోనే బహుముఖంగా ప్రగతి సాధిస్తుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కొత్తగూడెం జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అవుత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరెట్‌లొ ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మతో కలిసి టీజీ ఐపాస్, జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావే శాన్ని సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు మన జిల్లా ఎంతో అనుకూలంగా ఉందన్నారు. దీంతో పెట్టుబడులు పెట్టి పరిశ్రమలు స్థాపించేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని తెలిపారు. వారికి అన్ని రకాల అర్హతలు ఉంటే త్వరితగతిన స్థాపనకు అనుమతులు ఇవ్వాలని అధికారులకు సూచించారు. జిల్లావ్యాప్తంగా టీజీ ఐపాస్, టీప్రైడ్, పీఎం ఈజిపి, పీఎం ఎఫ్ఎంఈ, ముద్ర రుణాలు వంటి పథకాలతోపాటు డిఆర్డిఏ ద్వారా పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా పరిశ్రమలు స్థాపించాలన్నారు. టీజీ ఐపాస్ కింద పరిశ్రమలకు కావలసిన వివిధ రకాల అనుమతులు మంజూరు, పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో ప్రతి ఒక్కరికి సురక్ష బీమా వయోజన, జీవనజ్యోతి బీమా యోజన పథకం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా మట్టి ఇటుకల తయారీకి యూనిట్లు స్థాపించాలన్నారు. జిల్లాలోని అన్ని పంచాయతీలలో బయోచార్, ఏబిసిడి డ్రైవ్‌లపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విద్యా చందన, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ తిరుపతయ్య, ఎల్ డి ఎం రామ్ రెడ్డి, షెడ్యూల్ తెగల సంక్షేమ శాఖ అధికారి అనసూయ, ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్, భూగర్భ జల శాఖ ఏడి రమేష్, మైనింగ్ ఏడి దినేష్ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదలకు ప్రయోజనకరంగా సీఎం రిలీఫ్ ఫండ్ : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - భద్రాచలం : అనారోగ్యం బారినపడి చికిత్స పొంది ఆర్థిక ఇబ్బందులు పడే వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి చాలా ప్రయోజనకారంగా ఉంటుందని డాక్టర్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. ఈ నిధుల ద్వారా తాను అనేక మంది బాధితులకు సహాయం అందించినట్లు వివరించారు. భద్రాచలం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలొ బుధవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. భద్రాచలంకు చెందిన గురజాల సత్యవతికి రూ.18 వేలు, కామవరపు వెంకట సుబ్రహ్మణ్యం కు రూ.26 వేలు, వెంకటాపురం చెందిన యమన వెంకటేశ్వర రావుకు రూ.60 వేల చెక్కులను అందజేశారు. కాంగ్రెస్ డివిజన్ నాయకులు తాళ్లపల్లి రమేష్ గౌడ్, నవాబ్‌తో పాటు మండల నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజల ప్రయోజనాలే ప్రభుత్వ లక్ష్యం : పాయం

విశాలాంధ్ర - బూర్గంపాడ్ : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రయోజనాలు మౌలిక అవసరాలు సమకూర్చే లక్ష్యంగా పనిచేస్తుందని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం బూర్గంపాడు మండలం మోతే, పట్టి నగర్, ఇరవెండి గ్రామాలలో నూతనంగా రూ. 1 కోటి 43 లక్షల వ్యయంతో నిర్మించిన బీటీ రోడ్డు, సిసి రోడ్లను ప్రారంభించారు. అనంతరం ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్దిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో నియోజకవర్గ అభివృద్ధికి తాను నిరంతరం కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు చెప్పారు. ఇందిరమ్మ గృహాల నిర్మాణానికి సంబంధించి భూమి పూజ నిర్వహించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఇందిరమ్మ గృహాల నిర్మాణం ద్వారా నిరుపేదలకు సొంతింటి కల నెరవేరుతుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు.

ఏమర్జెన్సీకి 50 ఏళ్లు

విశాలాంధ్ర - పెనుబల్లి : పెనుబల్లి మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో సిపిఎం మండల కార్యదర్శి గాయం తిరపతి అధ్యక్షతన మండల పార్టీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్‌రావు పాల్గొని మాట్లాడుతూ 1975 జూన్ 25న అత్యవసర ఎమర్జెన్సీ ప్రకటించడం ద్వారా ఆనాడు కవులను, పత్రికా స్వేచ్ఛ లేకుండా ప్రజా ఉద్యమాలను తొక్కేసే పద్ధతిలో కమ్యూనిస్టు నాయకులను జైలు పాలు చేసిన చరిత్ర చీకటి రోజులు గడప వలసి వచ్చిందని అన్నారు. నేడు బిజెపి ప్రభుత్వం ఈ 11 సంవత్సరాల కాలంలో నయా ఫాసిస్టు విధానాలను, రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని గుర్తించాలని అన్నారు. సిపిఎం మండల నాయకులు నల్లమల్ల అరుణ ప్రతాప్, తడికమల్ల చిరంజీవి, చలమాల నరసింహారావు, మిట్టపల్లి నాగమణి, చిట్టి మొదుల కృష్ణ, తాండ్ర రాజేశ్వరరావు, నాగేశ్వరి, గుడిమెట్ల బాబు, పోట్రు రాజారావు, అన్నపు రెడ్డి లక్ష్మయ్య, చిలిమంత సీతారాములు, మల్లెల శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడండి : బండ శ్రీధర్ రెడ్డి

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : రాష్ట్రంలోనే ప్రత్యేక ఏజెన్సీ జిల్లాగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రభుత్వభూములు అన్యాక్రాంత మౌతున్నాయని సమాచార హక్కు సాధన స్రవంతి జిల్లా అధ్యక్షుడు బండ శ్రీధర్ రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఆర్‌టిఐ హియరింగ్‌లో భాగంగా బుధవారం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలొ ఆర్డీవో మధును కలిసి మెమోరాండం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా రెవిన్యూ అధికారులు పూర్తి నిఘాపెట్టి కాపాడవలసిన బాధ్యత ఉందన్నారు. కొందరు రాజకీయాల అండతో ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్భయంగా అక్రమ కట్టడాలను చేపడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారని ఆరోపించారు. ఇలాంటి వారిపై జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులు నిష్పక్షపాతంగా విచారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించే వారికి సహాయపడుతున్న అధికారులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. అధికారుల అండలేనిదే ఎంతటి వారైనా ఆక్రమణకు సాహసం చేయరన్నారు. ఈ కార్యక్రమంలో బోడికల ప్రేమ్ దయాల్, గండ్ర జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

ఎమర్జెన్సీకన్నా హీనం అప్రకటిత ఎమర్జెన్సీ

సరిగ్గా యాభై ఏళ్ల కింద ఇందిరా గాంధీ హయాంలో విధించిన ఎమర్జెన్సీ గురించి అర్ధ శతాబ్దంగా చర్చ జరుగుతూనే ఉంది. రాజ్యాంగంలోని 352వ అధికరణం కింద ఉన్న వెసులుబాటును వినియోగించుకునే ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించారు. దీనికి పూర్వాపరాలు రెండూ ఉన్నాయి. అలహాబాద్ హైకోర్టు 1971లో ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని తీర్పు ఇవ్వడం, ఎమర్జెన్సీ విధించడానికి కొద్ది రోజుల ముందు నుంచి మొదట్లో గుజరాత్ లో తరవాత బీహార్‌లో విద్యార్థులు ఉద్యమించడం, క్రమంగా దానికి లోకనాయక్ జై ప్రకాశ్ నారాయణ్ నాయకత్వం వహించడం లాంటి అనేక కారణాలు ఉన్నాయి. ఎమర్జెన్సీ ఉన్నప్పుడు ప్రాథమిక హక్కులు కూడా హరించుకు పోతాయి. వాటి అమలు కోసం న్యాయస్థానాలను ఆశ్రయించడానికి వీలులేదు. ఇవన్నీ ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించేవే అనడంలో సందేహం లేదు. ప్రతి ఏటా జూన్ 25న ఎమర్జెన్సీ విధించడాన్ని ఖండిస్తూ ఏవో కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉన్నారు. పత్రికల్లో చర్చోపచర్చలు జరుగుతూనే ఉన్నాయి. ఎమర్జెన్సీ విధించడాన్ని ఆ నాటి కొందరు కాంగ్రెస్ మద్దతుదార్లే జీర్ణించుకోలేక పోయారు. ఎమర్జెన్సీ విధించడంవల్ల ఆ తరవాత 1977 ఎన్నికల్లో ఇందిరా గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్‌కు జరగవలసిన నష్టం జరగనే జరిగింది. ఎమర్జెన్సీ విధించడానికి ఇందిర వ్యక్తిగత కారణాలూ ఉన్నాయి. అప్పుడు ఎమర్జెన్సీని సమర్థించిన కొన్ని రాజకీయ పార్టీలు తరవాత నాలుక కరుచుకున్నాయి. విచిత్రం ఏమిటంటే ఎమర్జెన్సీ సమయంలో ఇందిరా గాంధీ నియంతగా మారిన మాట నిజమే కానీ తన నియంతృత్వాన్ని తానే రద్దు చేసుకున్న వ్యక్తి కూడా ప్రపంచంలో ఆమె ఒక్కరే. దేశ సమైక్యత, సమగ్రత, భద్రత, సార్వభౌమాధికారం, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ రక్షణ కోసమే రాజ్యాంగంలో అవకాశం కల్పించారు. ఈ వెసులుబాటును దుర్వినియోగం చేయడం దగ్గరే సమస్య ఉత్పన్నమవుతుంది. ఈ వెసులుబాటు అధికార పార్టీ చేతిలో ప్రత్యర్థులను అణచడానికి పదునైన ఆయుధం అవుతుంది. ఎమర్జెన్సీ నెపంతో ప్రాథమిక హక్కులను సైతం రద్దు చేయవచ్చునన్న వాదన విచిత్రమైంది. రద్దు చేయగలిగిన హక్కులు ప్రాథమిక హక్కులు ఎలా అవుతాయి అన్నది మౌలికమైన ప్రశ్న. ఎమర్జెన్సీని సమర్థించే వారు ఇప్పుడు ఎవరూ కనిపించకపోవచ్చు. అయిదు దశాబ్దాలుగా ఆ చీకటి రోజులను ఖండిస్తూనే ఉన్నాం. ఏ శక్తులను అణచాలని ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించారో ఆ శక్తులే ఇప్పుడు అధికారంలో ఉన్నాయి. ఆ శక్తులు ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన ధీరులమని గొప్పలు చెప్పుకుంటాయి. అయితే లోపాయికారీగా ఆ శక్తులే ఆ సమయంలోనే ఇందిరా గాంధీతో మిలాఖతైన రుజువులూ ఉన్నాయి. ఎమర్జెన్సీని తూర్పారబట్టిన వారు ఆ కాళ రాత్రుల నుంచి బయటపడే ప్రయత్నం ఏమైనా చేస్తున్నారా అని ఆలోచించాల్సిందే. ఇందిరా గాంధీ అణచివేయాలనుకున్న శక్తులు ఇప్పుడు అధికారంలో ఉన్నాయి. ఇందిరా గాంధీ మనవడిని తప్పుబట్టడానికి కూడా ఆ శక్తులు ఎమర్జెన్సీ అకృత్యాలను ప్రస్తావిస్తూనే ఉంటాయి. ఓం బిర్లా రెండవసారి లోక్‌సభ స్పీకర్ అయిన తరవాత ఎమర్జెన్సీ విధించడాన్ని నిరసిస్తూ స్వయంగా తీర్మానం ప్రతిపాదించారు. ఎమర్జెన్సీ భయంకరమైందే. ప్రజాస్వామ్యానికి విరుద్ధమైందే. అప్పటి అకృత్యాలనూ ఖండించాల్సిందే. కానీ మోదీ ప్రధానిగా ఎన్నికైన తరవాత కేంద్ర మాజీ హోం మంత్రి లాల్ కృష్ణ అడ్వాణీ మళ్లీ ఎమర్జెన్సీ విధించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆ హెచ్చరిక పరోక్షంగా నిజమైందేమోనని గత 11 ఏళ్ల మోదీ పాలన నిరూపిస్తోంది. అంటే ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడామని చెప్పుకునే వారు సైతం ఆ అకృత్యం నుంచి గుణపాఠాలు ఏమీ నేర్చుకోనట్టే.

ఎమర్జెన్సీని దుయ్యబట్టే వారైనా ఆ అనుభవం నుంచి ఏమైనా గుణపాఠాలు నేర్చుకున్నారా అంటే అదీ కనిపించదు. కానీ ఎమర్జెన్సీ వల్ల ప్రయోజనం పొందింది సరిగా ఆ శక్తులే. నామమాత్రంగా కొనసాగుతున్న ఆర్‌ఎస్‌ఎస్ ఎమర్జెన్సీ పుణ్యమా అని అధికారంలోకి రాగలిగింది. ఎమర్జెన్సీకి ముందు సంపూర్ణ విప్లవ ఉద్యమానికి నాయకత్వం వహించిన జై ప్రకాశ్ నారాయణ్ అండే లేకపోతే ఆర్‌ఎస్‌ఎస్ ప్రోత్సహించే మతోన్మాద శక్తులు అందలమెక్కేవే కాదేమో. ఇందిరా గాంధీ మీద ఉన్న వ్యతిరేకతతో జై ప్రకాశ్ నారాయణ్ ఆయన సహజ స్వభావానికి విరుద్ధంగా ఆర్‌ఎస్‌ఎస్‌ను రాజకీయ రంగంలో కేంద్ర స్థానానికి తీసుకొచ్చారు. అప్రజాస్వామిక చర్యలను, నియంతృత్వ పోకడలను ఎదిరించడానికి ఆయన అప్రజాస్వామిక విధానాలనే అనుసరించారు. సంపూర్ణ విప్లవోద్యమానికి నాయకుడు జై ప్రకాశ్ నారాయణే అయినప్పటికి ఆయన సైన్యం లేని సేనాని. ఆ ఎమర్జెన్సీ కన్నా ముందు వాహినులు అన్న పేర్లతో ఆర్‌ఎస్‌ఎస్‌కు విధేయులైన వారు ఏవో ఉద్యమాలు నిర్వహించే వారు. వారే జై ప్రకాశ్ నారాణ్‌కు అందివచ్చిన కార్యకర్తలు. మహాత్మా గాంధీని కాల్చి చంపిన నాథూ రాం గాడ్సే కుదురుకు చెందినవే ఈ వాహినులన్నీ. గాంధీని హతమార్చినందువల్లే ఆ రోజుల్లో సంఘపరివార్‌కు హడావుడి చేసే అవకాశం రాలేదు. కానీ కార్యకర్తలు లేని లోటును పూడ్చుకోవడానికి జై ప్రకాశ్ నారాయణ్ ఆర్‌ఎస్‌ఎస్ దండును చేరదీసి సంఘ పరివార్ కు గౌరవ స్థానం కల్పించారు. ఉన్నది ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలే కనక ఆ దళాలకు కరడు గట్టిన ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త అయిన నానాజీ దేశ్‌ముఖ్ కు కార్యకర్తలను నడిపే అవకాశం ఇచ్చారు. ఇదే ఆర్‌ఎస్‌ఎస్‌ను కేంద్ర స్థానంలోకి తీసుకొచ్చింది. అంతవరకు అనామకంగా ఉండి పోయిన ఆర్‌ఎస్‌ఎస్‌కు అనుబంధ సంస్థ అయిన భారతీయ జనసంఘ్ జనతా పార్టీలో విలీనమై కీలక స్థానాలలోకి చేరింది. ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు అవుతున్న సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కాంగ్రెస్ మీద విరుచుకుపడడానికి ఆ చీకటి రోజులనే పదే పదే గుర్తు చేస్తుంటారు. మళ్లీ ఎమర్జెన్సీ విధించవచ్చునన్న అద్వాణీ మాటను మోదీ ఆ పేరెత్తకుండా అమలు చేస్తున్నారు. మోదీ హయాంలో చట్టబద్ధతకు, చట్టాల ఉల్లంఘనకు మధ్య విభజన రేఖ తుడిచేశారు. నియంతృత్వ దశ కూడా దాటుతున్నారు. మెజారిటీ వర్గ ఆధిపత్యం–నిరంకుశత్వం కలగలిసి పోయాయి. మన దేశ అస్తిత్వానికి పునాది అయిన బహుళత్వ భావన, సెక్యులరిజం, సోదరభావం మటుమాయమై పోయాయి. రాజ్యాంగ నైతికత మచ్చుకు కూడా కనిపించదు. సంఘ పరివార్ రాజ్యాంగాన్ని ఎన్నడూ ఆదరించలేదు. ఇందులో భారతీయ ఆత్మలేదని వాదిస్తోంది. మోదీ పదకొండేళ్ల పాలనలో న్యాయమార్గ పాలన అన్న భావనే మృగ్యమైంది. ప్రజాస్వామ్య విలువలను పాటించకుండా ప్రజాస్వామ్యం మనగలుగుతుందా? రాజ్యాంగ స్ఫూర్తి లేకుండా రాజ్యాంగం సచేతనంగా ఉంటుందా? ప్రజాస్వామ్య విలువలపై విశ్వాసం లేని వారు. రాజ్యాంగాన్ని తూలనాడిన వారు ఇప్పుడు అధికారంలో ఉన్నారు. అందుకే చట్టబద్ధంగా ప్రకటించకుండానే ఎమర్జెన్సీ అమలు చేస్తున్నారు. ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ కన్నా ఇది అత్యంత ప్రమాదకరం. నియంతృత్వ కోరలనుంచి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించినప్పుడు, రాజ్యాంగ విలువలపై గౌరవం పెరిగినప్పుడు, ప్రజల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించినప్పుడు మాత్రమే ప్రజాస్వామ్యం బట్ట కడ్తుంది. జనం నిరంతరం కన్నార్పకుండా నిఘా వేసి ఉంచితేనే ప్రజాస్వామ్యం బతుకుతుంది. ప్రభుత్వ కబంధ హస్తాల నుంచి వివిధ వ్యవస్థలకు విముక్తి కలుగుతుంది. న్యాయవ్యవస్థకు ఊపిరాడుతుంది. ఇందిరా గాంధీని తూర్పారబడ్తూ అదే మార్గాన్ని అనుసరించడం ఎమర్జెన్సీ కన్నా ఎక్కువ ప్రమాదకరం.

ఉప ఎన్నికల ఫలితాలతో బీజేపీలో నిరాశ

జ్ఞాన్ పాఠక్

ఐదు అసెంబ్లీ ఉప ఎన్నికల ఫలితాలు బీజేపీకి ఆందోళన కలిగించగా, ఇండియా బ్లాక్‌లో ఆశలు రేపాయి. నాలుగు రాష్ట్రాల్లో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు జరిగాయి. ఫలితాలు సోమవారం వెలువడ్డాయి. గుజరాత్, కేరళ, పంజాబ్, పశ్చిమబెంగాల్‌లో ఈ ఉప ఎన్నికలు జరిగాయి. కేరళ అసెంబ్లీ గడువు 2026 మే 23వ తేదీతో ముగియనుంది. పశ్చిమబెంగాల్ అసెంబ్లీ గడువు 2026 మే 7వ తేదీన ముగుస్తుంది. పంజాబ్ అసెంబ్లీ గడువు 2027 మార్చి16వ తేదీన, గుజరాత్ అసెంబ్లీ గడువు 2027 డిసెంబరు 19న ముగియనుంది. ఉప ఎన్నికల ఫలితాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. కేరళ నీలాంబర్ అసెంబ్లీ నియోజకవర్గంలో విజయంసాధించిన సీపీఎం మద్దతు తెలియజేసిన ఇండిపెండెంట్ అభ్యర్థి పీబీ అన్వర్ రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక అవసరమైంది. ఈ సీటు సీపీఎంకు చాలా ముఖ్యమైనది. అప్పటి ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుంచి అన్వర్ 46.9శాతం ఓట్లతో గెలిచారు. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థికి 45.34శాతం ఓట్లు లభించాయి. బీజేపీ 4.96శాతం ఓట్లతో మూడవస్థానంలో నిలిచింది. ఉప ఎన్నికల్లో సీపీఎం, కాంగ్రెస్ పోటాపోటీగా పాల్గొన్నాయి. ఉప ఎన్నికల్లో సీపీఎం తమ సొంత అభ్యర్థిని పోటీచేయించగా, 11,077 ఓట్ల తేడాతో ఓడిపోగా కాంగ్రెస్ గెలుపొందింది. ఎల్‌డీఎఫ్‌కి ఈ ఓటమి ఆందోళన కలిగించేదే. కాంగ్రెస్ 77,737 ఓట్లు తెచ్చుకుని గెలుపొందింది. సీపీఎం అభ్యర్థికి 66,660 ఓట్లు లభించాయి. దీనితో కాంగ్రెస్ చాలా సంతోషాన్ని వెలిబుచ్చుతోంది. మరో 11మాసాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇండిపెండెంట్‌గా పోటీచేసిన పీబీ అన్వర్‌కు ఈసారి 19,760 ఓట్లు మాత్రమే లభించాయి. కాంగ్రెస్ అభ్యర్థికి కూడా గతంకంటే తక్కువ ఓట్లు లభించాయి. గతంలో 78,527 ఓట్లు లభించాయి. అప్పుడు ఎల్‌డీఎఫ్ అభ్యర్థికంటే ఈ ఓట్లు తక్కువే. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మంచి ఫలితం రాగా, వచ్చే ఏడాది అసెంబ్లీకి జరగనున్న ఎన్నికల్లో తాము గెలుపొందగలమని ధీమా వ్యక్తంచేస్తోంది.

కేరళ అసెంబ్లీలో అడుగుపెట్టాలని బీజేపీ చేస్తున్న ప్రయత్నం విఫలమవుతూనే ఉంది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి 8,595 ఓట్లు పొందారు. ఈ సారి ఇంచుమించు అంతే సంఖ్యలో 8648 ఓట్లు మాత్రమే లభించాయి. బీజేపీ కన్నకలలు ఆందోళన కలిగించే స్థితికిచేరాయి. గుజరాత్ ఉప ఎన్నికలు విశవదర్, కడి నియోజకవర్గాలకు జరిగాయి. ఈ రెండు స్థానాల్లోనూ బీజేపీ,ఆప్, కాంగ్రెస్ గెలిచేందుకు తీవ్రంగా పోరాడాయి. బీజేపీకి అత్యంత ప్రముఖమైనవి ఈ నియోజకవర్గాలు. 1998నుంచి బీజేపీ గెలుపొందుతూనే ఉంది. ప్రధాని నరేంద్రమోదీ, హోం మంత్రి అమిత్‌షా సొంత రాష్ట్రం ఇది. మోదీ పలుకుబడి క్రమంగా దిగజారిపోయి ఒక స్థానంలో ఆప్ గెలుపొందడంతో బీజేపీ ఆందోళన చెందుతోంది. ఆప్ రాజకీయంగా, న్యాయబద్ధంగా గెలుపొందగలిగింది. విశవదర్ సీటు నుంచి గతంలో ఆప్ తరపున గెలుపొందిన భూపేందర్ భయాని రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఆప్ అభ్యర్థి ఇటాలియా భూపాల్ ఈ స్థానం నుంచి 17,554 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. బీజేపీ అభ్యర్థి కిరిత్ పటేల్ ఓడిపోయారు. ఆప్ అభ్యర్థికి 75, 942 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థికి 58,388 ఓట్లు లభించాయి. ఆప్ అభ్యర్థి ఓట్లు గణనీయంగా పెరిగాయి. బీజేపీ అభ్యర్థికి గతంలో కన్నా ఈ ఉప ఎన్నికలో తక్కువ ఓట్లు పోలయ్యాయి. గుజరాత్‌లో ఓడిపోవడం బీజేపీ తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. గుజరాత్, పంజాబ్‌లలో ఆప్ గెలుపొంది రాణించింది. అలాగే పశ్చిమబెంగాల్‌లో టీఎంసీ గెలుపొందింది.

సాగులో నకిలీ మాయాజాలం

కేవీవీ ప్రసాద్

కల్తీ విత్తనాలు, నకిలీ ఎరువులు, పురుగుమందుల వినియోగంతో రైతులకు సాగు కష్టాలు తప్పడంలేదు. దేశంలో పెరుగుతున్న జనాభాకు ఆహార భద్రత కల్పించాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని ఆధునికీకరించాలి. సాగునీటి వినియోగాన్ని పెంచి వ్యవసాయయోగ్యమైన భూమికి సాగునీరందించాలి. మరో పక్క నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు రైతాంగానికి అందించాలి. తద్వారా పంటల ఉత్పత్తి, ఉత్పాదకత గణనీయంగా పెంచవచ్చు. నాణ్యమైన విత్తనాలను ఉపయోగించడం వల్ల 15 నుంచి 20 శాతం పంటల ఉత్పాదకత పెరుగుతుందని వ్యవసాయరంగ శాస్త్రవేత్తల అంచనా. కల్తీలేని నాణ్యమైన ఎరువుల వినియోగంతో పంటల దిగుబడి గణనీయంగా పెరుగుతుందనేది వాస్తవం. అదే విధంగా వివిధ పంటలకు సోకే తెగుళ్ల వల్ల సుమారు 40 శాతం పంట నష్టం జరుగుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెపుతున్నారు. రైతులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు వినియోగించడం వల్ల పంట దిగుబడులు పెరగడంతోపాటు పర్యావరణ పరిరక్షణ, ప్రజలు, పశుపక్ష్యాదుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుంది.

అందువల్ల వ్యవసాయం చేసే రైతుకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించాల్సిన బాధ్యతను ప్రభుత్వాలు గుర్తించాలి. అందుకు తగిన విధంగా నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు తయారు చేసే వారితోపాటు అమ్మే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకొనేలా చట్టాలు రూపొందించాలి. అమలుకు తగిన కార్యాచరణ సైతం చేపట్టాలి. నాణ్యమైన విత్తన ఎంపిక, నకిలీ ఎరువులు, పురుగుల వినియోగంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. లాభాపేక్షే ధ్యేయంగా కొందరు వ్యాపారులు యథేచ్ఛగా నకిలీ వ్యాపారం సాగిస్తున్నారు. రాష్ట్రంలో గుంటూరు, కర్నూలు వీటికి అడ్డాగా ఉన్నాయని సర్వే సర్వత్రా చెప్పే మాటలే. కానీ వ్యవసాయశాఖకు ఏ మాత్రం పట్టదు. కొందరు వ్యాపారులపై కేసులు నమోదు చేసినా చర్యలు నామమాత్రం. ఫలితంగా వ్యాపారవర్గాల నకిలీ లీలలు యథేచ్ఛగా సాగుతూనే ఉన్నాయి. నకిలీ వ్యాపారుల ఆగడాలు రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి.

భారత వాణిజ్య పరిశ్రమల సమాఖ్య (ఈఐసీసీఐ) నివేదిక ప్రకారం వ్యవసాయంలో నకిలీ రసాయనాల వాడకంవల్ల మన దేశంలో ప్రతి సంవత్సరం రైతాంగానికి సుమారు 3,000 కోట్ల రూపాయలకుపైగా నష్టం సంభవిస్తుందని అంచనా. దేశ వ్యాపితంగా విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల నాణ్యతపట్ల తనిఖీలు చేసి పరీక్షించిన గణాంకాల ప్రకారం 2023–24లో 1,33,588 విత్తన నమూనాలు పరిశీలిస్తే 3,630 నమూనాలు నాణ్యతా ప్రమాణాలకు తగ్గట్లులేవని గుర్తించారు. 1,81,153 ఎరువుల నమూనాలను పరీక్షించగా 8,988 నమోనాలు సవ్యంగా లేవని తేలాయి. 80,789 పురుగు మందుల నమూనాలు పరీక్షించగా 2,222 నమూనాలు నకిలీవిగా రుజువయ్యాయి. ఇవి అధికారికంగా గుర్తించి పరీక్షించినవి మాత్రమే. కనీసం అమ్మకపు లైసెన్సు కూడా లేని వ్యాపారులు సాగించే నకిలీ మాయాజాలంలోపడి క్షేత్ర స్థాయిలో రైతుల వినియోగం మరింత అధికంగా ఉంటుదనేది వాస్తవం.

ఏటా ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలు అనేక రకాల విత్తన వంగడాలను, వ్యవసాయానికి ఎరువులు, పురుగు మందులను తయారుచేసి విడుదల చేస్తున్నాయి. వాటి నాణ్యతను పరీక్షించే ప్రయోగశాలలు, సిబ్బంది సరిపడాలేరని శాస్త్రవేత్తలు వెల్లడిస్తున్నారు. ఐసీఏఆర్ వివరాల ప్రకారం 2014–22 మధ్య కాలంలో 2279 పైగా అధిక దిగుబడినిచ్చే పంటల రకాలను విడుదల చేసింది. దేశ వ్యాపితంగా 2021–22లో విత్తనాల లభ్యత 498.83 లక్షల క్వింటాళ్లు కాగా ప్రైవేటు సంస్థలు ఉత్పత్తి చేసినవి 332.99 లక్షల క్వింటాళ్లు. ప్రభుత్వ సంస్థలు ఉత్పత్తి చేసినవి కేవలం 165.84 లక్షల క్వింటాళ్లు. అంటే విత్తన ఉత్పత్తిలో అత్యధిక శాతం ప్రైవేటు సంస్థలు రూపొందించినవే. రాను, రాను విత్తన వ్యవస్థ ప్రభుత్వ విత్తన సంస్థల నుంచి ప్రైవేటు సంస్థల చేతుల్లోకి వెళుతోంది. ప్రైవేటు విత్తన వ్యాపారుల దోపిడీకి రైతులు బలికాక తప్పటం లేదు. విత్తన నాణ్యత ప్రయోగశాలలు కేవలం 167 మాత్రమే దేశవ్యాపితంగా ఉన్నాయి. రసాయన, జీవ పురుగు మందుల, ప్రయోగశాలలు 81 ఉండగా, ఎరువుల నాణ్యత పరీక్ష ప్రయోగశాలలు 76 మాత్రమే ఉన్నాయి. రాష్ట్రాల స్థాయిలో వీటి సంఖ్య పరిమితం. దేశ వ్యాపితంగా ఖరీఫ్, రబీ సీజన్‌లో ప్రతి డీలర్ దుకాణాన్ని తనిఖీ చేసి లక్షలాదిగా ఉన్న నమూనాలను పరీక్షించాలంటే ప్రస్తుతం ఉన్న ప్రయోగశాలలు ఏ మాత్రం చాలవు. సిబ్బంది చాలరు. నిధుల కొరత ఉంది. ఈ స్థితిలో దశాబ్దాలకుపైబడి రూపొందించిన చట్టాల్లో మార్పులు అత్యవసరం.

మన దేశంలో విత్తన చట్టం 1966 విత్తన నియమాలు 1968 విత్తనాల (నియంత్రణ) ఉత్తర్వు 1983, పురుగుమందుల చట్టం 1968, పురుగు ముందుల నియమాలు 1971, ఎరువుల నియంత్రణ ఉత్తర్వు 1985 లాంటి చట్టాలు, నియమాల ద్వారా నకిలీలను నియంత్రించవచ్చు. చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు. కానీ రాజకీయ జోక్యం అవినీతి కారణంగా అధికార యంత్రాంగం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తూ రైతులకు ద్రోహం చేస్తున్నది. ఫలితంగా నకిలీ మాయాజాలంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రస్తుతం ఉన్న చట్టాలు, నియమాలు, వ్యవసాయంలో వస్తున్న మార్పులకు అనుగుణంగాలేవు. 1966 విత్తనచట్టంలో అనేక లోపాలు గుర్తించారు. నోటిఫై చేయని విత్తన రకాలు, పరిశోధన హైబ్రీడ్ రకాలు ఈ చట్టపరిధిలోకి రావు. సాగు రకాలు విత్తన ఉత్పత్తిదారు, ప్రాసెసింగ్ యూనిట్, విత్తన డీలరు నమోదు చట్టపరిధిలోకి రావు. విత్తన ధరను నియంత్రించే నిబంధన లేదు. చట్టంలో ఉన్న నామమాత్రపు నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా విధింపు నామమాత్రంగా ఉంటుంది. నాసిరకం, నాణ్యత తక్కువతో పంట సాగు దిగుబడి తగ్గడంతో రైతుకు పరిహారం చెల్లింపుల అంశం లేదు. అందువల్ల 1966 విత్తన చట్టం స్థానంలో పటిష్టమైన విత్తనచట్టం తక్షణావశ్యకత. అదే విధంగా నకిలీ ఎరువులు, పురుగుమందుల తయారీ, అమ్మకందారులను సైతం చట్ట పరిధిలోకి తెచ్చేలా చట్టాలను రూపొందించాలి. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం నూతన విత్తన చట్టం తేవాలని సంకల్పించి వ్యవసాయరంగ నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసింది. సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల నకిలీల మాయాజాలాన్ని నియంత్రించేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా దృష్టి సారించి నూతన చట్టాలు రూపొందించాలి. జాతీయ స్థాయిలో సైతం చట్టాలు రూపొందించేందుకు కేంద్రంపై ఒత్తిడి తేవాలి. రైతాంగం విత్తనాలు, పురుగుమందులు కొనే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. నకిలీలను అరికట్టేందుకు నూతన చట్టాల కోసం ఉద్యమించాలి. చట్టాలు సాధించాలి.

ప్రధాన కార్యదర్శి,ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం

కాల్పుల విరమణే శరణ్యం

కె. రవీంద్రన్

ఇరాన్‌పై ఇజ్రాయిల్ ఆకస్మికంగా దాడులు జరిపి పశ్చిమాసియాలో కల్లోల పరిస్థితులను సృష్టించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆమోదం లేకుండా ఇజ్రాయిల్ దాడికి పూనుకోబోదన్న అభిప్రాయం ఎక్కువగా ఉన్నది. ఇరాన్–ఇజ్రాయిల్ మధ్య పది రోజుల పాటు యుద్ధం జరిగాక ట్రంప్ యుద్ధరంగంలోకి దిగి ఇరాన్‌లో మూడు చోట్ల అణుస్థావరాలపై బాంబులు వేసి ఎక్కువగా నష్టపరిచినట్టు చెపుతున్నారు. కాల్పుల విరమణకు ఇరాన్–ఇజ్రాయిల్ అంగీకరించాయని ట్రంప్ ఆదివారంనాడు ప్రకటించారు. కాల్పుల విరమణకు ఒప్పందం జరగకపోయినా అందుకు రెండు దేశాలు అంగీకరించాయి. కాల్పుల విరమణకు అంగీకరించిన తర్వాత కూడా ఇజ్రాయిల్ ఇరాన్‌పైన క్షిపణుల దాడులు చేసింది. ట్రంప్‌ను లెక్కచేయకుండా ఇజ్రాయిల్ ఇరాన్‌పై బాంబులు కూడా వేయడంతో తక్షణం బాంబులు వేయడం ఆపాలని ట్రంప్ ఇజ్రాయిల్‌ను హెచ్చరించారు. ఈ నేపథ్యంలో రోజుకో మాటమాట్లాడే ట్రంప్ పశ్చిమాసియాలో శాంతి నెలకొల్పుతానని చేసిన ప్రకటన నెరవేరాలంటే మూడు దేశాల మధ్య కాల్పుల విరమణ మాత్రమే శరణ్యం. ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు బ్రతిమాలడం వల్ల ట్రంప్ యుద్ధరంగంలోకి దిగినట్టు చెప్పుకుంటున్నారు. పశ్చిమాసియాలో శాంతి నెలకొనాలంటే వెంటనే మూడు దేశాల ప్రతినిధులు చర్చించి కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవాలి. ఇరాన్ అణ్వాయుధాలు తయారుచేస్తున్నదన్న స్థావరాల నుంచి యుద్ధం ప్రారంభ దశలోనే అణు పరికరాలను ట్రంప్ అనుమానించి దాడి జరిపిన ప్రాంతం నుంచి రహస్య స్థావరాలకు తరలించినట్టు చెపుతున్నారు. ఇజ్రాయిల్‌లో అత్యంత విలువైన ఖనిజాలను స్వాధీనం చేసుకునేందుకే ట్రంప్ ఇజ్రాయిల్‌కు సర్వవిధాలుగా సహాయం చేసినట్టుగా కూడా చెప్తున్నారు.

ఇరాన్ అణు కార్యక్రమం అమలుగాకుండా నిలువరించాలని ఇజ్రాయిల్ చాలా కాలంగా ప్రయత్నిస్తోంది. ఇరాన్ అణ్వస్త్రాలను తయారుచేస్తోందనీ, ఆ ప్రయత్నాలను ఆపాలని అమెరికా అనేక సంవత్సరాలుగా బెదిరిస్తోంది. టెల్‌అవీవ్ నగరాన్ని ధ్వంసం చేయడానికి ఇరాన్ ప్రయత్నిస్తోంది. అయితే, ఇజ్రాయిల్ దౌత్యపరమైన లాబీ ప్రచారాలు, సైబర్‌దాడులు అంతిమంగా ఈ నెలలో లెక్కలేనన్ని సార్లు రహస్యంగా విధ్వంస కార్యకలాపాలు నిర్వహించాలనీ, ప్రత్యక్షంగా సైనిక చర్యలను అమెరికా అండ తీసుకోవాలని ఇజ్రాయిల్ నిర్ణయించింది.



> ఇరాన్ అణు కార్యక్రమం అమలుగాకుండా నిలువరించాలని ఇజ్రాయిల్ చాలా కాలంగా ప్రయత్నిస్తోంది. ఇరాన్ అణ్వస్త్రాలను తయారుచేస్తోందనీ, ఆ ప్రయత్నాలను ఆపాలని ఆమెరికా అనేక సంవత్సరాలుగా బెదిరిస్తోంది. టెల్‌అవీవ్ నగరాన్ని ధ్వంసం చేయడానికి ఇరాన్ ప్రయత్నిస్తోంది.

అయితే, తాజాగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరిగడంతో ట్రంప్ హెచ్చరికలతో ఇజ్రాయిల్ సైనికాధిపతులు యుద్ధ ప్రాంతాలలో చేరి పరిస్థితిని తిరిగి సమీక్షిస్తున్నారు. అణ్వస్త్రాలను తయారుచేసుకోగల శక్తి ఇరాన్‌కు ఉందని ఇజ్రాయిల్ చాలా కాలంగా భావిస్తోంది. అంతేకాదు వ్యూహాత్మక భీతిని కలిగిస్తుందని ఇజ్రాయిల్ ఆందోళన చెందుతోంది. బాలిస్టిక్ మిస్సిలీ ప్రయోగం ద్వారా ఇరాన్ తక్షణం అత్యంత తీవ్రమైన ప్రమాదం కలిగిస్తుందని ఇజ్రాయిల్ అనుమానిస్తోంది. 12 రోజుల యుద్ధకాలంలో ఇరాన్ మిస్సిలీలతో జరిపిన దాడులతో ఇజ్రాయిల్–రక్షణ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. పౌరులు తీవ్రంగా వణికిపోయారు. టెల్‌అవీవ్‌ను లక్ష్యంగా చేసుకుని 500 బాలిస్టిక్ మిస్సిలీలను ప్రయోగించినట్టుగా రిపోర్టులు అందాయి. ఇజ్రాయిల్ లోపల అనేక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ మిస్సిలీలను ప్రయోగించి భారీ నష్టం కలిగించినట్టు వార్తలు అందుతున్నాయి. ఇజ్రాయిల్ అత్యంత శక్తిమంతమైన ఐరన్ డోమ్‌ను పనిచేయకుండా బాలిస్టిక్ మిస్సిలీలతో ఇరాన్ ధ్వంసం చేసింది. మిస్సిలీల ప్రయోగం కారణంగా ఇజ్రాయిల్‌లో ప్రజాజీవనాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించింది. ఇరాన్ ఉత్పత్తిచేసే మిస్సిలీల శక్తిని తక్కువ అంచనావేసింది. నెలకు 300 మిస్సిలీలను ఇరాన్ ఉత్పత్తి చేయగలదని రక్షణ వ్యవస్థ విశ్లేషకులు అంచనా వేశారు. అలాగే గత ఆరు సంవత్సరాల కాలంలో 30వేల మిస్సిలీలు తయారుచేసినట్టుగా అంచనా వేశారు. ఇది కేవలం సైనిక వ్యూహం మాత్రమే కాదు. వణికించే రాజకీయ వాస్తవం. అయితే, ఇజ్రాయిల్ చాలా కాలంగా మిలటరీ ఆధిక్యత కలిగివుంది. కచ్చితమైన అంచనాలతో దాడులు చేయగల శక్తి ఇజ్రాయిల్‌కు ఉందని విశ్లేషకులు అంచనావేస్తున్నారు. అనేక వైపులా దాడులు చేయగల శక్తివుంది. యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి ఇజ్రాయిల్ యుద్ధవిమానాలతో దాడులు చేస్తున్నప్పటికీ అత్యంత కఠినత్వాన్ని ఎదుర్కొన్నది. ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజిమిన్ నెతన్యాహు నాయకత్వంలో మంత్రివర్గం సమావేశమై నూతన లక్ష్యాలను చర్చిస్తోంది. ఇరాన్ అణుకార్యక్రమాల లక్ష్యాలను తేలికగా, నిర్ణయాత్మకమైన దెబ్బకొట్టగలనని ప్రారంభంలో ఇజ్రాయిల్ భావించింది. అయితే, అనేక ఆయుధ సౌకర్య స్థావరాలకు నష్టం కలిగించింది. యుద్ధం ప్రారంభంలో ఇరాన్ మిస్సిలీల ప్రయోగం కొంత జాప్యం జరగడంతో ఇజ్రాయిల్ అమెరికా సహాయంతో పై చేయి అనిపించింది. అయితే, యుద్ధం కొనసాగుతున్న రోజులలో ఇరాన్ గణనీయంగా నష్టాలను ఎదుర్కొన్నది. ఇస్లామిక్ రిపబ్లిక్ దీర్ఘకాలం యుద్ధం జరిగితే ఇజ్రాయిల్‌కు భారీ నష్టం కలిగించగలనని ఇరాన్‌కు తెలుసు. దీర్ఘకాలం యుద్ధం అమెరికా సైన్యం ఎక్కువ రిస్క్ తీసుకోవలసి వచ్చేది. ప్రాంతీయ అస్థిరత్వం కలిగేది. అమెరికా ఆర్థికంగా కోలుకోవడానికి చాలా కాలం పట్టేది. ఇప్పటికే ఇరాన్ భౌగోళిక రాజకీయంగా ప్రయోజనం పొందింది. ఘర్షణ జరిగిన 12 రోజుల్లో ఇరాన్ 30–40 శాతం ముడిచమురు ఎగుమతిని పెంచింది. ప్రపంచ ఇంధనం మార్కెట్లు తీవ్రంగా నష్టపోయాయి. ముడిచమురు ధరలు పెరిగాయి. ఈ తరుణంలో కాల్పుల విరమణ కచ్చితంగా పరిష్కారమవుతుంది. ఇతర ప్రపంచ దేశాలలో కూడా యుద్ధం చల్లారాలని, దాని వల్ల తమకు స్వప్రయోజనాలు నెరవేరుతాయని భావిస్తున్నాయి. అమెరికా సైనికంగా ఇజ్రాయిల్‌తో కలిసిపోయినప్పటికీ పశ్చిమాసియాలో పూర్తిస్థాయిలో యుద్ధం కొనసాగితే ముడిచమురు ధరలు మరింత పెరుగుతాయి. షిప్‌ల రవాణాకు అంతరాయం కలుగుతుంది. ఎక్కువ కాలం అమెరికా సైన్యం యుద్ధ ప్రాంతంలో ఉండి నష్టపోయవడానికి సిద్ధంగా లేదు. అందువల్లనే ఇజ్రాయిల్ సైనిక కార్యకలాపాలకు మద్దతుగా నిలిచింది. క్రియాశీల మధ్యవర్తిగా అమెరికా పనిచేస్తున్నది. గల్ఫ్ దేశాలలో చాలా దేశాలు ఇటీవల ఇజ్రాయిల్‌తో సాధారణ సంబంధాలను ఏర్పర్చుకున్నాయి. ఈ తరుణంలో కాల్పుల విరమణ ఒప్పందం పూర్తిస్థాయి పరిష్కారం అవుతుందని భావించవచ్చు.

మోదీ 11ఏళ్ల పాలన 'అప్రకటిత ఎమర్జెన్సీ'

- ప్రజాస్వామ్యం 5 రెట్లు దాడికి గురైంది
- పౌరస్వేచ్ఛ అణచివేత... విద్వేష వ్యాప్తి
- రాజ్యాంగంపై దాడి చేస్తున్నారు.
- బీజేపీపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు

న్యూఢిల్లీ: కేంద్రంలోని మోదీ సర్కార్ ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బీజేపీ రాజ్యాంగ హత్యా దినోత్సవం జరపుతుండడంపై కాంగ్రెస్ మండిపడింది. మోదీ 11 ఏళ్ల పాలనను 'అప్రకటిత అత్యవసర పరిస్థితి'గా అభివర్ణించింది. ఎమర్జెన్సీ సమయంలో కంటే మోదీ హయాంలో ప్రజాస్వామ్యం 5 రెట్లు ఎక్కువగా దాడికి గురైందని ఘాటు విమర్శలు చేసింది. మోదీ 11 ఏళ్ల పాలనలో 'హద్దులేని ద్వేషపూరిత ప్రసంగాలు చేయడం, పౌర స్వేచ్ఛను అణిచివేయడం' జరుగుతోందని కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. "మోదీ సర్కార్? తమను విమర్శించేవారిని దుర్భాషలాడుతోంది. అంతేకాదు ఉద్దేశపూర్వకంగా ద్వేషం, మతతత్వాన్ని వ్యాపింపజేస్తోంది. నిరసన తెలుపుతున్న రైతులపై 'ఖలిస్థానీలు' అని ముద్రవేస్తోంది. కుల గణనను సమర్థించేవారిని 'అర్బన్ నక్సల్స్' అంటోంది" అని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్' వేదికగా విరుచుకుపడ్డారు. ప్రస్తుతం దేశంలో మహాత్మా గాంధీ హంతకులను కీర్తిస్తున్నారు. మైనారిటీలు తమ ప్రాణాలు, ఆస్తులు పోతాయేమోనని భయపడి జీవిస్తున్నారు. దళితులు, ఇతర అణగారిన వర్గాలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ద్వేషపూరిత ప్రసంగాలు చేసేవారికి పదోన్నతులు లభిస్తున్నాయి' అని జైరాం రమేశ్ పేర్కొన్నారు. మోదీ హయాంలో రాజ్యాంగంపై దాడులు, పన్ను ఉగ్రవాదం, వ్యాపార, వాణిజ్య సంస్థలకు బెదిరింపులు, మీడియాపై నియంత్రణ, దర్యాప్తు సంస్థల దుర్వినియోగం యథేచ్ఛగా కొనసాగుతోందని... ఈ విధంగా దేశంలో 'అప్రకటిత అత్యవసర పరిస్థితి' కొనసాగుతోందన్నారు. 1975లో ఇందిరా గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అత్యవసర పరిస్థితిని విధించి నేటికి 50 ఏళ్లు పూర్తయ్యాయి.

మోదీ పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు బీజేపీ డ్రామా: ఖర్గే

బీజేపీ పాలనా వైఫల్యాన్ని దాచిపెట్టడానికి సంవిధాన్ హత్య దివాస్ డ్రామా ఆడుతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... ఎమర్జెన్సీపై మోదీ చేసిన విమర్శలపై స్పందిస్తూ... దేశ స్వాతంత్ర్యంలో, రాజ్యాంగాన్ని రూపొందించడంలో ఎటువంటి పాత్ర పోషించని వారు అత్యవసర పరిస్థితిని విధించిన 50 సంవత్సరాల తర్వాత దానిని ఎత్తి చూపుతున్నారన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని తిరస్కరించిన వారు, ఇప్పుడు దాన్ని కాపాడటం గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. మోదీ పాలన కారణంగా రాజ్యాంగం ప్రమాదంలో ఉందని ఖర్గే వ్యాఖ్యానించారు. మోదీ ప్రభుత్వంలో భావ ప్రకటనా స్వేచ్ఛ, ఉద్యమ స్వేచ్ఛ లేదన్నారు.

పాలనలో విఫలమయ్యారని, వారి వైఫల్యం వల్ల ప్రజలు ద్రవ్యోల్బణం గురించి ఆందోళన చెందుతున్నారని తెలిపారు. నిరుద్యోగం, అవినీతి, ఆర్థిక వైఫల్యానికి ప్రభుత్వం వద్ద సమాధానం లేదని...వారి అబద్ధాలు వైఫల్యాన్ని దాచడానికి నాటకాన్ని ప్రదర్శిస్తున్నారని విమర్శించారు.

శశిథరూర్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు

మరోవైపు, తిరువనంతపురం ఎంపీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత శశిథరూర్‌పై ఖర్గే పరోక్షంగా విమర్శలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీపై ఆయన ప్రశంసలు కురిపించడంపై ఆ పార్టీలో తీవ్ర చర్చ జరుగుతోంది.

దీంతో కాంగ్రెస్ పార్టీకి ముందు దేశం ముఖ్యమని, ఆ తర్వాతే మిగిలినవన్నీ అని ఖర్గే స్పష్టం చేశారు. కానీ కొంత మందికి మాత్రం ముందు ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్యమని, ఆ తర్వాతే దేశమని వ్యంగ్యంగా అన్నారు. అయితే తనకు ఇంగ్లీష్ భాషపై అంతగా పట్టులేదన్నారు. ఈ నేపథ్యంలో ఇంగ్లీష్ భాషపై బాగా పట్టున్న శశిథరూర్‌ను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) లో సభ్యుడిగా తీసుకున్నట్లు వివరించారు. ప్రతిపక్ష పార్టీలన్నీ తాము, తమ సైన్యం.. సైనికులు, ఆపరేషన్ సిందూర్‌తో ఉన్నామని స్పష్టం చేశామని గుర్తు చేశారు. అంటే తమకు దేశం ముఖ్యమని చెప్పామన్నారు.

ఎమర్జెన్సీ చీకటి అధ్యాయం: మోదీ

న్యూఢిల్లీ: భారతదేశ చరిత్రలో ఎమర్జెన్సీ ఒక చీకటి అధ్యాయమని, ఆ రోజులను ఏ భారతీయుడూ మరిచిపోలేరని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. నాటి ఇందిరా గాంధీ ప్రభుత్వం దేశంలో ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ రోజును దేశ ప్రజలతో పాటు తాము కూడా 'సంవిధాన్ హత్యా దివస్'గా పరిగణిస్తున్నామని తెలిపారు. ఎమర్జెన్సీ కాలంలో నాటి పాలకులు భారత రాజ్యాంగంలో పొందుపరిచిన విలువలను పూర్తిగా పక్కనపెట్టారని ప్రధాని మోదీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సమయంలో ప్రాథమిక హక్కులను కాలరాశారని, పత్రికా స్వేచ్ఛను దారుణంగా అణచివేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు, చివరికి సామాన్య పౌరులను కూడా అన్యాయంగా జైళ్లలో నిర్బంధించారని ఆరోపించారు. ఆ సమయంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్నే అరెస్టు చేసినట్లుగా అనిపించిందని మోదీ వ్యాఖ్యానించారు. ఎమర్జెన్సీ నాటి భయానక పరిస్థితులను ఏ భారతీయుడూ అంత తేలికగా మరచిపోలేరని ప్రధాని పునరుద్ఘాటించారు. ఆ దుర్మార్గమైన పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ప్రతి ఒక్కరికీ తాను సెల్యూట్ చేస్తున్నానని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడేందుకు సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు మొక్కవోని దీక్షతో పోరాటం చేశారని గుర్తుచేశారు. వారి అలుపెరగని పోరాటం వల్లే చివరికి ఎమర్జెన్సీని ఎత్తివేయాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలను మరింత బలోపేతం చేస్తామని, వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని మోదీ తెలిపారు. పేదలు, అణగారిన వర్గాల ప్రజల కలలను సాకారం చేయడమే తమ ధ్యేయమని అన్నారు. ఈ సందర్భంగా, ఎమర్జెన్సీకి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో 'ది ఎమర్జెన్సీ డైరీస్' పేరుతో తాను ఒక పుస్తకాన్ని తీసుకురాబోతున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా తన ప్రస్థానం, ఎమర్జెన్సీ రోజుల్లో నెలకొన్న క్లిష్ట పరిస్థితులు, తన అనుభవాలను ఆ పుస్తకంలో వివరంగా పొందుపరచనున్నట్లు ఆయన తెలిపారు.

కాంగ్రెస్ పశ్చాత్తాపపడాలి!

50 ఏళ్ల క్రితం ఇదే రోజున కాంగ్రెస్ దేశంలో అత్యవసర పరిస్థితి విధించింది. కనుక ఏటా జూన్ 25న కాంగ్రెస్ నాయకులు 'పశ్చాత్తాపపడాలి' అని కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని పరోక్షంగా విమర్శిస్తూ, రాజ్యాంగ ప్రతిని పట్టుకుని తిరుగుతూ ఉంటే ఏమీ సాధించలేరని ఎద్దేవా చేశారు.

బీహార్‌కు ఎస్ఎంఆర్ న్యూక్లియర్ పవర్ ప్లాంట్

న్యూఢిల్లీ: న్యూక్లియర్ ఎనర్జీ మిషన్‌లో భాగంగా బీహార్‌కు తొలి అటామిక్ ప్లాంట్ మంజూరైంది. అణు ప్లాంట్ మంజూరైన ఆరు రాష్ట్రాల్లో బీహార్ ఒకటి. కేంద్రం ఆమోదం తర్వాత స్మాల్ మాడ్యులార్ రియాక్టర్(ఎస్ఎంఆర్) పవర్ ప్లాంట్‌ను ప్రకటించినట్లు కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తెలిపారు. బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో ఈ ప్లాంట్‌పై ప్రకటన చేసినట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఒకవేళ బీహార్ ప్రభుత్వం న్యూక్లియర్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తే, దానికి కేంద్ర ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని ఖట్టర్ తెలిపారు. ప్లాంట్ సైట్ ఏర్పాటు, ఏ స్థాయిలో ఆ ప్లాంట్ ఉండాలన్న దానిపై తుది రిపోర్టును త్వరలో వెల్లడించనున్నారు. న్యూక్లియర్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు కోసం కేంద్ర బడ్జెట్‌లో న్యూక్లియర్ ఎనర్జీ మిషన్‌కు 20 వేల కోట్లు కేటాయించారు. ఎనర్జీ సెక్యూర్టీని కల్పించాలన్న ఉద్దేశంతో ప్రతి రాష్ట్రంలో అణు విద్యుత్తు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. కొత్త జనరేషన్ న్యూక్లియర్ టెక్నాలజీతో ఎస్ఎంఆర్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నారు. చాలా తక్కువ ఖర్చుతో అనువైన రీతిలో ఆ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తారని నిపుణులు చెప్పారు. చిన్న గ్రిడ్స్‌లో వీటిని అమర్చుతారని, అడ్వాన్స్‌డ్ డిజైన్ వల్ల ఇవి సురక్షితమైనవిగా భావిస్తున్నారు.

వర్థమాన్‌ను పట్టుకున్న పాక్ మేజర్ మృతి

న్యూఢిల్లీ: భారత వైమానిక దళం వింగ్ కమాండర్ అభినందన్ వర్థమాన్‌ను పట్టుకున్న పాకిస్థానీ మేజర్ మోయిజ్ అబ్బాస్ షా మరణించారు. ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రాంతంలో తెహ్రీక్-ఇ-తాలిబాన్ పాకిస్థాన్ (టీటీపీ) ఉగ్రవాదులతో జరిగిన ఘర్షణలో ప్రాణాలు కోల్పోయినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. అబ్బాస్ షా ప్రస్తుతం ఎలైట్ స్పెషల్ సర్వీస్ గ్రూప్ (ఎస్ఎస్‌జి) లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో భాగంగానే ఆయన ఉగ్రవాద నిరోధక ఆపరేషన్ చేపడుతున్న క్రమంలో ఉగ్రవాదులు ఎదురుకాల్పులు జరిపారు. దీంతో ఆయన ప్రాణాలు కోల్పోయినట్లు పాక్ సైన్యం ప్రకటించింది. ఈ దాడుల్లో 11 మంది ఉగ్రవాదులు సహా లాన్స్ నాయక్ జిబ్రానుల్లా అనే మరో సైనికుడు కూడా మృతి చెందినట్లు తెలుస్తోంది. 2019లో పాకిస్థాన్ ఉగ్రదాడి చేసిన నేపథ్యంలో భారత్ ప్రతీకార చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే పాకిస్థాన్‌లోని బాలాకోట్ ప్రాంతంలోని ఉగ్ర స్థావరాలపై వైమానిక దాడులు చేసింది. దీనికి ప్రతీకారంగా ఈ ఘటన జరిగిన మరుసటిరోజు ఫిబ్రవరి 27నే పాక్ వైమానిక దళం ఎఫ్-16 విమానంతో భారత్‌పై దాడికి యత్నించింది. ఈ సమయంలో వింగ్ కమాండర్‌గా ఉన్న అభినందన్ మిగ్-21 విమానంతో వెంటాడి దాన్ని నేలకూల్చారు. అదే సమయంలో ఆయన విమానం కూడా కూలిపోవడంతో పారాచ్యూట్ సాయంతో కిందకు దూకగా అది పాకిస్థాన్ భూభాగంలోకి వెళ్లింది. వెంటనే పాక్ జవాన్లు ఆయనను అదుపులోకి తీసుకొని చిత్రహింసలకు గురి చేశారు. దాదాపు 60 గంటల పాటు దాయాది పాకిస్థాన్ అదుపులోనే ఉండిపోయారు. ఆ తర్వాత అభినందన్‌ను తిరిగి అప్పగించాలని భారత్ నుంచే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో పాక్‌పై ఒత్తిడి తీవ్రమైంది. దీంతో పాక్ సైన్యం అభినందన్‌ను వాఘా సరిహద్దు వద్ద భారత్‌కు అప్పగించింది. చికిత్స కోసం కొన్ని రోజులు విశ్రాంతి తీసుకున్న అభినందన్ తిరిగి విధుల్లో చేరి గ్రూప్ కెప్టెన్‌గా దేశసేవలో నిమగ్నమయ్యారు. ఆయన సేవలకు గుర్తుగా 2021లో కేంద్ర ప్రభుత్వం 'వీర్ చక్ర' పురస్కారంతో సత్కరించింది.

డ్రగ్స్ కేసులో మాజీ మంత్రి అరెస్ట్?

చండీగఢ్: పంజాబ్‌లో 2021 నాటి డ్రగ్స్ కేసులో శిరోమణి అకాలీదళ్ సీనియర్ నాయకుడు, ఆ రాష్ట్ర మాజీ మంత్రి విక్రమ్ సింగ్ మజీథియా అరెస్టయినట్లు తెలుస్తోంది. విజిలెన్స్ అధికారులు అమృత్‌సర్‌లోని మజీథియా నివాసంలో బుధవారం తెల్లవారుజామున ఆకస్మిక సోదాలు చేశారు. విక్రమ్ మజీథియా శిరోమణి అకాలీదళ్ పార్టీ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌కు సొంత బావ. ఆయన గతంలో పంజాబ్ రాష్ట్రమంత్రిగా కూడా పనిచేశారు. ప్రస్తుతం ఆయన భార్య గనీవే కౌర్ మజీథియా ఎమ్మెల్యేగా ఉన్నారు. 2021 నాటి డ్రగ్స్ కేసులో విక్రమ్ మజీథియా నిందితుడిగా ఉన్నారు. ఈ కేసు దర్యాప్తు చేపట్టిన సిట్... మజీథియా, ఆయన కుటుంబానికి సంబంధించిన కంపెనీల్లో అక్రమ లావాదేవీలు జరిగినట్లు గుర్తించింది. ఈ సందర్భంగా మజీథియా మరికొందరిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది. కేసులో ఎవరినైనా అరెస్ట్ చేశారా... అన్న ప్రశ్నకు అమృత్‌సర్ ఆర్పీఎస్ సంధూ అవునని చెప్పారు. అరెస్టయిన వాళ్లను ఇక్కడ నుంచి తీసుకెళ్లామని తెలిపారు.

ఇజ్రాయిల్ నుంచి ఢిల్లీకి 224 మంది

కొనసాగుతున్న ఆపరేషన్ సింధు

న్యూఢిల్లీ: ఇరాన్-ఇజ్రాయిల్ మధ్య యుద్ధం కారణంగా అక్కడ చిక్కుకున్న భారతీయులను రప్పించేందుకు కేంద్రం చేపట్టిన 'ఆపరేషన్ సింధు' కొనసాగుతోంది. దీని ద్వారా ఆయా దేశాల్లో చిక్కుకుపోయిన భారతీయులను స్వదేశానికి తీసుకొస్తోంది. పొరుగు దేశాలకు చెందిన పౌరులకు కూడా భారత్ సాయం చేస్తోంది. ఇప్పటికే చాలామంది భారతీయులు స్వదేశానికి చేరుకున్నారు. తాజాగా ఇజ్రాయిల్ నుంచి 224 మంది భారతీయులతో కూడిన భారత వాయుసేనకు చెందిన విమానం ఢిల్లీకి చేరుకుంది. ఇజ్రాయిల్ నుంచి ఇప్పటి వరకు 818 మందిని కేంద్రం స్వదేశానికి తరలించింది. మరోవైపు ఇరాన్ నుంచి 11వ విమానం బుధవారం తెల్లవారుజామున ఢిల్లీలో దిగింది. 282 మంది భారతీయులు క్షేమంగా స్వదేశానికి తిరిగొచ్చారు. 'ఇప్పటి వరకు ఇరాన్ నుంచి 2,858 మందిని స్వదేశానికి తీసుకొచ్చాం' అని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎక్స్‌లో పోస్టు పెట్టింది. ఇందులో పొరుగు దేశాలైన నేపాల్, శ్రీలంకకు చెందిన వారు కూడా ఉన్నారు.

దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ సంజయ్ రౌత్

ముంబై: దేశంలో గడిచిన పదకొండేళ్లుగా అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతున్నదని, నాడు ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించడంలో తప్పులేదని శివసేన ఎంపీ సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. అప్పట్లో రాజ్యాంగాన్ని పూర్తిగా గౌరవిస్తూనే ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించారని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఎమర్జెన్సీ అనేది కూడా ఒక రాజ్యాంగబద్ధమైన చర్యేనని, బీజేపీ చెబుతున్నట్టుగా ఎమర్జెన్సీని 'సంవిధాన్ హత్యా దివస్' పరిగణించలేమని రౌత్ చెప్పారు. ఇందిరాగాంధీ తలుచుకుంటే మాయ చేసి, డబ్బులు పంచి ఎన్నికల్లో గెలిచేదని, కానీ ఆమె అలా చేయలేదని అన్నారు. ఇందిరాగాంధీ ప్రజాస్వామ్యానికి కాపలాదారుగా ఉండేవారని పేర్కొన్నారు.

ఆర్జేడీలో నియంతృత్వం, బంధుప్రీతి

అరుణ్‌భారతి

పాట్నా: ఆర్జేడీ (రాష్ట్రీయ జనతాదళ్)కు 13వ సారి జాతీయ అధ్యక్షుడిగా లాలూ ప్రసాద్ యాదవ్ బుధవారం నామినేషన్ దాఖలు చేయగా ఆయనపై లోక్ జనశక్తి పార్టీ ఎంపీ అరుణ్ భారతి తీవ్ర విమర్శలు చేశారు. లాలూ నామినేషన్... ఆర్జేడీలో నియంతృత్వ పోకడ, బంధుప్రీతికి ప్రత్యక్ష సాక్ష్యమని అన్నారు. ఆర్జేడీ నేత తేజశ్వి యాదవ్ అనేక సందర్భాల్లో ఆ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యంపై మాట్లాడుతుంటాడని, ఆర్జేడీలో బంధుప్రీతికి దీని కంటే గొప్ప ఉదాహరణ మరొకటి లేదని అరుణ్ భారతి అన్నారు. బాబా సాహెబ్ చిత్రాన్ని లాలూ పాదాల దగ్గర ఉంచినప్పుడు, అతడి ఆరోగ్యం బాగాలేదని చెప్పారని, కానీ నామినేషన్ సమయంలో మాత్రం, లాలూ ఆరోగ్యం బాగానే ఉందని ఎద్దేవా చేశారు. అంతకుముందు మాజీ డిప్యూటీ సీఎం తేజశ్వి యాదవ్ ... తన తండ్రి లాలూ ప్రసాద్ యాదవ్ 'పేదల దూత' అని అభివర్ణించారు. 13వ సారి ఆయన అధ్యక్షుడుగా ఉండటం కార్యకర్తలు, నాయకులందరూ సంతోషంగా ఉన్నారని చెప్పారు. భవిష్యత్తులో తన తండ్రి నాయకత్వంలో పార్టీ విజయాన్ని చవిచూస్తుందని ఆశిస్తున్నానని యాదవ్ అన్నారు. ఇలా ఉండగా, ఆర్జేడీ తన జాతీయ మండలి, రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలను నిర్వహిస్తోంది. ఈ సంస్థాగత ఎన్నికలకు జులై ఐదో తేదీన పోలింగ్ జరుగుతుంది. దీంతో లాలూ పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఉచితం... సముచితం కాదు: కాంగ్రెస్ నేత దేశ్‌పాండే



బెంగళూరు : ఉచితాలు సమంజసం కాదని, శక్తి గ్యారెంటీతో బస్సుల్లో పురుషులకు సీట్లు ఉండడం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత ఆర్వీ దేశ్‌పాండే వ్యాఖ్యలు సర్వత్రా సంచలనానికి దారితీశాయి. ఇటీవలే ప్రభుత్వంపై సొంతపార్టీ ఎమ్మెల్యేలు బీఆర్ పాటిల్, రాజుకాగె, ఎన్‌వై గోపాలకృష్ణ అసంతృప్తి వ్యక్తం చేసిన తరుణంలోనే దేశ్‌పాండే వ్యాఖ్యలు వివాదానికి కారణమయ్యాయి. సీఎం సిద్ధరామయ్యకు ఆప్తులుగా పేరొందినవారే ఇలాంటి వ్యాఖ్యలు చేయడం విమర్శలకు కారణమవుతోంది. మహిళలు శక్తి గ్యారెంటీ ఉందని అడ్డూ అదుపులేకుండా ప్రయాణిస్తున్నారని బస్సుల్లో మగవాళ్లు కూర్చుని ప్రయాణించే పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు.దేశ్‌పాండే వ్యాఖ్యలు పార్టీలో కలకలం రేపుతున్నాయి.

లంచం నిరూపిస్తే రాజీనామా: మంత్రి జమీర్

పేదలకు కేటాయించే ఇళ్ల లబ్ధిదారులనుంచి లంచం తీసుకునేంతటి దరిద్రం తనకు రాలేదంటూ గృహ నిర్మాణశాఖ మంత్రి జమీర్‌అహ్మద్‌ఖాన్ మండిపడ్డారు. బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ... లబ్ధిదారులనుంచి తాను లంచం తీసుకున్నట్టు నిరూపిస్తే స్వచ్ఛందంగా రాజీనామా చేస్తానన్నారు. తన శాఖలో అవినీతికి తావు లేదన్నారు. ఎమ్మెల్యే బీఆర్ పాటిల్ ఆరోపణలపై విచారణ జరుపుతామని, ఎమ్మెల్యేతోనూ మాట్లాడతానన్నారు. బీఆర్ పాటిల్ ఎక్కడా మంత్రి లంచం తీసుకున్నారని ఆరోపించలేదన్నారు. ఏ పంచాయతీలోనైనా అటువంటి సంఘటన జరిగి ఉంటే కఠిన చర్యలు తీసుకుంటానన్నారు. ఎమ్మెల్యే బేలూరు గోపాలకృష్ణ తన రాజీనామా కోరారని, అయితే లంచం తీసుకున్నట్లు నిరూపిస్తే తానే పదవి వదులుకుంటానన్నారు. అనవసర ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు.

ముంబై మెట్రో కోచ్‌లో పొగలు... ప్రయాణికులు ఉక్కిరిబిక్కిరి

ముంబై: మెట్రో కోచ్‌లోకి దట్టమైన పొగ రావడంతో ప్రయాణికులు ఊపిరాడక ఉక్కిరిబిక్కిరయ్యారు. దగ్గుతో విలవిల్లాడారు. ముఖాలకు అందుబాటులో ఉన్న వస్త్రాలు, మాస్క్‌లు అడ్డుపెట్టుకున్నారు. ఏం జరుగుతోందో తెలియని అయోమయం, గందరగోళం చెలరేగింది. ముంబై బోరివలి ఏరియాలోని దేవిపద మెట్రో స్టేషన్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... వెస్ట్రన్ ఎక్స్‌ప్రెస్ హైవేపై ఓ ప్రైవేటు బస్సు మంటల్లో చిక్కుకోవడం... అదే సమయంలో దేవిపద మెట్రో స్టేషన్‌లో రైలు ఆగడంతో పొగలు ఒక్కసారిగా కోచ్‌లోకి ప్రవేశించడంతో ఈ పరిస్థితి తలెత్తింది. దీంతో మెట్రో సిబ్బంది వెంటనే అప్రమత్తమై మంటలను చల్లార్చడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే, మెట్రో స్టేషన్ కిందనున్న రోడ్డుపై బస్సు పార్కింగ్ చేసి ఉండటంతో దట్టమైన పొగలు వెలువడ్డాయి. అదే సమయంలో మెట్రో రైలు ఆగడం, తలుపులు తెరుచుకోవడంతో ఒక్కసారిగా పొగలు కోచ్‌లోకి ప్రవేశించాయి. యోగేశ్ నామ్‌జోషి అనే ప్రయాణికుడు ఇందుకు సంబంధించిన 50 సెకన్ల వీడియోను సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశాడు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌కు వీడియోను ట్యాగ్ చేశాడు. కాగా, ఈ ఘటనపై మహా ముంబై మెట్రో ఆపరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ విచారం వ్యక్తం చేసింది. రైలులో అగ్నిప్రమాదం జరగలేదని తెలిపింది. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నట్టు పేర్కొంది.

డ్రగ్స్ కేసులో మరో తమిళ నటుడు అరెస్ట్

చెన్నై: తమిళ సినీ పరిశ్రమలో డ్రగ్స్ కేసు ఒక్కసారిగా కలకలం రేగింది. నటుడు శ్రీకాంత్ అలియాస్ శ్రీరామ్ ను ఇప్పటికే పోలీసులు అరెస్ట్ చేశారు. ఇక ఈ కేసులో ఇప్పుడు మరో నటుడు కృష్ణ కూడా అరెస్టు అయ్యాడు. కృష్ణ ఇప్పుడు పోలీసులు అదుపులో ఉన్నట్లుగా తెలుస్తోంది. నుంగంబాకం పోలీసులు కృష్ణను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్లు తెలుస్తోంది. కృష్ణతో అత్యంత సన్నిహితంగా ఉంటున్న తమిళ యువ దర్శకులు, మ్యూజిక్ డైరెక్టర్లు డ్రగ్స్ ఏమైనా వాడుతున్నారా అనే విషయం మీద ఆరా తీస్తున్నట్లు సమాచారం. అయితే మరో షాకింగ్ విషయం ఏమిటి అంటే టాలీవుడ్ నటులతోనూ కృష్ణకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని పోలీసులు గుర్తించారు. పలువురు నటుల పేర్లను తెలుసుకున్నట్టు తెలుస్తోంది. అయితే చెన్నైలో అరెస్టయిన కృష్ణకు తెలుగులో ఏ నటీనటులతో సంబంధాలు ఉన్నాయనే విషయం మీద ప్రస్తుతానికి చర్చ జరుగుతోంది. నటుడు శ్రీరామ్ ని అరెస్ట్ చేసిన తర్వాత తాను డ్రగ్స్ ఎవరికీ అమ్మలేదని, తాను డ్రగ్స్ వినియోగించానని ఈ విషయంలో పోలీసులకు పూర్తిగా విచారణకు సహకరిస్తానని ఒప్పుకున్నట్లుగా సమాచారం.

సీఆర్‌పీఎఫ్ శిబిరంపై గ్రెనేడ్ దాడి

ముగ్గురికి గాయాలు

గుహవతి: అసోంలో సీఆర్‌పీఎఫ్ శిబిరంపై జరిగిన గ్రెనేడ్ దాడిలో ముగ్గురు పోలీసులు గాయపడ్డారు. గోలాఘాట్ జిల్లాలోని బోకాఖాట్ సమీపంలో సీఆర్‌పీఎఫ్ శిబిరంపై మంగళవారం రాత్రి మోటార్ సైకిల్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు గ్రెనేడ్‌తో దాడి చేశారు. గాయపడిన వారిని బోకాఖాట్‌లోని ఆస్పత్రిలో చేర్చినట్లు అధికారులు బుధవారం తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారని చెప్పారు. మోటార్ సైకిల్‌పై వచ్చిన నిందితుల కోసం గాలిస్తున్నామని, ఉగ్రవాద చర్య లేదా దుండగుల చర్య అనే విషయంపై విచారణ చేపడుతున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యవసాయమంత్రి అతుల్‌బోరా ఈ ఘటనను ఖండించారు.

'పిరికిపంద హింసాత్మక చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాను. నాగరిక సమాజంలో ఇటువంటి ఘటనలకు చోటు లేదు' అని పేర్కొన్నారు. ఆయన బోకాఖాట్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

పైలట్ శిక్షణ ఇంటర్వ్యూలో తేజ్‌ప్రతాప్ ఉత్తీర్ణత

పాట్నా: ఎల్లప్పుడూ ఆధ్యాత్మిక భావనలో మునిగి ఉండే బీహార్ మాజీ మంత్రి తేజ్ ప్రతాప్ యాదవ్ లో మరో కోణం వెలుగులోకి వచ్చింది. ఆర్జేడీ నుంచి బహిష్కరించిన ఆయన కమర్షియల్ పైలట్ ట్రైనింగ్ ఇంటర్వ్యూలో ఉత్తీర్ణులయ్యారు. జూన్ 20న బీహార్ డైరెక్టరేట్ ఆఫ్ ఏవియేషన్, 18 మంది అభ్యర్థులతో జాబితాను విడుదల చేసింది. బీహార్ ఫ్లయింగ్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా కమర్షియల్ పైలట్ లైసెన్స్ కోర్సు ట్రైనింగ్‌కు ఎంపికైన 18 మందిలో తేజ్ ప్రతాప్ యాదవ్ ఐదో ర్యాంకు సాధించారు. 2024 డిసెంబర్ 16 నుంచి 18 వరకు ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ప్రక్రియ జరిగింది. తేజ్ ప్రతాప్ యాదవ్ ఈ కోర్సును విజయవంతంగా పూర్తి చేస్తే విమానాలు నడిపేందుకు అవసరమైన కమర్షియల్ పైలట్ లైసెన్స్ పొందనున్నారు. కాగా, ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ పెద్ద కుమారుడైన తేజ్ ప్రతాప్ యాదవ్ మే 25న సంచలన విషయాన్ని బయటపెట్టారు. తనకు తెలిసిన మహిళతో చాలా కాలంగా రిలేషన్‌లో ఉన్నట్లు సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఆమె ఫొటోను కూడా పోస్ట్ చేశారు. ఆ తర్వాత డిలీట్ చేశారు. లాలూ ప్రసాద్ యాదవ్ దీనిపై ఆగ్రహించారు.

ఢిల్లీలో యువతి దారుణ హత్య

న్యూఢిల్లీ: ఓ వ్యక్తి బురఖాతో ఇంట్లోకి చొరబడి...యువతిని భవనంపై తోసివేయడంతో తీవ్రంగా గాయపడిన ఆ యువతి మరణించింది. ఈ ఘటన దేశ రాజధాని ఢిల్లీలో చోటుచేసుకుంది. ఫిర్యాదు అందుకున్న పోలీసులు ఆ వ్యక్తిని అరెస్ట్ చేశారు. జూన్ 23న ఉదయం 8.30 గంటలకు అశోక్ నగర్‌లో నివసిస్తున్న 19 ఏళ్ల నేహా బిల్డింగ్ ఐదో అంతస్తు నుంచి కిందపడింది. తీవ్రంగా గాయపడిన ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించింది. ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్‌కు చెందిన 26 ఏళ్ల తౌఫీక్‌ను నిందితుడిగా గుర్తించారు. బురఖా ధరించిన అతడు ఆ రోజు ఉదయం నేహా ఇంట్లోకి ప్రవేశించినట్లు సీసీటీవీ ఫుటేజ్ ద్వారా నిర్ధారించారు. భవనంపై నుంచి ఆమెను తోసినట్లు పోలీసులు తెలుసుకున్నారు. ఒకచోట దాక్కున్న తౌఫీక్‌ను అరెస్ట్ చేశారు. మరోవైపు కొన్ని నెలలుగా తౌఫీక్, నేహా రిలేషన్‌లో ఉన్నారని పోలీస్ అధికారి తెలిపారు. మరో మహిళతో అతడికి వివాహం గురించి భవనం ఐదో అంతస్తుపై వారిద్దరి మధ్య గొడవ జరిగినట్లు చెప్పారు. తౌఫీక్ ఆగ్రహంతో నేహాను కిందకు తోయడంతో ఆమె మరణించిందని తెలిపారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. కాగా, పోలీసుల వాదనను నేహా తండ్రి ఖండించారు. తన కుమార్తెకు తౌఫీక్‌తో ప్రేమ సంబంధం లేదన్నారు. తమ కుటుంబానికి మూడేళ్లుగా అతడు తెలుసని చెప్పారు. తరచుగా తమ ఇంటికి వచ్చే తౌఫీక్‌కు నేహా రాఖీ కూడా కట్టిందని తెలిపారు.

పాక్ సరిహద్దులో ఉగ్రవాది కాల్చివేత

శ్రీనగర్: పాకిస్థాన్ నుంచి భారత్‌లోకి చొరబడేందుకు ప్రయత్నిస్తున్న ఉగ్రవాదిని భారత సైన్యం హతమార్చింది. మంగళవారం రాజౌరీ కేరీ సెక్టార్‌లోని బరాత్ గాలా ప్రాంతంలో ముగ్గురు నుంచి నలుగురు ఉగ్రవాదులు చొరబాటుకు ప్రయత్నించారు. వెంటనే అప్రమత్తమైన సైనికులు కాల్పులు ప్రారంభించారు. ఆ తర్వాత సంఘటనా స్థలాన్ని పరిశీలించగా.. నియంత్రణరేఖ సమీపంలో ఓ ఉగ్రవాది మృతదేహం పడి ఉంది. మిగతా ఉగ్రవాదులు అక్కడి నుంచి పారిపోయినట్లుగా భద్రతా బలగాలు తెలిపాయి. సమాచారం ప్రకారం.. ఉదయం 8-9గంటల మధ్య భారత సైన్యం బరాత్ గాలా ప్రాంతంలోని రేఖ వెంబడి అనుమానాస్పద కదలికలను గమనించారు.

చొరబాటు ప్రయత్నాలను గుర్తించిన వెంటనే.. అప్రమత్తమైన సైనికులు కాల్పులు ప్రారంభించారు. ఉగ్రవాదుల చొరబాటు ప్రయత్నం విఫలం చేసిన అనంతరం సైన్యం ఆ ప్రాంతాన్ని జల్లెడపట్టింది. ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తి కనిపిస్తే వెంటనే సైన్యానికి తెలియజేయాలని స్థానిక ప్రజలకు సైన్యం విజ్ఞప్తి చేసింది. ఇదిలా ఉండగా.. జూన్ 15 అర్ధరాత్రి కూడా చొరబాటు ప్రయత్నం జరిగింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత ఈ ప్రాంతంలో ఇది రెండవ చొరబాటు ప్రయత్నం. జూన్ 15 అర్ధరాత్రి పాకిస్తాన్ నుండి ఉగ్రవాదుల అదే ప్రాంతంలో చొరబడటానికి ప్రయత్నించిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆ సమయంలో అప్రమత్తమైన సైనికులు కూడా ఆ ప్రయత్నాన్ని విఫలం చేశారు.

విశాలాంధ్ర హైదరాబాద్

పర్యాటక రంగం అభివృద్ధికి తెలంగాణలో పుష్కలమైన అవకాశాలు : మంత్రి జూపల్లి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని, టూరిజం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తూ ఈ రంగం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం ముందుకు వెళుతుందోందని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమశిల వెల్‌నెస్, స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల ప్రాజెక్టు అభివృద్ధిలో భాగంగా మంత్రి జూపల్లి సోమశిల, అమరగిరి, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్, నార్లాపూర్ రిజర్వాయర్, కొల్లాపూర్‌లోని మాధవస్వామి ఆలయం, జెటప్రోలు మదనగోపాల స్వామి దేవాలయాన్ని సందర్శించారు. పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సోమశిల వెల్‌నెస్, స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల ప్రాజెక్టుకు 'స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్, యూనియన్ టెరిటరిస్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్(సాస్కి)' పథకం కింద రూ.68.10 కోట్లు మంజూరయ్యాయని, ఆ నిధులతో పర్యావరణం, జల వనరులు, ఆలయాలు, వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ గేమ్స్‌కు పుష్కలమైన వనరులు ఉన్న సోమశిల, అమరగిరి ద్వీపం, ఈగలపెంటను అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని పర్యాటకశాఖ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం కొల్లాపూర్ క్యాంప్ కార్యాలయంలో సోమశిల వెల్‌నెస్, స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల ప్రాజెక్టు సంబంధించిన ప్రతిపాదనలు, కార్యాచరణపై పర్యాటక శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పర్యాటక రంగాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో ముందుకు తీసుకెళ్తామని, ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని అన్నారు. ఆ నిధులతో పర్యావరణం, జల వనరులు, ఆలయాలు, వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ గేమ్స్‌కు పుష్కలమైన వనరులు ఉన్న సోమశిల, అమరగిరి ద్వీపం, మల్లేశ్వరం, ఈగలపెంటను అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టామని వివరించారు. క్లస్టర్ 1 ఈగలపెంట అరైవల్ జోన్, ఈగలపెంట విహార యాత్ర, ఈగలపెంట రివర్ క్రూయిజ్, చెంచు ట్రైబల్ ఎక్స్పీరియన్స్, క్లస్టర్ 2 సోమశిల వెల్నెస్ అండ్ స్పిరిచ్యువల్ రిట్రీట్ ఉంటాయని అన్నారు. మంత్రి జూపల్లి వెంట పర్యాటక, సాంస్కృతిక శాఖ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వల్లూరు, కలెక్టర్ బదావత్ సంతోష్, ఇతర అధికారులు ఉన్నారు.

టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నియామక పత్రాన్ని అందుకున్న జగదీశ్వర్ గౌడ్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నియామక పత్రాన్ని టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ చేతులమీదుగా శేరిలింగంపల్లి నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్ స్వీకరించారు. టీపీసీసీ కార్యవర్గ సమావేశం గాంధీభవన్‌లో నిర్వహింరు. టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన గాంధీ భవన్‌లో టీపీసీసీ కార్యవర్గ సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఈ సందర్భంగా టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులుకి నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిలు పలువురు నాయకులు హాజరయ్యారు.

మున్సిపాలిటీల అభివృద్ధిలో కమిషనర్లదే ముఖ్య పాత్ర

విశాలాంధ్ర - పటాన్ చెరువు : ఇటీవల జరిగిన బదిలీలలో తెల్లాపూర్, గడ్డ పోతారం మున్సిపల్ కమిషనర్లుగా బదిలీపై వచ్చిన అజయ్‌కుమార్‌రెడ్డి, వెంకట రామయ్యలు బుధవారం పటాన్ చెరువు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డిని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మున్సిపాలిటీల అభివృద్ధిలో కమిషనర్లది అత్యంత కీలక పాత్ర అని ప్రతి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, బాల్‌రెడ్డి, సోమిరెడ్డి, మేఘా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా పుస్తకాలు అమ్ముతున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - మొయినాబాద్ : అనుమతులు లేకుండా పుస్తకాలు అమ్ముతున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, అరుణ్ కుమార్‌లు డిమాండ్ చేశారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని మాస్టర్ మైండ్ స్కూల్లో పుస్తకాలు అమ్ముతున్న విషయం తెలుసుకున్న నాయకులు బుధవారం తనిఖీ చేసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక ధరలకు పుస్తకాలు అమ్ముతున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్కూల్ లోగో, బ్రాండ్ పేరు చెప్పి వ్యవసాయం చేసుకునే విద్యార్థుల తల్లిదండ్రులు అధికంగా ఫీజులు వసూలు చేస్తే విద్యార్థి నాయకులతో కలిసి మరో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల అధ్యక్ష, కార్యదర్శులు జశ్వంత్, చరణ్ గౌడ్, ప్రదీప్, ప్రశాంత్, యశ్వంత్ సాయి, తేజ తదితరులు పాల్గొన్నారు.

చట్టపరంగా బంకచర్లను అడ్డుకుంటాం

- 30న ప్రజాభవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- సత్వరమే నాగార్జునసాగర్‌లో పూడికతీతకు ఆదేశాలు
- నీటిపారుదల శాఖాలో పదోన్నతులు, బదిలీలకు గ్రీన్ సిగ్నల్
- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎస్.ఎల్.బి.సి పనుల పునరుద్ధరణ
- రాష్ట్ర నీటిపారుదల శాఖకు ఇద్దరు సైనికాధికారులు
- టన్నెల్ నిర్మాణంలో నిష్ణాతులైన వారి నియామకానికి కసరత్తు
- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి-బంకచర్లను చట్టపరంగా అడ్డుకుంటామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణా రైతాంగం ప్రయోజనాలకు భంగం వాటిల్ల కుండా చూడడమే తమ ముందున్న కర్తవ్యమని ఆయన తేల్చిచెప్పారు. ఈ ప్రాజెక్టును నిర్మిస్తే తెలంగాణా ప్రాంత ప్రయోజనాలు ఏ విధంగా దెబ్బ తింటాయో, నష్టం ఎలా వాటిల్లుతుందోనన్న అంశంలో బలమైన వాదనలు వినిపించి ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలువరిస్తామన్నారు. బుధవారం ఎర్రమంజిల్ కాలనీలోని నీటిపారుదల శాఖా కేంద్ర కార్యాలయంలో నీటిపారుదల శాఖా ఉన్నతాధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు. నీటిపారుదల శాఖా ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్,ఇ.ఎన్.సి మహమ్మద్ అంజత్ హుస్సేన్, ఇ.ఎన్.సి ఓ అండ్ యం, డిప్యూటీ ఇ.ఎన్.సి శ్రీనివాస్‌లతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్ట్‌తో తెలంగాణాకు సంభవించనున్న ముప్పును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలసి ఈ నెల 19న కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్ పాటిల్‌కు సవివరంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను ఇచ్చామన్నారు. బంకచర్ల ప్రాజెక్టుకు సంబంధించిన ప్రీ-ఫిజిబిలిటీని నివేదికను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించవద్దని తేల్చి చెప్పామన్నారు. ఈ ప్రాజెక్టును నిర్మిస్తే తెలంగాణా రాష్ట్ర నీటి కేటాయింపులపై ప్రభావం చూపుతుందని దానిని దృష్టిలో పెట్టుకుని నివేదికను తిరస్కరించాలని కోరామన్నారు. అందుకు స్పందించిన కేంద్ర మంత్రి పాటిల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్పించిన నివేదికను ఆమోదించలేదని, త్వరలోనే అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని ఆయన వివరించారు. పదేళ్ల బి.ఆర్.యస్ పాలనలో పుట్టుకొచ్చిన గోదావరి-బంకచర్ల ప్రాజెక్టు నిర్మిస్తే తెలంగాణా ప్రయోజనాలకు జరిగే నష్టంపై ఈనెల 30న ప్రజాభవన్‌లో మధ్యాహ్నం 3 గంటలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. టన్నెల్ నిర్మాణాలలో అపారమైన అనుభవం కలిగిన సుప్రసిద్ధ సైనికాదికారులిద్దరిని నీటిపారుదల శాఖలోకి తీసుకునేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఇటీవల రోహ్తాంగ్, జోజిలా టన్నెల్ నిర్మాణంలో పనిచేసిన ఇద్దరు అధికారులను వినియోగించు కునేందుకు నీటిపారుదల శాఖా కసరత్తు చేస్తుందన్నారు. భారత సైన్యంలో ఇంజినీర్ ఇన్-చీఫ్ గా పనిచేసిన జనరల్ హార్పల్ సింగ్ ను తెలంగాణా రాష్ట్ర నీటిపారుదల శాఖకు సలహా దారుడిగా ఉండమని అహ్వానించామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పేరు గడించిన టన్నెల్ టెక్నాలజీ నిపుణులు కర్నల్ పరిక్షిత్ మెహ్రా ఈ జులైలో రాష్ట్ర నీటిపారుదల శాఖలో చేరనున్నారని ఆయన పేర్కొన్నారు. మెడిగడ్డ, అన్నారం, సిందిళ్ళ బ్యారేజి లపై ఎన్.డి.ఎస్.ఏ ఇచ్చిన నివేదికలపై సమీక్షించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పునరుద్ధరణ పనులకై ఎన్.డి.ఎస్.ఏ డిజైన్ కన్సల్టెంట్‌గా వ్యహరిస్తుం దన్నారు. ఎన్.డి.ఎస్ ఏ ఇచ్చిన ఆదేశాలను సత్వరమే అమలులోకి తీసుకు రావాలని ఆయన అధికారులను ఆదేశించారు. పునరుద్ధరణ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు వీలుగా ప్రతివారం సమీక్షిస్తూ ఎప్పటిక ప్పుడు తనకు నివేదికను సమర్పించాలన్నారు. కేంద్ర జలసంఘం సూచనలకు అనుగుణంగా పనులను వేగవంతం చేయాలన్నారు. డిండి ప్రాజెక్ట్‌పై ఆయన మాట్లాడుతూ భూసేకరణ విషయమై సంబంధిత జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించాలన్నారు. శ్రీశైలం ఎడమ కాలువ (ఎస్.ఎల్.బి.సి) పనుల పురోగతిపై సమీక్షించిన ఆయన పునరుద్ధరణ పనుల కోసమై అంతర్జాతీయ స్థాయి ఏజెన్సీలతో చర్చించి ప్రతిపాదనలు స్వీకరిస్తున్నామన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పునరుద్ధరణ పనులు చేపట్టే విధంగా అధికారులకు ఆదేశాలు ఇచ్చామని పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు ఖర్చుకు వెనకాడకుండా ముందుకు పోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. అదే సమయంలో నీటిపారుదల శాఖలో పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేయాలని, బదిలీల తంతును వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రధాన ప్రాజెక్టులలో పూడిక తీత పనులపై ఆయన స్పందిస్తూ అనేక జలాశయాలు పూడికతో పూడి పోయి ఉన్నందున 20 నుండి 25 శాతం మేర నీటిసామర్థ్యం తగ్గిన నేపద్యంలో కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన జాతీయ మార్గదర్శకాలకు అనుగుణంగా మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నాగార్జునసాగర్, నిజాంసాగర్ తదితర ప్రాజెక్టుల పూడిక తీత పనులపై ఆయన అడిగి తెలుసుకున్నారు.

కేంద్ర సంస్థలకు కేటాయించిన భూ సమస్యలు పరిష్కరించండి

కేంద్ర మంత్రికి దుద్దిళ్ల వినతి

విశాలాంధ్ర - హైదరాబాద్: తెలంగాణలో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలకు గతంలో కేటాయించిన భూములపై నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు జోక్యం చేసుకోవాలంటూ రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కేంద్రాన్ని కోరారు. న్యూఢిల్లీలో బుధవారం కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామిని కలసి ఈ విషయమై విపులంగా చర్చించారు. 1960వ దశకంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన కోసం హైదరాబాద్ చుట్టుపక్కల విలువైన భూములను భారీ ఎత్తున రాయితీ ధరలకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు కేటాయించిందని, కాలక్రమంలో అనేక సంస్థలు మూతపడ్డాయన్నారు. వాటి పరిధిలోని భూములు నిరుపయోగంగా ఉన్నాయని, కొన్ని సంస్థలు భూములను వాణిజ్య పరంగా వినియోగమార్పునకు యత్నాలు చేస్తున్నాయన్నారు. హిందుస్థాన్ కేబుల్స్‌కు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 324.87 ఎకరాలు, హిందుస్థాన్ ఫ్లోరోకార్బన్స్‌కు సంగారెడ్డిలో 126.33 ఎకరాలు, ఐడీపీఎల్ ... మేడ్చల్-మల్కాజిగిరిలో 551.03 ఎకరాలు, హెచ్ఎంటీ... మేడ్చల్-మల్కాజిగిరిలో 888.05 ఎకరాలు, సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆదిలాబాద్‌లో 2,272.85 ఎకరాలు, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ... ఎద్దుమైలారం, సంగారెడ్డిలో 3,020 ఎకరాలు... సీపీఎస్‌యూ కింద భూకేటాయింపు చేసినట్లు వివరించారు. ఈ భూములు ఉపయోగంలో లేవని, ప్రత్యామ్నాయ ప్రణాళికలు లేకపోవడం రాష్ట్ర అభివృద్ధికి ఆటంకంగా మారుతుందని మంత్రి స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టాలని, భూముల ఉద్దేశ్యపూర్వక వినియోగానికి మార్గదర్శకాలు రూపొందించాలని, రాష్ట్రానికి సముచిత ప్రయోజనం లభించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి కుమారస్వామి విజ్ఞప్తి చేయగా అందుకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే ఈ విషయమై సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించండి: మంత్రి

రేర్ ఎర్త్ ఎగుమతులపై చైనా విధించిన ఆంక్షలు తెలంగాణలోని తయారీ రంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని, వెంటనే ఈ విషయంలో జోక్యం చేసుకుని ప్రత్యామ్నాయాలపై కేంద్రం దృష్టి సారించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. ఆ మేరకు బుధవారం ఢిల్లీలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో ప్రత్యేకంగా సమావేశమై వినతి పత్రం సమర్పించారు. "ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తికి అవసరమైన రేర్ ఎర్త్ మాగ్నెట్లు, కీలక ముడి పదార్థాలు, రసాయనాలు ఎక్కువగా చైనా నుంచే దిగుమతి అవుతున్నాయి. ఎలక్ట్రానిక్స్, ఈవీ తయారీ పరిశ్రమలకు ఇబ్బంది కలగకుండా వాస్తవ పరిస్థితిని సమీక్షించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.

పారిశ్రామిక రంగం బలోపేతానికి సహకరించండి...

రాష్ట్రంలో పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్రం పూర్తి స్థాయి సహకారం అందించాలని కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌ను మంత్రి శ్రీధర్ బాబు కోరారు. ముఖ్యంగా హైదరాబాద్-నాగ్‌పూర్, హైదరాబాద్-వరంగల్, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-విజయవాడ ఇండస్ట్రియల్ కారిడార్ల అభివృద్ధి వివరాలు వివరించారు. జహీరాబాద్‌లో అభివృద్ధి చేస్తున్న ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద అవసరమైన మౌలిక సదుపాయాల కోసం రూ.400 కోట్ల నిధులు పీఎం గతిశక్తి పథకం కింద మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఫ్యూచర్ సిటీ అభివృద్ధి...

గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా హైదరాబాద్-వరంగల్ ఇండస్ట్రియల్ కారిడార్ నిలిచిపోయిందని కేంద్ర మంత్రికి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. అయితే.. ఇందులో భాగంగా ఉన్న ఫార్మా సిటీని ప్రభుత్వం ఇప్పుడు 'ఫ్యూచర్ సిటీ'గా అభివృద్ధి చేస్తోందని తెలిపారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి సహా పలు నోడ్స్‌కు కేంద్రం నిధులు విడుదల చేసేలా చొరవ చూపాలని కోరారు.

శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్ తన పుట్టినరోజు సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకోవడం జరిగింది. - (విశాలాంధ్ర - శేరిలింగంపల్లి)

కలెక్టర్ హరిచందనని కలిసిన కృష్ణ యాదవ్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : కలెక్టర్ హరిచందనని కలెక్టర్ కార్యాలయంలో టీజీఓస్ టీజీఓస్ హైదరాబాద్ ప్రెసిడెంట్ కృష్ణ యాదవ్ స్వయంగా కలిసి సీసీఎల్ఏ వచ్చిన జీవో 601 ప్రకారం అసోసియేషన్స్ బిల్డింగ్ కోసం స్థలం ఇవ్వాలని కోరారు. ఈ విషయంలో కలెక్టర్ సానుకూలంగా స్పందించి తప్పకుండా ఐడెంటిఫై చేసి కావలసిన భూమిని యూనియన్ బిల్డింగ్ కొరకు కేటాయిస్తామని హామీ యిచ్చారు. ఇందుకు గాను టీజీఓస్ హైదరాబాద్ పక్షాన, మేడంకి, టీజీఓస్ టీజీఓస్ హైదరాబాద్ ప్రెసిడెంట్ కృష్ణ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు, ఈ కార్యక్రమంలో ఎంఎ ఖాదీర్ సెక్రటరీ, జిల్లా కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

జంట నగరాల బోనాల నిర్వహణకు నిధులు మజూరు

మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణలో అత్యంత అంగ రంగ వైభవంగా హైదరాబాద్ జిల్లా జిహెచ్ఎంసి పరిధిలో గల దేవాలయాల్లో నిర్వహించే బోనాల ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 20 కోట్ల రూపాయలను 2783 దేవాలయాలకు వివిధ కార్యక్రమాలు నిర్వహణకై చెక్కుల రూపంలో నిధులు జారీ చేయడం జరిగిందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. బోనాల ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్లు అందించిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రికి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆషాడ మాసంలో ముందుగా నగరంలో గోల్కొండ బోనాలు జూన్ 20న, జూలై 1, 2 తేదీలలో బల్కంపేట ఎల్లమ్మ బోనాలు, జూలై 13, 14 తేదీలలో శ్రీ ఉజ్జయిని మహాకాళి దేవస్థానం నందు, జూలై 20న లాల్ దర్వాజా బోనాలు అలాగే జూలై 23న చార్మినార్ భాగ్యలక్ష్మి బోనాలు అలాగే మిగిలిన దేవాలయాల కూడా బోనాల ఉత్సవాలు వైభవంగా జరుగుతాయని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ సంప్రదాయానికి, నిర్దిష్ట విధి విధానాల చట్రానికి అతీతంగా ఉండే మాతృదేవతారాధన, గ్రామీణ దేవతారాధన లోంచి పుట్టిన బోనాలు క్రమక్రమంగా సాంప్రదాయంగా ఏర్పడటం ఒక విశేషం అని ఈ పరిణామ క్రమంలో హైదరాబాద్ జంట నగరాల్లో శతాబ్ద కాలం నుంచి జరుగుతున్న ఈ బోనాల పండుగ మరెన్నో సామాజిక, నిర్మాణాత్మక పరిణామాలను కూడా చెప్పకనే చెబుతుందని అన్నారు. మొదట్లో పల్లెలకు, గ్రామాలకు సంబంధించిన ఉత్సవ విశేషంగా బోనాల పండుగ ఉండేదని ఇప్పుడు హైదరాబాద్ నగరంకి విస్తరించి, గ్రామీణ జీవన సంస్కృతికి ఇంత ఆదరణ, ఆచరణ ఉండటం భారతీయ జీవన విధానంలోని వైవిధ్యతకు, మానవ సంబంధాల పరస్పర ప్రభావానికి అచ్చమైన ఉదాహరణలుగా బోనాలు చెప్పుకోవచ్చు అని మంత్రి తెలిపారు. స్త్రీలను శక్తి రూపాలుగా ఆరాధించే విధానం 12వ దశాబ్ద కాలం నాటికే తెలంగాణ ప్రాంతంలో బోనాలు సాహితీ ప్రస్తావన వ్యాప్తిలో ఉందని మంత్రి తెలిపారు.

ఎమర్జెన్సీ డే వ్యాస రచన పోటీలు



విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : ఎమర్జెన్సీ డే సందర్భంగా మాదాపూర్ గ్రీన్ ఫీల్డ్ గ్లోబల్ స్కూల్‌లో విద్యార్థులకు ఎమర్జెన్సీ డే వ్యాస రచన పోటీలు 8,9,10 తరగతుల విద్యార్థులకు నిర్వహించి, గెలిచిన విద్యార్థుల కు మాదాపూర్ బీజేపీ తరపున శివ యాదవ్, ఆనంద్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథులుగా హాజరైన మాదాపూర్ డివిజన్ బిజెపి కంటెస్టెడ్ కార్పొరేటర్ రాధాకృష్ణ యాదవ్, డివిజన్ అధ్యక్షులు వేణు గోపాల్ రెడ్డి చేతులు మీదుగా విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. అనంతరం రాధకృష్ణ యాదవ్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా నిరసనలు చెలరేగి భారత దేశ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన దేశ ప్రజల గొంతునొక్కి విధంగా, రాజ్యాంగాన్ని అవమానిస్తూ, హక్కులను కాలరాస్తూ తన నియంత పూరిత అధికార ధోరణితో దేశ చరిత్రలో జూన్ 25, 1975 న ఎమర్జెన్సీ పేరుతో ఒక చీకటి అధ్యాయానికి శ్రీకారం చుట్టింది అప్పటి కాంగ్రెస్ ప్రధాని ఇందిరా గాంధీ అని అన్నారు. దేశచరిత్రలో ఇంతటి విషాదాన్ని ప్రజల జీవితాల్లో అంధకారాన్ని మిగిల్చిన జూన్ 25 ని మనం అందరం భాద్యత గల భారత పౌరులుగా రాజ్యాంగ అవమానాన్ని నిరసిస్తూ, "సంవిధాన్ హత్యా దివస్"గా గుర్తు పెట్టుకోవాలని భవిష్యత్ తరాలకు కాంగ్రెస్ పాలకుల అసమర్థత తెలియచేయాలని తన ప్రసంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమం పవన్ గరికపాటి, సెక్రటరీ శ్రీగిరి సత్యనారాయణ, బాలు నాయక్, నరేష్ రెడ్డి,శీను నాయక్, రాము, నవీన్, లింగస్వామి, వంశీ రాజవర్ధన్ రెడ్డి, డివిజన్ నాయకులు పాల్గొన్నారు. ఇతర బిజెపి నాయకులు, కార్యకర్తలు, విద్యాలయ సిబ్బంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థులకు అర్జాస్ స్టీల్ స్కాలర్‌షిప్‌లు

విశాలాంధ్ర - బషీర్‌బాగ్: నిరుపేద విద్యార్థులయినా 12 మందిని సండూర్ విద్యా ప్రోత్సాహక స్కాలర్‌షిప్‌కు ఎంపిక చేసి అర్జాస్ స్టీల్ స్కాలర్‌షిప్‌లు అందజేసామని అర్జాస్ స్టీల్స్ సీఈఓపసుపులేటి ఆనంద్ ప్రకటించారు. 2025 సంవత్సరానికి గాను ఈ స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నందుకు తాము గర్విస్తున్నామన్నారు. ఈ మేరకు బషీర్‌బాగ్‌లో ఆయన మాట్లాడుతూ తాడిపత్రి మండల్ చుట్టుపక్కల గ్రామాల నుండి 10 మంది బాలికలు, 2 అబ్బాయిలు ఎంపికయ్యారన్నారు. వారి విద్యాభ్యాసం గొప్పగా ఉండాలని, వారికలలను సహకారం చేసేందుకు తాము ప్రోత్సాహాన్ని అందిస్తున్నామన్నారు. భవిష్యత్తులో అధిక సంఖ్యలో విద్యార్థులకు ప్రోత్సహకాలు అందించేందుకు తమ సేవలను విస్తరిస్తామన్నారు. వెనుకబడిన విద్యార్థులకు విద్యను స్పాన్సర్ చేసి సాధికారత కల్పించడమె లక్ష్యంగా అర్జాస్ స్టీల్స్ కృషి చేస్తుందన్నారు. ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేయబడి, వ్యక్తిగత ఇంటర్వ్యూల ద్వారా అర్హులైన 10వ తరగతి ఉత్తీర్ణులైన వారికి స్కాలర్‌షిప్ ఇవ్వడం జరిగిందన్నారు.దీంతో విద్యార్థులు ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, సివిల్, కంప్యూటర్ సైన్స్, మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ వంటి విభాగాలలో డిప్లొమా కోర్సులు చేపట్టడానికి అవకాశం కల్పిస్తున్నామన్నారు. కర్ణాటకలోని సండూర్‌లోని ప్రతిష్టాత్మక సంస్థ అయిన యశ్వంత్‌నగర్‌లోని సండూర్ పాలిటెక్నిక్ కళాశాలలో 100 శాతం ఉచిత రెసిడెన్షియల్ విద్యను అందించడం ద్వారా తాడిపత్రి మండలం చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మద్దతు ఇవ్వడానికి ఎస్‌విపిఎస్ కార్యక్రమం రూపొందించబడిందన్నారు. ఈ కార్యక్రమం కింద ప్రతి విద్యార్థికి సంవత్సరానికి రూ.1.5 లక్షలు ఖర్చు చేయబడుతుందన్నారు. ఇందులో ట్యూషన్ ఫీజులు, హాస్టల్ వసతి, యూనిఫాంలు, పుస్తకాలు,ఇతర నిత్యావసరాలు ఉంటాయన్నారు. ఇది మూడు సంవత్సరాల పాలిటెక్నిక్ విద్యకు పూర్తి మద్దతును అందిస్తుందన్నారు. తమ చొరవ వల్ల పేద గ్రామీణ యువత విద్య, భవిష్యత్తు అవకాశాలు మెరుగుపడతాయని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ఎంపికైన 12 మంది విద్యార్థులకు ప్రవేశ పత్రాలను నాగరాజు ఎంఈఓ, జయప్రకాష్ దేవరాజ్ సిఓఓ, రాజేష్ రంజన్ ఠాకూర్ ప్లాంట్ హెచ్ఆర్, మిసా నరేందర్ సిఎస్ఆర్ హెడ్ ఇతర అర్జాస్ స్టీల్స్ సిబ్బంది అందజేశారనీ వివరించారు.

డ్రగ్స్ రహిత తెలంగాణే ప్రభుత్వ ధ్యేయం

డ్రగ్స్ కేసులపై కఠినంగా వ్యవహరించాలి

డి- ఎడిక్షన్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : డ్రగ్స్ రహిత తెలంగాణ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం నెక్లెస్ రోడ్‌లో గల జలవిహార్ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, వ్యతిరేక దినోత్సవం సందర్భంగా తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో హైదరాబాద్, దివ్యాంగులు, వయోవృద్ధులు ట్రాన్స్ జెండర్ వ్యక్తుల సాధికారిత శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ మైనార్టీస్, వికలాంగులు వయోవృద్ధుల శాఖ మంత్రి అట్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ రాష్ట్రంలో మాదకద్రవ్యాలపై రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని అన్నారు. బంగారు భవిష్యత్తు ఉన్న యువత చెడు మార్గంలో వెళ్లకుండా ఉండాలని ఆయన హితవు పలికారు. తల్లిదండ్రులు పిల్లలు చెడు మార్గంలో వెళ్లకుండా నిరంతరం పిల్లల ఆలోచనలు విధానాలను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు నిశితంగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. సమాజ హితం కోసం డ్రగ్స్ నిర్మూలనకై ముందుకు రావాలని అలాగే డ్రగ్స్ వాడే వారి వివరాలను 1908 కి కాల్ చేయాలని అలాగే రాష్ట్రం నషాముక్త్ ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ప్రభుత్వం డి ఎడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేయటంతో వీటి ద్వారా మాదకద్రవ్యాలు వాడే వారికి చికిత్సతో పాటు అవగాహన కల్పిస్తారని మంత్రి తెలిపారు. మాదకద్రవ్యాలను నివారించటంలో రాష్ట్ర ప్రభుత్వానికి అవార్డు కూడా వచ్చిందని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై సూర్య తేజ నిర్మించిన షార్ట్ ఫిలింను యువతతో పాటు మంత్రులు ఉన్నతాధికారులు తిలకించి వాల్ పోస్టర్‌ను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. తదుపరి ర్యాలీని ప్రారంభించి యువత చేయి ర్యాలీలో పాల్గొన్నారు. నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి అనితా రామచంద్రన్, సిపి సివి ఆనంద్, జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి, వయోవృద్ధుల శాఖ సంచాలకులు శైలజ, ఎక్సైజ్ శాఖ కమిషనర్ హరి కిరణ్, అదనపు సిపి సుధీర్ బాబు, ఏడి రాజేందర్, సినీ నటుడు నిఖిల్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం

కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనమనేని

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: బిఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాలకు అన్యాయమే జరిగిందని మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూడా శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి షాపూర్‌నగర్‌లో 26o1 ఉపకులాల అసోసియేషన్ సభ్యులు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్‌ని ఆయాన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి తెలంగాణలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం బీసి జాబితా నుండి తొలగించిన 26+1 ఉప కులాలను తిరిగి బీసి జాబితాలో చేర్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి బీసీ జాబితాలో చేర్చేలా కృషి చెయ్యాలని కోరారు. అనంతరం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు కూడ ఈ సమావేశంలో పాల్గొని గత బీఆర్ఎస్ పార్టీ చేసిన అన్యాయాన్ని కూన శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి ఈ సమస్యలు పట్ల వివరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉప కులాలను బీసీ జాబితా నుండి తొలగించి తీవ్ర అన్యాయం చేసిందని, 2014 నుండి ఆ కులాల కుటుంబల విద్య, ఉపాధి, రాజకీయ రంగాలలో 11 సంవత్సరాలు కోల్పోయిన రిజర్వేషన్ బాధ్యత వహించాల్సింది ఎవరని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన ప్రకారం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన మాట నిలపెడుతారని, ఈ సమస్య పట్ల ముఖ్యమంత్రితో మాట్లాడి న్యాయం జరుగేలా ప్రయత్నం చేస్తామని వ్యక్తం చేశారు. అణగారిన వర్గాల ఆపద్బాంధవుడు, అట్టడుగు వర్గాల ఆశాజ్యోతి మన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని, ఇచ్చిన మాట కోసం బీసీ ప్రజల అభ్యున్నతి కోసం దేశంలో ఎక్కడా లేనివిధంగా కుల, జన గణన చేసిన మొట్టమొదటి నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గుర్తు చేశారు. ఈ విధంగా అసోసియేషన్ సభ్యులందరూ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావుని శాలువాలతో సత్కరించి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపకుల అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సిద్ధనోళ్ల మల్లారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: బుధవారం కుత్బుల్లాపూర్ నియోజక వర్గం125 డివిజన్ గాజులరామారం సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ్ రెడ్డి కుమారుడు మల్లారెడ్డి జన్మదినం సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా కొలను హన్మంత్ రెడ్డి మల్లారెడ్డిని శాలువాతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రంగారావు, 126 డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వేణు గౌడ్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

27న జగన్నాథుని రథయాత్ర

విశాలాంధ్ర- బషీర్ బాగ్: విశ్వ ప్రభువు జగన్నాథుని గొప్ప కమనీయమైన రథయాత్ర ఈ నెల 27న అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) కుక్కట్ పల్లి, హైదరాబాద్‌లో మహా వైభవంగా జగన్నాథుని రథయాత్ర నిర్వహిస్తుందని ఇస్కాన్ కుక్కట్‌పల్లి అధ్యక్షులు ప్రభుజీ మహా శృంగదాస్ తెలిపారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేఖరుల సమావేశంలో తెలంగాణ అగర్వాల్ సమాజ్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు అంజనీ కుమార్ అగర్వాల్, తెలంగాణ గుజరాతి సమాజ్ అధ్యక్షులు జాస్మాత్ పటేల్, ఇస్కాన్ కుకుట్ పల్లి సమన్వయకర్త ఏం. శ్రీవాణి, ఇస్కాన్ రష్యా ప్రతినిధి ఒక్సానా లతోకలసి ప్రభుజీ మహా శృంగ దాస్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అత్యంత దివ్యమైన పండుగగా జగన్నాథ రథయాత్ర ప్రపంచమంతా నిర్వహించబడుతుందని, 1976లో, ఇస్కాన్ భారతదేశం వెలుపల శాన్ ఫ్రాన్సిస్కో మహానగరంలో వీధుల వెంబడి మొదటి రథయాత్ర ఉత్సవాన్ని నిర్వహించిందని గుర్తు చేశారు. అంతర గర్భగుడి వెలుపల అరుదుగా కనిపించే ప్రభువు జగన్నాథుడు, సుభద్ర, బలదేవుడు చాలా దయగలవారని, వారు ప్రజలను ఆశీర్వదించడానికి ఆలయం నుండి బయటకు వస్తారని, ఈ సందర్భంగా జగన్నాథుని రథయాత్ర మహా వైభవంగా జరుగుతుందన్నారు. జగన్నాథుని రథోత్సవాన్ని చూసేందుకు భక్తులు నలుమూలల నుండీ వేల సంఖ్యలో తరలివస్తారని, రథోత్సవం చూట్టానికి రెండు కళ్ళు చాలవని అన్నారు. ఈ అద్భుతమైన జగన్నాథుని రథయాత్ర ఆధ్యాత్మికంగా ఉత్సాహంగా సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు, ఉత్తేజకరమైన కీర్తనలు, స్వచ్ఛమైన దైవ ప్రేమను ఉద్ధరించడానికి ఉల్లాసమైన కీర్తన రథాన్ని లాగుతూ హైదరాబాద్, హైదర్ నగర్, మైసమ్మ ఆలయం నుండి మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభమై నిజాం పెట్, జె.ఎన్.టి.యు, కె.పి.హెచ్.బి, వివేకానంద్ నగర్, బాలానగర్ మెట్రో స్టేషన్ వీధుల గుండా రాత్రి 8.00 గంటలకు మెట్రో గార్డెన్ వద్ద భక్తులకు మహాప్రసాద వితరణతో ముగుస్తుందని వెల్లడించారు.

ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, మాధవరం కృష్ణరావు, మాజీ ఎమ్మెల్యే పైన శ్రీశైలం గౌడ్, మాజీ కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొంటారని, ఈ పవిత్రమైన రథయాత్రలో లక్షలాది మంది భక్తులు పాల్గొని జగన్నాథుని ప్రేమ, ఆశీర్వాదాలను పొందాలని ప్రభుజీ మహా శృంగ దాస్ కోరారు. అంజనీ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ ఈ జగన్నాథుని రథయాత్ర ముగింపు అనంతరం సికింద్రాబాద్, బాలంరాయి, క్లాసిక్ గార్డెన్స్‌లో కోలాట, గర్భ నృత్యాలు, భజనలు, కీర్తనలు ఇస్కాన్ ఆధ్వర్యంలో జగన్నాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించబడుతాయని, భక్తులందరూ అధికసంఖ్యలో పాల్గొని జగన్నాథుని ఆశీర్వచనాలు పొందాలని కోరారు.

మౌలిక వసతులు కల్పించాలి

విశాలాంధ్ర - అమనగల్లు : ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని తొమ్మిదవ వార్డులో గల విద్యానగర్ కాలనీలో అంతర్గత రోడ్లు, వీధి దీపాలు, అంతర్గత మురికి కాలువలు, పందుల బెడద, విపరీతమైన దోమలు కాలనీలో పేరుకుపోయిన చెత్తాచెదారంపై చర్యలు తీసుకోవాలని ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ శంకర్‌కు కాలనీ అధ్యక్షుడు ఎం ఏ పాషా కాలనీవాసులతో కలిసి వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా కాలనీలో మిషన్ భగీరథ నీటి కనెక్షన్ ఇవ్వలేదని కావున కాలనీ వాసులపై ప్రత్యేక శ్రద్ధ వహించి కాలనీలో నీటి ఎద్దడిని తీర్చాలని వినిపత్రంలో పేర్కొన్నారు. కాలనీలో సిసి రోడ్లు లేకపోవడంతో వర్షపు నీటితో కయ్యలు కోసి రాకపోకలకు చాలా ఇబ్బందికి గురవడం జరుగుతుందని అంతర్గత మురుగు కాలువలు లేకపోవడంతో పందులు దోమలు, పాములు స్వైర విహారం చేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. చీకటిలో రాకపోకలకు ఇబ్బందిలకు గురవడం జరుగుతుందని కావున అధికారులు మా కాలనీవాసులపై దయ చూపి ప్రత్యేక దృష్టి నిలిపి సమస్యలను పరిష్కరించాలని కాలనీ అధ్యక్షుడు పాష కమిషనర్ శంకర్ కు వివరించారు. పేర్కొనడం జరిగింది.. ఈ కార్యక్రమంలో కాలనీ కోశాధికారి జి సుదర్శన్ రెడ్డి, ఉపాధ్యక్షులు వర్కాల శేఖర్, కాలనీవాసులు కానుగుల రాములు, తెలగమల్ల మల్లయ్య పాల్గొన్నారు.

కీసర 108 అంబులెన్స్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - ఘట్ కేసర్ : మేడ్చల్ జిల్లా కీసర మండల పరిధిలోని కీసర ప్రభుత్వ హాస్పిటల్‌లో ఉంటున్న 108 వాహనాన్ని మేడ్చల్ జిల్లా నూతన ప్రోగ్రాం మానేజర్ భూమా నాగేందర్ ఆకస్మిక తనిఖీ చేశారు, కీసర ప్రభుత్వ హాస్పిటల్ ఆవరణలో ఉన్న 108 వాహన సిబ్బంది పనితీరును పరిశీలించారు. అత్యవసర సమయంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించే పరికరాలు, వాటి పనితీరును గురుంచి 108 సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అత్యవసర మందుల స్టాక్ రికార్డును పరిశీలించారు. క్షత-గాత్రులకు రోగాలకు వైద్యం అందిస్తున్నా వైద్య పరికరాలను పరీక్షించి వాటి పనితీరును తెలుసుకున్నారు. కీసర 108 అంబులెన్స్‌లో అన్ని రకాల వైద్య పరికరాలు, అత్యవసర మందులు అందుబాటులో ఉన్నాయి అని వారు తెలిపారు. కీసర 108 సిబ్బంది పనితీరు బాగుందని మెచ్చుకున్నారు, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న డెలివరీ మహిళలకు అంబులెన్స్‌లోనే ప్రసవం చేయటం, క్షత-గాత్రులకు సరైన సమయంలో చికిత్స చేసి ప్రాణాలు కాపాడిన కీసర 108 సిబ్బంది ఈ.ఏం.టి చిత్రం రవి, పైలట్ రాంబాను అభినందించారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

విశాలాంధ్ర - మొయినాబాద్ : మొయినాబాద్ మండల పరిధిలోని తొల్కట్ట గ్రామ శివారులోని ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 155 లో 1-14 గుంటల భూమిని కబ్జా చేసి అక్రమంగా నిర్మిస్తున్న ప్రహరీ గోడ (ఫ్రీ కాస్ట్ వాల్) ను, ఇనుప గేట్‌ను మొయినాబాద్ రెవెన్యూ అధికారులు జేసీబీ సహాయంతో తొలగించారు. తహసీల్దార్ గౌతమ్ కుమార్, మండల గిర్దవర్ రాజేష్ మరియు రెవెన్యూ సిబ్బందితో కలిసి స్థానిక పోలీసుల సహాయంతో కబ్జా చేసిన స్థలాన్ని పరిశీలించి అక్రమ నిర్మాణాలను తొలగించారు. బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మండల పరిధిలోని ప్రభుత్వ భూములు కబ్జాల నుండి రక్షించుటకు జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ ఆదేశాల మేరకు త్వరలో ప్రభుత్వ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామని అలాగే ప్రభుత్వ భూముల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రెవెన్యూ సిబ్బంది భాస్కర్, భరత్, అంజయ్య పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజానికి పాటుపడాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని యాంటీ నార్కోటిక్ బ్యూరో డీఎస్పీ సోమనాథం పిలుపునిచ్చారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విద్యార్థి సేన అధ్యక్షులు టీకే.శివప్రసాద్ ఆధ్వర్యంలో చేపట్టబోయే 'డ్రగ్స్ ఫ్రీ తెలంగాణకై 100 రోజుల మహోద్యమ' వాల్ పోస్టర్ ను ఆయన ముఖ్య అతిథిగా ఆవిష్కరించి మాట్లాడారు. డ్రగ్ రూపంలో ముంచుకొస్తూ యువ సమాజాన్ని పట్టి పీడిస్తున్న ఈ మహమ్మారిని తరిమికొట్టి మేధోసంపత్తి గల యువ తెలంగాణను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. సామాజిక బాధ్యతగా ఇలాంటి కార్యక్రమాలను చేపడుతున్న నిర్వాహకులను ఆయన అభినందించారు. టీకే.శివప్రసాద్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు, చెడు వ్యసనాలకు బానిస అవుతున్న యువతకు, విద్యార్థులకు రాష్ట్ర వ్యాప్తంగా 100 రోజుల్లో అన్ని విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. డ్రగ్స్ వల్ల యువతకు జరుగుతున్న ప్రమాదాలను తెలియజేసి డ్రగ్స్ ఫ్రీ తెలంగాణను సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. ఈ సమావేశంలో చింతల పవన్, రామ్, రాజేష్, విష్ణు, వెంకట్, భాస్కర్, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేసీఆర్ దమ్మేంటో ఒరిజినల్ కాంగ్రెస్ నాయకులను అడిగితే తెలుస్తుంది

విశాలాంధ్ర - హైదరాబాద్ : కేసీఆర్ దమ్మేంటో ఒరిజినల్ కాంగ్రెస్ నాయకులను అడిగితే తెలుస్తుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కేసీఆర్ పోరాడి తెలంగాణ సాధించారు కాబట్టే ఈరోజు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నారనే విషయం గుర్తు పెట్టుకోవాలన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సోనియాగాంధీ హామీ ఇచ్చిన మహిళలకు నెలకు రూ.2,500 ఇవ్వడంతో పాటు పింఛన్ల పెంపు హామీని నిలబెట్టుకోవాలని కోరుతూ బుధవారం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో అబిడ్స్ జనరల్ పోస్ట్ ఆఫీస్ ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం సోనియాగాంధీకి పోస్ట్ కార్డులు పోస్ట్ చేశారు. ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ, ఏపీ సీఎం చంద్రబాబును పిలిచి ప్రజాభవన్‌లో హైదరాబాద్ బిర్యానీ పెట్టి గోదావరి నీళ్లను గిఫ్ట్ గా ఇచ్చిందే రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ కలలో కూడా తెలంగాణకు నష్టం చేయబోరని అన్నారు. అసెంబ్లీ సమావేశాలు పెట్టి ఆరు గ్యారంటీలు, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై చర్చించే సత్తా ఉందా అని నిలదీశారు. గ్యారంటీలపై, మహిళలకు, పింఛన్లు పొందే అవ్వాతాతలకు చేసిన మోసంపై చర్చిద్దామా అన్నారు. 2016లో అసలు పోలవరం %-% బనకచర్ల లింక్ ప్రాజెక్టు అనే ప్రస్తావనే లేదన్నారు. అబద్ధాలు ఆడటం రేవంత్ రెడ్డికి అలవాటుగా మారిందన్నారు. హామీల అమలు నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. రేవంత్ రెడ్డి తాను ముఖ్యమంత్రి అన్న విషయం గుర్తించి హుందాగా వ్యవహరించాలని హితవు పలికారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా ఎన్నికలకు వెళ్తే కాంగ్రెస్ పార్టీని ప్రజలు క్షమించబోరని అన్నారు. పింఛన్లు పెంచాలని, మహిళలకు రూ.2,500 ఇవ్వాలని సోనియాగాంధీకి పోస్టు కార్డులు సోనియాగాంధీ ఎన్నికలకు ముందు తెలంగాణ వచ్చి హామీ ఇచ్చారు కాబట్టే ప్రజలు నమ్మి కాంగ్రెస్ పార్టీని గెలిపించారని ఎమ్మెల్సీ కవిత అన్నారు.

మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి కృషి



విశాలాంధ్ర-దుండిగల్: మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద పేర్కొన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద మున్నూరు కాపు సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గ సభ్యులు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు ఎమ్మెల్యే చేతులమీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన బోరుబావి సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి కుంట సిద్దిరాములు, జంగిటి రవి, మీడియా సెక్రెటరీ సాయిని శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పందిరి యాదగిరి, రాష్ట్ర కార్యదర్శి అప్పాల శేఖర్, రాష్ట్ర కమిటీ మెంబర్ సీహెచ్.శ్రీనివాస్, ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు నాగరాజు, గ్రామ ప్రెసిడెంట్ మంత్రి రఘు, గ్రామ కమిటీ సభ్యులు హనుమంతు జనార్ధన్, గ్రామ ప్రధాన కార్యదర్శి చర్మ శ్రీకాంత్, షాపూర్ ప్రధాన కార్యదర్శి బాలరాజు,సూరారం డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, నాయకులు చంద్రగిరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - జవహర్‌నగర్ : మేడ్చల్ జిల్లా జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 21వ డివిజన్ లో డ్రైనేజీ సిసి రోడ్లు కరెంటు వీధిలైట్లు వేయాలని ప్రగతిశీల మహిళా సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలు బి లక్ష్మీబాయి, రాష్ట్ర అధ్యక్షురాలు డి స్వరూప మున్సిపల్ కమిషనర్ వసంతని కలిసి వినతిపత్రం ఇచ్చారు. 21వ డివిజన్‌లోని ప్రగతి నగర్‌లో డ్రైనేజీ ఏర్పాటు చేయాలని దానికి మెయిన్ రోడ్ అనుసంధానం చేసి కనెక్షన్ ఇవ్వాలని కొన్ని వీధులలో సిసి రోడ్లు ఏర్పాటు చేయాలని కోరుతూ మహిళా సంఘాలు కమిషనర్ ని కలిసి కోరారు. కమిషనర్ స్పందిస్తూ త్వరలోనే పూర్తిస్థాయిలో డ్రైనేజీ వేస్తామని అన్ని వీధులలో సిసి రోడ్లు వేపిస్తామని కరెంటు వెలుగని వీధిలైట్లను మరమ్మతులు చేపించి కొత్త బలుపు లేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జి రాజేశ్వరి, ఎస్ కనకమ్మ, రాణి, రవళి, రేణుకా తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చూపిన పట్టణ పోలీసులు

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్ : అభం శుభం తెలియని 80 ఏళ్ల వృద్ధురాలిని అనాగరి కంగా షాద్‌నగర్ పట్టణ రైల్వేస్టేషన్ నుండి రైల్వే ప్లాట్ఫామ్‌పై వదిలి వేశారు. దయగల హృదయంగల భగవంతుడు షాద్నగర్ పట్టణ పెట్రోలింగ్ పోలీసుల కళ్ళలో ఆమెను పడేటట్లు చేశాడు. నిన్న రాత్రి పెట్రోలింగ్ డ్యూటీ నిర్వహిస్తున్న పోలీసులు రైల్వే ప్లాట్ ఫారంపై పై ఒక 80 ఏళ్ల ముసలావిడ ఉండడం గమనించి వెంటనే పట్టణ సీఐకు తెలుపగా దయార్ద్ర హృదయుడు, మంచి మానవత్వం కలిగిన పట్టణ సిఐ విజయకుమార్ వెంటనే స్పందించి ఆమె వివరాలు కనుక్కునే ప్రయత్నం చేయగా వివరాలు కూడా చెప్పలేని స్థితిలో ఉన్న ఆ ముసలావిడను లింగారెడ్డిగూడెం సమీపంలో నేషనల్ 44 హైవే పక్కన గల ఎఫ్‌సిఎన్ ఓల్డ్ ఏజ్ హెూమ్ నిర్వాహకులతో మాట్లాడి ఆమెను ఓల్డ్ ఏజ్ హెూమ్‌లో చేర్పించారు. ఇంతకుముందు కూడా సిఐ విజయ్ కుమార్ శంషాబాద్ ఏరియాలో కూడా ఇలాగే ఎంతో మంది అనాథలుగా మిగిలిపోయిన వారిని ఓల్డ్ ఏజ్ హెూమ్‌లో చేర్పించినట్టు సమాచారం. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానానికి ఆదర్శంగా నిలుస్తున్న, ఖాకీ డ్రెస్‌లో కూడా మానవత్వాన్ని ప్రదర్శిస్తున్న షాద్‌నగర్ పట్టణ సిఐ విజయ్‌కుమార్‌తో పాటు ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని అవలంబిస్తున్న పోలీసులకు కూడా పట్టణ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ వారు చూపిస్తున్న మానవత్వానికి, భగవంతుని మరో రూపంగా భావిస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

ఎమ్మెల్యే పల్లాని పరామర్శించిన పీర్జాదిగూడ మాజీ మేయర్

విశాలాంధ్ర - మేడిపల్లి: జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి గత కొద్ది రోజుల క్రితం కాలుకు గాయమై హైదరాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స చేసుకొని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న పల్లా రాజేశ్వర్ రెడ్డిని బుధవారం వారి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, మధుసూదన్ రెడ్డి, సీనియర్ నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మల్లం వెంకటేష్ గౌడ్ కలిసి పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

యుటోపియా థెరప్యూటిక్స్‌కు నిధులు



విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : దీర్ఘకాలిక జీవక్రియ వ్యాధుల కోసం తదుపరి తరం వ్యాక్సిన్లను అభివృద్ధి చేస్తున్న బయోటెక్ కంపెనీ యుటోపియా థెరప్యూటిక్స్, వేల్ ట్యాంక్ నుంచి 1.5 మిలియన్ డాలర్ల సీడ్ ఫండింగ్ను పొందినట్లు వెల్లడించింది. ఊబకాయాన్ని తగ్గించడానికి యుటోపియా లీడ్ ఇమ్యునోథెర పీటిక్ క్యాండిడేట్ అయిన యూటీ009 ప్రీక్లినికల్ అభివృద్ధిని ఈ నిధులు వేగవంతం చేస్తాయి. ఇది లిపిడ్ సంబంధిత యాంటిజెన్లను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా కొవ్వు పేరుకుపోవడాన్ని తగ్గిస్తుంది. ఈ వ్యాక్సిన్ జీవక్రియ ఆరోగ్యాన్ని కూడా మెరుగు పరుస్తుందని యుటోపియా తెలిపింది.

న్యూటన్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ క్యాంపస్ ప్రారంభం

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : విద్యార్థుల అసాధారణ విజయాలతో స్ఫూర్తి పొంది, న్యూటన్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ బెంగళూరులో అధునాతన సాంకేతిక విద్యాబోధన కోసం తమ కొత్త క్యాంపస్‌ను ప్రారంభించింది. న్యూటన్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీలో రెండో సంవత్సరం అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులలో అసాధారణ స్థాయిలో 93శాతం మంది అగ్రశ్రేణి టెక్ సంస్థలు, ప్రతిష్టాత్మక పరిశోధనా సంస్థలలో ఇంటర్న్‌షిప్‌లు పొందారు. రేజర్‌పే, సర్వం ఏఐ, జూమ్‌కార్ వంటి ప్రముఖ కంపెనీలతో పాటు, డీఆర్‌డీఓ లాంటి గౌరవనీయ పరిశోధనా సంస్థల్లో వీరు ఇంటర్న్‌షిప్‌లు సాధించారు. భారతదేశ ప్రముఖ టెక్, స్టార్టప్ కేంద్రమైన ఎలక్ట్రానిక్ సిటీలో న్యూటన్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ సరికొత్త క్యాంపస్‌ను నిర్మించింది. ఉద్యోగాలకు సిద్ధం చేసే ఆచరణాత్మక టెక్ విద్యకు పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడం ఈ క్యాంపస్ ప్రధాన లక్ష్యం. ఈ కొత్త క్యాంపస్‌లో 2,500 మంది విద్యార్థులు చదువుకునే వీలు కల్పించారు. అలాగే, 1,000 మంది విద్యార్థులకు వసతి సౌకర్యాలు కూడా ఉంటాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, టెక్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వంటి ప్రత్యేక కోర్సులతో స్కూల్ ఆఫ్ టెక్నాలజీ విద్యా విధానాన్ని రూపొందించారు. తరగతి గదిలో నేర్చుకున్న జ్ఞానాన్ని నిజ జీవిత పరిశ్రమ అనుభవంతో జోడించి, విద్యార్థులు ప్రాక్టికల్ నైపుణ్యాలతో, బలమైన ప్రొఫైల్‌తో, ఉద్యోగానికి సిద్ధంగా ఉండేలా తీర్చిదిద్దుతారు. న్యూటన్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులకు అత్యాధునిక అభ్యాస వాతావరణం కల్పిస్తోంది. ఇక్కడ విద్యార్థులకు రోబోటిక్స్ కోసం ప్రత్యేకంగా ఆన్-క్యాంపస్ మేకర్స్ ల్యాబ్ అందుబాటులో ఉంది. అలాగే, అత్యాధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మోడల్స్ పరిశోధనా సౌకర్యాలు లభిస్తాయి. ఐసీపీసీ వరల్డ్ ఫైనలిస్ట్ మరియు క్రెడ్ మాజీ టెక్ లీడ్ అయిన అశ్విన్ కె, మేక్‌మైట్రిప్ మాజీ ప్రిన్సిపల్ ఇంజినీర్ సౌమిత్ర మిశ్రా, ఇస్రో మాజీ ఉద్యోగి సిద్ధార్థ్ మాలిక్ లాంటి పరిశ్రమ నిపుణులు రూపొందించిన పాఠ్య పుస్తకాలతో విద్యార్థులు శిక్షణ పొందుతారు. ఈ వాతావరణం విద్యార్థులలో సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలను, ప్రయోగాలు చేసే తత్వాన్ని పెంపొందిస్తుంది. తొలి రోజు నుంచే నిజ ప్రపంచ ఉత్పత్తులను తయారు చేసే దిశగా వారిని ప్రోత్సహిస్తుంది.

యుద్ధం అప్రజాస్వామికం

- అమెరికా మద్దతుతోనే ఇరాన్‌పై దాడులు
- ప్రధాని మోదీ వైఖరి వెల్లడించాలి
- ప్రజాస్వామ్యవాదులు పలస్తీనీయులకు అండగా నిలబడాలి
- వామపక్ష పార్టీల నిరసనలో రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: అమెరికా అండతో ఇజ్రాయిల్ మారణహోమం సృష్టిస్తోందని, సామ్రాజ్యవాద, ఆధిపత్య పోకడలతో అప్రజాస్వామిక యుద్ధం కారణంగా అమాయక ప్రజలు బలవుతున్నారని వామపక్ష పార్టీల నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికా దాడులకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీల దేశ వ్యాప్త పిలుపులో భాగంగా... విజయవాడ ధర్నా చౌక్ వద్ద సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రపంచ శాంతి వర్ధిల్లాలి అంటూ అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ముఖ్య అతిథిగా హాజరయిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ పలస్తీనా ప్రజలపై 20 నెలలకు పైగా జరుగుతున్న వైమానిక బాంబు దాడులలో దాదాపుగా 55 వేల మందికి పైగా మరణించారని, వారిలో అత్యధికులు మహిళలు, పిల్లలేనని అన్నారు. ఉద్దేశపూర్వకంగా ఆస్పత్రులు, పాఠశాలలు, శరణార్థి శిబిరాలు తదితర ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. అమెరికా మద్దతుతోనే ఇజ్రాయిల్... గాజా, పలస్తీనా, ఇరాన్‌పై దాడులకు పాల్పడుతోందని విమర్శించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రపంచ దేశాలపై ఆధిపత్యం చెలాయించడానికి ఇలాంటి చర్యలకు పాల్పడుతూ, తానే ప్రపంచానికి పెద్దదిక్కు అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని పరోక్షంగా ప్రోత్సహించిన ట్రంప్ ఇటీవల పలస్తీనాపై ఇజ్రాయిల్ దాడి చేసేలా పురిగొల్పారని అన్నారు. తాజాగా ఇరాన్‌పై ఇజ్రాయిల్‌ను యుద్ధానికి ప్రోత్సహించి... ఇరాన్‌పై బాంబుల వర్షం కురిపించడం దారుణమని మండిపడ్డారు. పాకిస్థాన్ ఉగ్రవాద శిబిరాలపై భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ చేపడితే ట్రంప్ భారత్‌కు మద్దతు ఇచ్చిన రెండు రోజుల్లోనే పాకిస్థాన్‌కు వంత పాడారన్నారు. అమెరికా యుద్ధ కాంక్షకు వ్యతిరేకంగా భారత ప్రధాని మోదీ తన గళాన్ని వినిపించాలని డిమాండ్ చేశారు. ఇరాన్‌పై దాడితో చమురు సంక్షోభం వస్తుందని... దీంతో దేశ ప్రజలపై భారాలు పడతాయని చెప్పారు. తక్షణమే భారత ప్రభుత్వం అమెరికా దాడులను ఖండించాలని అన్నారు. ఈ దాడులను దేశంలోని ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, ప్రజలందరూ ఖండించాలని పిలుపునిచ్చారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ భారత్‌తో ఇరాన్ ఎల్లప్పుడూ స్నేహపూర్వకంగా వ్యవహరిస్తోందని, ప్రతి కష్ట సమయంలోనూ భారత్‌కు మద్దతు ఇస్తోందని గుర్తు చేశారు. ఇరాన్‌పై దాడి చేయడానికి అమెరికా కుంటిసాకులు చెబుతోందన్నారు. అమెరికా నిఘా సంస్థలు, అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ... ఇరాన్ అణ్వాయుధాన్ని తయారు చేస్తోందనడానికి తమ వద్ద నిర్దిష్ట ఆధారమేదీ లేదని అంగీకరించాయని తెలిపారు. అదీకాక అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందంపై ఇరాన్ సైతం సంతకం చేసిందన్నారు. అయినప్పటికీ ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడులు చేస్తోందని, ఇందుకు అమెరికా కూడా చేతులు కలిపిందని తెలిపారు. ఇరాన్‌పై దాడి చేయడం పశ్చిమాసియాపై పెత్తనం చెలాయించేందుకేనని, ప్రపంచాన్ని భయపెట్టేందుకేనని స్పష్టమవుతుందన్నారు. ఈ దాడి ప్రపంచ శాంతి పైన, సాధారణ ప్రజల జీవనోపాధి మీద వినాశకరమైన ప్రభావం చూపుతుందని చెప్పారు. ముఖ్యంగా చమురు దిగుమతుల కోసం, వలస కార్మికులకు అవకాశాల కోసం పశ్చిమాసియాపై ఎక్కువగా ఆధారపడుతున్న భారత్ వంటి దేశాలపై ఈ ప్రభావం మరింత అధికంగా ఉంటుందన్నారు. ఇప్పటికే బాగా ఇబ్బంది పడుతున్న కార్మిక వర్గం ఈ యుద్ధం కారణంగా ఆర్థికంగా మరింతగా దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. భారత ప్రభుత్వం వెంటనే అమెరికా, ఇజ్రాయిల్ అనుకూల విదేశాంగ విధాన వైఖరిని విడనాడి యుద్ధాన్ని ఆపడానికి అంతర్జాతీయంగా జరుగుతున్న ప్రయత్నాలలో భాగస్వామిగా చేరాలని కోరారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ నాయకులు పి.ప్రసాద్ మాట్లాడుతూ అమెరికా తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని, దానిని కప్పిపుచ్చుకునేందుకు అనేక దేశాల్లో యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తోందని విమర్శించారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవాని, సీపీఐ(ఎంఎల్) నాయకులు జాస్తి కిషోర్ బాబు, ఎంసీపీఐ(యూ) నాయకులు కాటం నాగభూషణం, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు బి. బంగార్రావు, ఎస్‌యూసీఐ(సి) నాయకులు బి.ఎస్.అమర్‌నాథ్, ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు పీవీ సుందరరామరాజు, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ నాయకులు జానకి రాములు తదితర వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కర్నాటక కళామందిర్‌లో ఇప్టా ఆధ్వర్యంలో జరిగిన సద్భావ సభలో తెలుగు భాషలో ఉన్న సద్భావ పోస్టర్‌ను సినీ నటుడు ప్రకాశ్ రాజ్, ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్య మండలి ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, ప్రసన్న చేతుల మీదుగా విడుదల చేయించిన ఇప్టా జాతీయ అధ్యక్షులు ప్రసన్న

సీపీఐ మహారాష్ట్ర కార్యదర్శిగా సుభాశ్ లాండే

న్యూఢిల్లీ: నాసిక్‌లో సీపీఐ మహారాష్ట్ర 25వ రాష్ట్ర సమితి సమావేశం ముగిసింది. కేంద్రంలోని అధికార బీజేపీ పాలనకు, రాష్ట్రంలో అవకాశవాద ఫడ్నవీస్ నేతృత్వంలోని ప్రభుత్వానికి వ్యతిరేకంగా వామపక్ష, ప్రగతిశీల, ప్రజాస్వామ్య శక్తులను ఏకం చేయాలని సమావేశం పిలుపునిచ్చింది. సీపీఐ మహారాష్ట్ర సమితి రాష్ట్ర కార్యదర్శిగా సుభాశ్ లాండే తిరిగి ఎన్నికయ్యారు. ఆయనకు, కొత్తగా ఎన్నికయిన నాయకత్వానికి, సమావేశాన్ని ఉత్సాహభరితంగా విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ అభినందనలు తెలిపింది. ప్రజా పోరాటాలను బలోపేతం చేయడానికి, రాజ్యాంగాన్ని రక్షించడానికి, మత, కార్పొరేట్ పాలనకు వ్యతిరేకంగా ఐక్య ప్రతిఘటనను నిర్మించడానికి సీపీఐ తన సంకల్పాన్ని పునరుద్ఘాటించింది.

ఘనంగా కృష్ణా వర్సిటీ స్నాతకోత్సవం

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం: యూనివర్సిటీల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం బుధవారం అల్లూరి సీతారామరాజు ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. తొలుత గవర్నర్ వర్సిటీ ఫుడ్‌కోర్ట్ ప్రాంగణానికి చేరుకోగానే ఆయనకు మంత్రులు నారా లోకేశ్, వాసంశెట్టి సుభాశ్, కొల్లు రవీంద్ర, కలెక్టర్ డీకే బాలాజీ, వీసీ ఆచార్య కె.రాంజీ ... పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ పోలీస్ గౌరవ వందనం స్వీకరించి, రూ.3.20 కోట్లతో నిర్మించిన ఫుడ్ కోర్ట్‌ను మంత్రులతో కలిసి ప్రారంభించారు. వైఎస్ఆర్ పరిపాలన భవనంలోని వీసీ ఛాంబర్‌లో కార్యనిర్వాహక మండలి సభ్యులతో సమావేశం నిర్వహించారు. తదనంతరం వారితో గ్రూప్ ఫొటో దిగారు. గవర్నర్ కార్యదర్శి హరి జవహర్‌లాల్, సంయుక్త కార్యదర్శి సూర్యప్రకాశ్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జిల్లా ఎస్పీ ఆర్. గంగాధర రావు, సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, అదనపు ఎస్పీలు వి.వి. నాయుడు, సత్యనారాయణ, లోకేశ్ ఓఎస్ రమణ, ఆర్డీఓ స్వాతి పాల్గొన్నారు.

నియంతలకు చోటు లేదు: చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రజాస్వామ్యంలో నియంతలకు, విధ్వంసకారులకు చోటు లేదని సీఎం చంద్రబాబు అన్నారు. దేశంలో ఎమర్జెన్సీ విధించి నేటకి 50 ఏళ్లు పూర్తయ్యాయని, ఈ అరాచక, అప్రజాస్వామిక పాలన మాననిగాయంగా మిగిలిందని పేర్కొన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 'సంవిధాన్ హత్యా దివస్' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన బోర్డుపై సీఎం సంతకం చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలో ఐదేళ్ల కిందట ఇదే రోజు ప్రజావేదిక కూల్చారని సీఎం గుర్తుచేశారు. ప్రజావేదిక కూల్చివేత సందర్భంగా సంవిధాన్ హత్యా దివస్ నిర్వహించినట్లు తెలిపారు. కూల్చివేత నేతలను ప్రజలు పంపించి... పునర్నిర్మాణ బాధ్యతలను మాకు ఇచ్చారన్నారు. రాష్ట్ర పురోగతి కోసం కసి, పట్టుదలతో పనిచేస్తున్నామని చెప్పారు. ప్రజావేదిక కూల్చివేతతో గత ప్రభుత్వం విధ్వంస పాలనకు తెరదీసిందని, ఎమర్జెన్సీని మించిన నియంతృత్వ పాలన ఐదేళ్లుగా చూశామన్నారు. తొలుత విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మంత్రులు సత్యకుమార్ యాదవ్, కందుల దుర్గేశ్, ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, కొటికలపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బేవరేజెస్ కార్పొరేషన్ అధికారులతో చర్చలు విఫలం

హమాలీలకు కూలి రేట్లు పెంచాల్సిందే : వెంకట సుబ్బయ్య డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న లోడింగ్, అన్‌లోడింగ్ హమాలీల కూలి రేట్ల పెంపుదలపై బుధవారం మంగళగిరిలోని కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ నిశాంత్ కుమార్‌తో జరిగిన చర్చలు విఫలమయ్యాయి. ఈ చర్చలలో కార్పొరేషన్ ప్రతినిధులుగా సీజీఎం చరణ్, అనసూయ, డిస్టలరీస్ అసోసియేషన్ ప్రతినిధులు కామేశ్వరరావు, రాజేశ్వరరావు, హమాలీ యూనియన్ ప్రతినిధులు, ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ వెంకటసుబ్బయ్య, హమాలీ యూనియన్ నాయకులు ఉమామహేశ్వరరావు, సుబ్బారెడ్డితో పాటు కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ కార్మికులకు గత 2023 సంవత్సరం మార్చి 31 నాటికి ఒప్పందం ముగిసిందని, జూన్‌లో ఒప్పందం చేసుకుని బకాయిలు చెల్లించారని తెలిపారు. అయితే ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి కొత్త కూలి రేటు ఇవ్వాల్సి ఉండగా... యాజమాన్యాలు అక్టోబరు నుంచి ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మద్యం కంపెనీల యాజమాన్యాలతో మాట్లాడి వెంటనే కార్పొరేషన్ అధికారులు సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఒక బాక్సుకు 6 రూపాయల 60 పైసలు ఇస్తుండగా... కార్మిక సంఘాలు పది రూపాయలు డిమాండ్ చేస్తున్నాయని చెప్పారు. కానీ ప్రస్తుతం అన్ని రకాల ధరలు విపరీతంగా పెరిగాయని, అందుకు అనుగుణంగా కూలి రేట్లు కూడా పెంచాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఇందుకు ససేమిరా అంగీకరించని మద్యం కంపెనీల యజమానులు వెళ్లిపోవడంతో చర్చలు సఫలం కాలేదు. కార్పొరేషన్ అధికారులు తిరిగి జులై 10న చర్చలు జరుపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హమాలీ సంఘం నాయకులు పవన్, చంద్రన్న, రాజా శ్రీను, ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

9న మునిసిపల్ కార్మికుల సమ్మె

నగరపాలక శాఖ డైరెక్టర్‌కు నోటీసు అందజేత

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి : రంగనాయకులు డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జులై 9న మునిసిపల్ కార్మికులు సమ్మెకు దిగనున్నారు. ఈ మేరకు బుధవారం ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.రంగనాయకులు నగరపాలక శాఖ డైరెక్టర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం రంగనాయకులు మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు అందజేయాలని, పర్మినెంట్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలు, సరెండర్లు, ఎన్‌క్యాష్‌మెంట్ విడుదల చేయాలని, పార్కు కూలీలకు కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలని, మరణించిన, పదవీ విరమణ చేసిన వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులకు తిరిగి పనులు కల్పించాలని, కార్మికులు మరణిస్తే దహన ఖర్చులు పెంచాలన్న తదితర డిమాండ్లపై ఏఐటీయూసీ జాతీయ సమితి పిలుపులో భాగంగా సమ్మెకు వెళ్లనున్నట్లు తెలిపారు. సమ్మెను నివారించాలంటే పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నీ సత్వరం పరిష్కరించాలని, లేనిపక్షంలో జరగబోయే సమ్మె పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. సమ్మె నోటీసులు అందజేసిన వారిలో ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దొరసామి, సహాయ కార్యదర్శి రామకృష్ణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులు... పథకాలపై సీఎస్‌లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వివిధ ప్రగతి ప్రాజెక్టులు, పథకాలను సకాలంలో పూర్తి చేసేందుకు అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రధాని మోదీ సూచించారు. ఆధార్ సంబంధిత ఫిర్యాదులు, ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ (పీఎం అభియాన్), 5వ ట్రీమ్ అల్యూమినియ రిఫైనరీ విస్తరణ ప్రాజెక్టు తదితర ప్రగతి అంశాలపై బుధవారం దిల్లీ నుంచి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ... కేబినెట్ కార్యదర్శి డా. టి.వి.సోమనాథన్‌తో కలిసి వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా రాష్ట్రాల్లో ప్రాజెక్టులు, పథకాల ప్రగతిని సమీక్షించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, కాంతిలాల్ దండే, ఐఎఫ్ఎస్టీ ప్రత్యేక కార్యదర్శి ఎస్.శర్వానందన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

'గోదావరి-బనకచర్ల'తో ప్రయోజనం శూన్యం

- కృష్ణా జలాలు దోచుకోవడానికి తెలంగాణ కుట్ర
- కాంట్రాక్టర్లు, రాజకీయ వేత్తలకే లబ్ధి
- ప్రజలే ఉద్యమించాలి
- సోమశిల ప్రాజెక్టు చేపట్టాలి
- 'ఆలోచనాపరుల వేదిక'లో వక్తలు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాతకంగా తీసుకున్న గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుతో మన రాష్ట్రానికి ఎటువంటి ప్రయోజనం ఉండదని వక్తలు స్పష్టం చేశారు. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆలోచనాపరుల వేదిక అధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ ఐఏఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరావు మాట్లాడుతూ... బనకచర్లను సాకుగా చూపి తెలంగాణ ప్రభుత్వం కృష్ణా జలాలను మరింత దోచుకోవటానికి కుట్ర చేస్తుందని విమర్శించారు. అసలు ఈ ప్రాజెక్టుకు పునాది ఐదేళ్ల క్రితమే జగన్... కేసీఆర్ సీఎంలుగా ఉండగానే మెగా కృష్ణారెడ్డి బుర్రలో పుట్టిన ఆలోచనే అన్నారు. ఈ ప్రాజెక్టు జగన్ మానసపుత్రిక అయితే ... ప్రస్తుత సీఎం చంద్రబాబు ముందుకు తీసుకొచ్చి దానిని అత్యంత వేగంగా చేపట్టేందుకు అడుగులు వేస్తున్నారని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు అవసరం నాయకులకు తప్ప ప్రజలకు, రైతులకు ఎటువంటి ప్రయోజనం ఉండదన్నారు. ప్రజల అభిప్రాయాలను గౌరవించకుండా ఏకపక్షంగా భారీ ప్రాజెక్టులను చేపట్టే నైతిక హక్కు ప్రభుత్వాలకు ఎక్కడుందని ప్రశ్నించారు. ప్రజలు అధికారం ఇచ్చారని ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం తగదని హితవు పలికారు. ప్రజలే ప్రతిపక్షంగా దీనిపై ఉద్యమ నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. నీటిపారుదల రంగ విశ్లేషకులు టి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బనకచర్ల ... కేవలం, కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకులకు లబ్ధి చేకూర్చేందుకు మాత్రమే పనికొస్తుందన్నారు. రాయలసీమలో ఎన్టీఆర్ హయాంలో ప్రారంభించిన అనేక ప్రాజెక్టులు ఇప్పటి వరకూ పూర్తి కాలేదని, వాటిని పూర్తి చేయకుండా రూ.80వేల కోట్లతో బనకచర్ల చేపడితే ఎప్పటికి పూర్తవుతుందని నిలదీశారు. గోదావరి నికర జలాలను పోలవరం కుడికాలువ ద్వారా తరలించి కృష్ణానదిలో నూతనంగా నిర్మించతలపెట్టిన బొల్లాపల్లి రిజర్వాయర్‌కు చేర్చాలన్నారు. కృష్ణా డెల్టా, నాగార్జున సాగర్ కుడి, ఎడమ కాలువల ఆయకట్టుకు, పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ఆయకట్టుకు వినియోగించుకోవాలని, తద్వారా ఆదా అయ్యే కృష్ణా జలాలను శ్రీశైలం జలాశయం నుంచి గ్రావిటీ ద్వారా బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ ద్వారా తెలుగు గంగ, గాలేరు నగరికి సరఫరా చేయాలన్నారు. అలాగే సోమశిల, తెలుగు గంగ, గాలేరు నగరి ప్రాజెక్టు పరిధిలో ఉన్న నెల్లూరు, తిరుపతి,చిత్తూరు జిల్లాలోని ఆయకట్టు వరకూ గోదావరి వరద నీటిని బొల్లాపల్లి నుంచి గ్రావిటీ ద్వారా అందించవచ్చని వివరించారు. అదా అయ్యే పెన్నా నది నీటిని అనంతపురం, కడప అన్నమయ్య జిల్లాలకు అందించవచ్చన్నారు. గోదావరి-పెన్నా అనుసంధానం రాష్ట్ర భవిష్యత్తుకు ముఖ్యమని పేర్కొన్నారు. నీటిపారుదల శాఖ విశ్రాంత ఇంజనీరు కంభంపాటి పాపారావు మాట్లాడుతూ బనచర్లను పక్కన బెట్టి సోమశిల ప్రాజెక్టును చేపట్టాలని సూచించారు. 1985-1989 మధ్య బనకచర్ల వద్ద ప్రాజెక్టు నిర్మించారని, దానిని నింపేందుకు 16 కిలో మీటర్ల దూరంలో ఉన్న పోతిరెడ్డిపాడు నుంచి ఉపయోగించుకోవడం చేతకాక 400 కిలో మీటర్ల దూరంలో ఉన్న పోలవరం నుంచి నీరు తీసుకొస్తామనటం ఆశ్చర్యంగా ఉందన్నారు. వరద నీటిని రాయలసీమకు తరలించడంతో ప్రభుత్వాలు వైఫల్యం చెందుతున్నాయన్నారు. రైతు సేవా సంస్థ అధ్యక్షుడు అక్కినేని భవానీ ప్రసాద్ మాట్లాడుతూ... బనకచర్ల ప్రాజెక్టు ద్వారా ప్రజలకు ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. బనకచర్ల కారణంగా కృష్ణానది నుంచి 200 టీఎంసీల నీటి హక్కులను ఏపీ కోల్పోతుందని చెప్పారు.

పూణె మెట్రో రైలు రెండో దశకు పచ్చజెండా

- రూ.3,626 కోట్ల వ్యయంతో నిర్మాణం
- ఝరియా బొగ్గు గనుల నిర్వాసితుల పునరావాసానికి రూ.5,940 కోట్లు
- ఆగ్రాలో పొటాలో సెంటర్ ఏర్పాటుకు ఆమోదం
- కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గం అనేక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. బుధవారం జరిగిన ఈ సమావేశంలో తొలుత ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా తీర్మానాన్ని ఆమోదించింది. శుభాంశు శుక్లాతో కూడిన మిషన్ విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రవేశించడాన్ని స్వాగతించింది. మరో తీర్మానానికి ఆమోదం తెలిపిన మంత్రివర్గం పూణె, ఆగ్రాలో అనేక ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అత్యవసర పరిస్థితి ప్రకటనకు 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మంత్రివర్గ తీర్మానాన్ని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. 'అత్యవసర పరిస్థితిపై పోరాడిన లెక్కలేనన్ని మంది త్యాగాలను గుర్తుంచుకోవాలని నిర్ణయించింది. రాజ్యాంగాన్ని హత్య చేసే ప్రయత్నాన్ని విఫలం చేసిన ఈ ప్రజాస్వామ్యవాదులకు కేంద్ర మంత్రివర్గం నివాళు లర్పించింది' అని తెలిపారు.

పూణె మెట్రో రైలు ప్రాజెక్టు దశ-2ను రూ.3,626 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టేందుకు ఆమోదించిందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ విస్తరణలో భాగంగా ఈ రెండు ఎలివేటెడ్ కారిడార్లు 12.75 కి.మీ. విస్తరించి ఉంటాయని... 13 స్టేషన్లు ఉంటాయన్నారు. చాందినీ చౌక్, బవ్ధాన్, కోత్రుడ్, ఖరడి, వాఘోలి వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న శివారు ప్రాంతాలను కలుపుతాయన్నారు. ఈ ప్రాజెక్టును నాలుగు సంవత్సరాలలోపు పూర్తి చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. అలాగే జార్ఖండ్‌లోని ఝరియా బొగ్గు గనుల నిర్వాసితుల పునరావాసానికి (ఝరియా మాస్టర్ ప్లాన్) రూ.5,940 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. నిర్వాసిత కుటుంబాలకు ఆర్థిక స్వావలంబన కల్పించడం కోసం నైపుణ్య శిక్షణ, స్థిరమైన ఉపాధి అవకాశాలను కల్పించనున్నట్లు తెలిపారు. ఉత్తర ప్రదేశ్‌లోని ఆగ్రాలోని సింగ్నాలో దక్షిణాసియా ప్రాంతీయ కేంద్రం ఆఫ్ ది ఇంటర్నేషనల్ పొటాటో సెంటర్ (సీఐపీ) ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీనికి రూ.111.5 కోట్లు కేటాయించింది. ఆహారం, పోషకాహార భద్రత, రైతుల ఆదాయం, ఉపాధి కల్పనను పెంచడం దీని ప్రధాన ప్రధాన లక్ష్యం. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బంగాళాదుంప ఉత్పత్తి చేస్తున్న దేశం భారత్ కాగా, ఇందులో ఉత్తర ప్రదేశ్ ముందువరుసలో ఉన్నది. పొటాటో సెంటర్ ఏర్పాటుతో బంగాళాదుంప ఉత్పత్తి, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, రవాణా, మార్కెటింగ్, విలువ గొలుసులో గణనీయమైన ఉపాధి అవకాశాలను సృష్టించే సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. అలాగే యూపీలో ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది. యూపీ గౌతమ్ బుద్ధనగర్‌లో రూ.417 కోట్లతో ఈఎంసీ క్లస్టర్‌ను కేంద్రం ఏర్పాటు చేయనున్నది.

'యోగాంధ్ర'పై ప్రధాని ప్రశంసలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన "యోగాంధ్ర" కార్యక్రమంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. బుధవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ కార్యక్రమం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించిన ఆయన, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ల దార్శనికతను, అమలు తీరును కొనియాడారు. తాను చూసిన కార్యక్రమాల్లో ఇది అత్యంత ప్రతిష్టాత్మకమైనదని, ప్రభావవంతమైనదని ఆయన పేర్కొన్నారు. "యోగాంధ్ర" వంటి భారీ కార్యక్రమాన్ని తాను ఇంతకు ముందెన్నడూ చూడలేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కేబినెట్ సమావేశంలో వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన నెల రోజుల యోగా కార్యక్రమం ఒక అసాధారణ విజయమని ఆయన కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ల నాయకత్వంలో ఈ కార్యక్రమం విజయవంతమైందని, వారి కృషి అభినందనీయమని ప్రధాని పేర్కొన్నారు. "ఇప్పటివరకు ఎన్నో కార్యక్రమాలను చూశాను, కానీ 'యోగాంధ్ర' స్థాయిలో, స్ఫూర్తితో జరిగిన కార్యక్రమాన్ని చూడలేదు. దీనిని రూపొందించి, అమలు చేసిన తీరు నా అంచనాలను మించిపోయింది" అని మోదీ తన కేబినెట్ సహచరులతో అన్నట్లు సమాచారం. "యోగాంధ్ర" కార్యక్రమ ప్రణాళిక, ప్రజలను భాగస్వాములను చేసిన తీరు, అమలు చేసిన విధానాలపై సమగ్ర నివేదికను సమర్పించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరినట్లు ప్రధాని తెలిపారు. ఆ నివేదిక అందిన తర్వాత, దానిని అన్ని రాష్ట్రాలకు పంపిస్తామని, వారు కూడా దీనిని అధ్యయనం చేసి, ఉత్తమ పద్ధతులను అనుసరించవచ్చని సూచిస్తామని ఆయన వెల్లడించారు. ఒక మంచి కార్యక్రమాన్ని ఎలా విజయవంతం చేయాలో చంద్రబాబు, లోకేశ్ లను చూసి మిగతా వారు నేర్చుకోవాలని ప్రధాని సూచించారు. "యోగాంధ్ర" విజయాన్ని అందరూ అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రులకు తెలియజేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.